


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 132 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 24 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 132 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 24 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఇంధన భయం వద్దు..41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు



- ఎల్పీజీ అవసరాల్లో 60శాతం దిగుమతులపై ఆధారం
- గల్ఫ్ లోని భారతీయుల భద్రతకు ప్రాధాన్యం
- పశ్చిమాసియా నుంచి 3.75 లక్షల మంది భారతీయులను రప్పించాం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు, ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం
- మూడు వారాలుగా కొనసాగుతున్న ఘర్షణపై ప్రధాని ఆందోళన
- లోక్ సభలో మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

**హైదరాబాద్ పెన్ పవర్:**పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నప్పటికీ దేశానికి ఇంధన సరఫరాపై ఎలాంటి అంతరాయం రాకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. పార్లమెంట్? లో చేసిన ప్రకటనలో యుద్ధ ప్రభావాలను తగ్గించేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని, అన్ని రంగాల భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రభావితులకు అవసరమైన మద్దతు అందిస్తున్నామని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా దేశవ్యాప్తంగా కొనసాగుతూనే ఉంటుందని అన్నారు.

మిగతా 2లో

## రోజుకు 1.5జీబీ డేటా వాడుకోమని ఇచ్చి.. డేటా మిగిల్తే మిడ్ నైట్‌కు మాయం చేయడం ఏంటి ?




**హైదరాబాద్ పెన్ పవర్:**టెలికాం కంపెనీల డైలీ డేటా ప్లాన్స్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభలో గళమెత్తారు. టెలికాం కంపెనీలు డైలీ డేటా లిమిట్ ప్లాన్స్‌ను తీసుకొచ్చాయని.. డైలీ డేటా ప్లాన్స్ 1.5 జీబీ, 2జీబీ, 3జీబీ 24 గంటల వ్యాలిడిటీతో అందిస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. ప్రతీ 24 గంటలకు ఈ రీఛార్జ్ ప్లాన్‌లో భాగంగా డేటా రీసెట్

మిగతా 2లో

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ తప్ప

# ఏదీ అమలు చేయలేదు

- అన్ని గ్యారెంటీలను ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శలు
- హామీలను అమలు చేసినట్లు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- ఎన్నికల హామీలపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ ఆందోళన



**హైదరాబాద్ పెన్ పవర్:**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ తప్ప ఏ హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. మిగతా అన్ని గ్యారెంటీలను పక్కన పెట్టి, వాటిని అమలు చేసినట్లు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై రాష్ట్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ, ఆరు గ్యారెంటీల్లో ప్రజలకు ఒక్కటి కూడా చేరడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు రైతు భరోసా కింద ఇంకా ఎకరానికి రూ.45 వేల కోట్ల బకాయిలు చెల్లించవలసి ఉందని అన్నారు. దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. దీంతో విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

- హైదరాబాద్ ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్
- భారీ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తామని వెల్లడి
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్న సీఎం



**హైదరాబాద్ పెన్ పవర్:**పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగరాన్ని మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నట్లు వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ఈ ప్రణాళిక సాగనుంది. నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే లక్ష్యంగా అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు మరియు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యంగా శామీర్‌పేట, మేడ్చల్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక కారిడార్లు నిర్మిస్తామని, దీని కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో మాట్లాడి భూసేకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. మెట్రో రైలు విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వమే రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకుందని, త్వరలోనే

మిగతా 2లో

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం

### డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

- 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- రెండు రోజులుగా ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని వెల్లడి
- ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నామని ప్రకటన

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై



మిగతా 2లో



## క్యూనెట్ కేసులో 32 మంది అరెస్టు.. ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే

- అరెస్టైన 32 మందిలో 11 మంది మహిళలు
- నిందితుల నుంచి ఒప్పంద పత్రాలు, లాప్‌టాప్‌లు స్వాధీనం
- 30 టీమ్‌లతో కేసును ఛేదించినట్లు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట కోట్లాది రూపాయల మోసానికి పాల్పడింది. ఈ కేసులో సీసీఎస్ పోలీసులు 32 మంది నిందితులను అరెస్టు చేశారు. క్యూనెట్ కేసుకు సంబంధించి హైదరాబాద్ సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ, మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట క్యూనెట్ మోసం చేస్తోందని, మూడు రాష్ట్రాల్లో సోదాలు


మిగతా 2లో

## అసెంబ్లీలో 'బియ్యం' రాజకీయం

### ఎగుమతులపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు.. దీటుగా బదులిచ్చిన మంత్రి ఉత్తమ్!

- సీబీఐ, ఐడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అడ్వైజర్ గా ఎలా నియమించుకుంటారని హరీశ్ ప్రశ్న
- ఎగుమతులు 22,750 టన్నుల వద్దే ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్న
- హరీశ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- బియ్యం ఎగుమతుల్లో ప్రేమ్ చంద్ కు సంబంధం లేదని వ్యాఖ్య

2లో



## 'రీల్' లైఫ్‌లోనైనా సీఎం అవుతా.. రేవంత్ రెడ్డిని నేనే ముఖ్యమంత్రిని చేశా

- వెండి తెరపై సీఎం రోల్ పోషించాలని ఉందన్న మల్లారెడ్డి
- తాను, రేవంత్ రెడ్డి అన్నదమ్ములమేనని వ్యాఖ్య
- 'ఉస్తాద్ భగత్ సింగ్'లో తనకు విలన్ ఆఫర్ వచ్చిందని వెల్లడి

మిగతా 2లో



### హైదరాబాద్ సహా తెలంగాణలో పలుచోట్ల

## పెట్రోల్ బంకులు మూత!

- ఇంధన కొరతతో తాత్కాలికంగా మూతబడిన పెట్రోల్ బంకులు
- హైదరాబాద్‌లో ప్రధాన కూడళ్లలోని బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు
- తెరిచి ఉన్న బంకుల్లో బారులుతీరిన వాహనదారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా యుద్ధం నేపథ్యంలో మన దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ తదితరాలపై భారీ ప్రభావం పడుతోంది. హైదరాబాద్‌లో ఇంధన కొరత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకులు తాత్కాలికంగా



మిగతా 2లో

## మూడు డీఏ బకాయిలను త్వరలోనే క్లియర్ చేస్తామన్న మల్లు భట్టి

- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పిన మల్లు భట్టి విక్రమార్క
- గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని విమర్శ
- ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిలు విడుదల చేస్తున్నామని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యో గులు ఎప్పుడెప్పుడా అని ఎదు రుచూస్తున్న డీఏ బకాయిల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు స్పష్టతనిచ్చింది.



మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# యుద్ధాల్లో బలి అవుతున్న బాల్యం

ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మొదటగా నశించేది మానవత్వం, ఎక్కువగా నష్టపోయేది బాల్యం. బాంబులు పడుతున్నప్పుడు కూలిపోతున్నది కేవలం భవనాలు కాదు. వేలాది బాలల కలలు, భవిష్యత్తు కూడా. ఉక్రెయిన్, గాజా, ఇరాన్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు లక్షలాది పిల్లలను అనాథలుగా, శరణార్థులుగా మార్చుతున్నాయి. చదువు, ఆరోగ్యం, భద్రత వంటి ప్రాథమిక హక్కులు కూడా వారికి అందకుండా పోతున్నాయి. బాలలు యుద్ధాలకు కారణం కాకపోయినా, ప్రతి యుద్ధంలో అత్యధికంగా బాధపడుతున్నవారు వారే. అందుకే బాలల హక్కులను కాపాడటం అంటే యుద్ధాలను ఆపడం, శాంతిని కాపాడటం. ప్రపంచంలో ఎక్కువ యుద్ధాలు ప్రధానంగా నాలుగు అంశాల కోసం జరుగుతున్నాయి. మొదటిది రాజకీయ అధికారం. కొంతమంది నాయకులు 'విదేశీ శత్రువు' అనే బూచిని సృష్టించి జాతీయతను రెచ్చగొట్టి తమ అధికారాన్ని పటిష్టపరుచుకుంటారు. రెండవది ఆయుధ వ్యాపారం. ఆయుధ తయారీ సంస్థలు ప్రపంచంలో అత్యధిక లాభాలను పొందే రంగాల్లో ఒకటి. యుద్ధం మొదలైతే కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతుంది. మూడవది సహజ వనరులపై ఆధిపత్యం. చమురు, గ్యాస్, ఖనిజాలు, నీరు వంటి వనరుల కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. నాలుగవది మతం లేదా జాతీయత. ఇవి చాలాసార్లు నిజమైన కారణాలు కాకుండా ప్రజలను యుద్ధానికి ప్రేరేపించే ఒక ముసుగుగా ఉపయోగపడతాయి. ఈ నాలుగు కారణాల్లో ఒక్కటి కూడా సాధారణ ప్రజల ప్రయోజనం కోసం కాదు. లాభం కొద్ది మందికి, నష్టం కోట్లాది మందికి.

ఆధునిక యుద్ధాల్లో మరణించే వారిలో ఎక్కువ మంది సైనికులు కాదు, సాధారణ ప్రజలు. అందులో పెద్ద భాగం బాలలే. అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం ఆధునిక యుద్ధాల్లో సుమారు 90 శాతం మరణాలు సాధారణ ప్రజలవే. బాలలను కోల్పోతే మనం మన భవిష్యత్తును కోల్పోతున్నాం. ఎవరి లాభంకోసమైనా బాలల రక్తాన్ని ఖర్చు చేయడం మానవత్వానికే మచ్చ. బాలలు యుద్ధాలకు కారణం కాదు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నాలుగేళ్లుగా కొనసాగుతోంది. దీని ప్రభావం లక్షలాది కుటుంబాలపై పడింది. నివేదికల ప్రకారం 2022 నుంచి కనీసం 3200 మంది బాలలు చనిపోయారు లేదా గాయపడ్డారు. ఒక్క 2025లోనే 92 మంది బాలలు మరణించగా, 652 మంది గాయపడ్డారు. దేశంలోని మూడింట ఒక వంతు బాలలు మానసిక గాయాలకు గురయ్యారు. పాఠశాలలు ధ్వంసం కావడం, విద్యుత్ సౌకర్యాలపై దాడులు జరగడం వల్ల పిల్లలు చదువు, ఆరోగ్య సేవలు కోల్పోతున్నారు. చాలామంది శరణార్థులుగా మారిపోయారు. 2023 అక్టోబర్ నుంచి కొనసాగుతున్న గాజా యుద్ధం బాలలపై అత్యంత దారుణ ప్రభావం చూపింది. నివేదికల ప్రకారం 21 వేలకు పైగా బాలలు చనిపోయారు. 44 వేలకుపైగా బాలలు గాయపడ్డారు. వారిలో వేలాది మంది శాశ్వత వికలాంగులయ్యారు. 56 వేలకుపైగా బాలలు తమ తల్లిదండ్రులను కోల్పోయారు. పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. ఆహారం లేక వేలాది బాలలు ఆకలి చావు అంచున ఉన్నారు. ఈ యుద్ధం వేలాది బాలలను అనాథలుగా, భయంతో జీవించేలా చేసింది.

ఫిబ్రవరి 2026 లో ప్రారంభమైన ఇరాన్ యుద్ధం కూడా బాలలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రారంభ దాడుల్లోనే 180 నుండి 200 మంది బాలలు మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఒక పాఠశాలపై జరిగిన దాడిలో 168 మంది బాలికలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. పలు పాఠశాలలు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయి. విద్య, ఆరోగ్య సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రపంచ సంఘర్షణల్లో బాలలపై ఆరు ప్రధాన ఉల్లంఘనలు జరుగుతున్నాయి. బాలలను చంపడం లేదా గాయపరచడం. బాలలను సైనికులుగా ఉపయోగించడం. పాఠశాలలు, ఆసుపత్రులపై దాడులు. లైంగిక హింస, బాలల అపహరణ. మానవతా సహాయాన్ని నిరాకరించడం. ఇవి అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకం అయినప్పటికీ యుద్ధాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచంలో కోట్లాది బాలలు యుద్ధ ప్రభావంలో జీవిస్తున్నారు. నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 47.3 కోట్ల బాలలు ఘర్షణాత్మక ప్రాంతాల్లో జీవిస్తున్నారు. ప్రతి రోజూ సగటున 23 మంది బాలలు బాంబు దాడుల్లో గాయపడుతున్నారు. లేదా చనిపోతున్నారు. పాఠశాలలపై దాడులు గణనీయంగా పెరిగాయి. లక్షలాది బాలలు స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారు. కోట్లాది బాలలు శరణార్థులుగా మారిపోయారు. యుద్ధం వారి జీవితాలను శాశ్వతంగా మార్చేస్తోంది.

యుద్ధం ఎప్పుడూ సమస్యకు పరిష్కారం కాదు. దేశాలు సంభాషణలు, చర్చలు, డిప్లమసీకి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతర్జాతీయ చట్టాలను బలోపేతం చేయాలి. ఆయుధ వ్యాపారంపై నియంత్రణ ఉండాలి. నాయకుల జవాబుదారీతనం పెరగాలి. ప్రజలు కూడా యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి కోసం గొంతెత్తాలి. బాలలు యుద్ధాలకు కారణం కాదు. కానీ వారు బాధితులు. అందువల్ల వారిని "బలి"గా కాదు, "శాంతి దూతలు"గా చూడాలి. పాఠశాలలు, బాలల క్లబ్బులు, లైబ్రరీల్లో శాంతి కోసం డ్రాయింగ్ కార్యక్రమాలు, కథలు, నాటికలు, కళా ప్రదర్శనలు నిర్వహించాలి. సోషల్ మీడియాలో శాంతి సందేశాన్ని విస్తరించాలి. యుద్ధాలు ఎప్పుడూ శాంతిని తీసుకురావు. అవి కేవలం మరిన్ని కన్నీళ్లు, మరిన్ని చావులు, మరిన్ని అనాథలను మాత్రమే సృష్టిస్తాయి. బాంబు పడిన ప్రతిసారీ చిన్నారుల కలలు చనిపోతాయి. ప్రతి యుద్ధం ఒక తరం భవిష్యత్తును నాశనం చేస్తుంది. బాలలు చదువుకోవాలి, ఆడుకోవాలి, కలలు కనాలి. కానీ యుద్ధం వారిని భయం, ఆకలి, నిరాశల మధ్య బతికేలా చేస్తోంది. ప్రపంచం ఇప్పుడు ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. బాలల రక్షణ ముందా? యుద్ధాల రాజకీయ ప్రయోజనాలా? నిర్ణయించుకోవాలి. బాలల భవిష్యత్తు మన చేతుల్లో ఉంది. కాబట్టి యుద్ధాలను వ్యతిరేకించాలి. యుద్ధాలు ఆపాలి. శాంతిని కాపాడాలి. బాలల హక్కులను రక్షించాలి. బాలల రక్షణ అంటే మానవత్వ సంరక్షణ.

# అసెంబ్లీలో 'బియ్యం' రాజకీయం

రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేసిన హరీశ్ రావు... ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు. ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం పారదర్శకంగా

ఉంటే తాము చేసే ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు. హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తిప్పికొట్టారు. ఇవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలని, ప్రతిపక్ష నేతలు సిఫార్సు చేసిన వారికి పదవులు దక్కలేదనే అక్కసుతోనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తావించిన ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎటువంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారిక ఒప్పందమని స్పష్టం చేశారు.

ఫిలిప్పీన్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం కారణంగానే ఎగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే అక్కడ అన్ని దిగుమతులపై ఆంక్షలు ఉన్నప్పటికీ కేవలం తెలంగాణ బియ్యానికి మాత్రమే మినహాయింపు లభించిందని వివరించారు. కేవలం ఒక షిప్‌మెంట్ మాత్రమే కాకినాడ పోర్టులో నిలిచిపోయిందని, అంతకు మించి అక్రమాలు ఏవీ జరగలేదని మంత్రి సభలో స్పష్టమైన వివరణ ఇచ్చారు.

## హైదరాబాద్ సహా తెలంగాణలో పలుచోట్ల
# పెట్రోల్ బంకులు మూత!

- మొదటి పేజీ తరువాయి

మూతబడ్డాయి. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలోని బంకులు వరుసగా మూతబడుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.

సోమాజిగూడ, ఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లోని పెట్రోలు బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ పలు పెట్రోల్ బంకులు తాత్కాలికంగా తెరుచుకోవడం లేదు. తెరిచి ఉన్న బంకుల్లో వాహనదారులు బారులు తీరుతున్నారు.యుద్ధానికి ముందు చమురు రంగ కంపెనీలు

క్రెడిట్ ఇచ్చేవని, కానీ ఇటీవల ఇవ్వడం లేదని పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. కొత్తగా పెట్రోల్, డీజిల్ స్టాక్ కావాలంటే అడ్వాన్స్ కడితేనే వస్తుందని చెబుతున్నారు. కాగా, ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇరాన్ కూడా ట్రంప్ ప్రకటనకు సానుకూలంగా ఉండే అవకాశం ఉంది.

## మూడు డీఏ బకాయిలను త్వరలోనే
# క్లియర్ చేస్తామన్న మల్లు భట్టి

- మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీలో బడ్జెట్ పై చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన మూడు డీఏ బకాయిలను తమ ప్రభుత్వం త్వరలోనే క్లియర్ చేయబోతున్నట్లు ప్రకటించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 40 వేల కోట్లకు పైగా బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, అందులో ఉద్యోగులకు చెల్లించాల్సిన వాటానే రూ. 4,571 కోట్లు ఉందని భట్టి విక్రమార్క వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బకాయిలను మానవతా కోణంలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రిటైర్మెంట్ ప్రయోజనాలను కూడా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, వాటిని కూడా త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, అలాగే ఉద్యోగుల కోసం క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు కూడా అందజేశామని గుర్తుచేశారు.

# క్యూనెట్ కేసులో 32 మంది అరెస్టు.. ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే

- మొదటి పేజీ తరువాయి

నిర్వహించామని ఆయన తెలిపారు. అరెస్టైన 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు.అరెస్టై నిందితుల నుంచి భారీగా ఒప్పంద పత్రాలు, లాప్‌టాప్‌లు, వస్తువులు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు ముప్పై బృందాలుగా విడిపోయి ఆపరేషన్ నిర్వహించినట్లు వెల్లడించారు. క్యూనెట్ నిర్వాహకులు 1998 నుంచి వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు.క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించినట్లు తెలిపారు. సిద్దిపేటకు చెందిన హరికృష్ణ రూ.5 లక్షల మేర మోసపోయారని, ఆయన ఫిర్యాదుతో ఈ సంస్థ కార్యకలాపాలపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కట్లు, హెల్త్ ఫుడ్స్ పేరిట ప్రజల్లోకి వెళుతూ మోసం చేస్తున్నట్లు గుర్తించామని అన్నారు. ఇష్టపూర్వకంగానే సంస్థలో చేరుతున్నట్లు ముందుగానే బాండ్‌పేపర్‌పై రాయించుకుని క్యూనెట్‌లోకి తీసుకుంటున్నారని తెలిపారు.

అరెస్టైన వారిలో ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నమోదైన 4 కేసుల్లో 11 మంది బాధితులకు దాదాపు రూ.75 లక్షల నష్టం జరిగినట్లు గుర్తించామని అన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని తెలిపారు. ఇలాంటి పథకాల్లో చేరడం, చేర్పించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇంకా బాధితులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నెల రోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి, పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించి నిందితులను అరెస్టు చేసినట్లు సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.

## హైదరాబాద్ ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

- మొదటి పేజీ తరువాయి

మరో 76 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. నగర సుందరీకరణలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకీకరిస్తే మూసీ సుందరీకరణ వేగంగా పూర్తవుతుందని రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో అత్యాధునిక 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని, గతంలో గుజరాత్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు ఎలాగైతే కలిశాయో, హైదరాబాద్ అభివృద్ధి కోసం కూడా ప్రతిపక్షాలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం

- మొదటి పేజీ తరువాయి

దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు."గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు.పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

# 'రీల్' లైఫ్‌లోనైనా సీఎం అవుతా.. రేవంత్ రెడ్డిని నేనే ముఖ్యమంత్రిని చేశా

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడ ఉంటే అక్కడ సందడి ఖాయం. తాజాగా తెలంగాణ అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించిన మల్లన్న, తన మనసులోని అసలు కోరికను బయటపెట్టారు. రాజకీయంలో సీఎం ఎలాగూ కాలేను, కనీసం వెండితెరపై అయినా ముఖ్యమంత్రి పాత్ర పోషించాలని తనకు బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సినిమాల్లో సీఎం రోల్ వస్తే చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అలా అయినా తన కోరికను తీర్చుకుంటానని నవ్వుతూ చెప్పారు.

"రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ రెడ్డి తప్ప మరో పవర్‌ఫుల్ లీడర్ లేరని గతంలోనే చెప్పాను. ఒక రకంగా ఆయన్ను సీఎం చేసింది నేనే" అంటూ తనదైన శైలిలో చమత్కరించారు. రాజకీయాలు ఎలా ఉన్నా, తాను రేవంత్ రెడ్డి అన్నదమ్ములమేనని ఆయన స్పష్టం చేశారు.సినిమాలపై తనకున్న మక్కువను వివరిస్తూ.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో తనకు విలన్ పాత్ర ఆఫర్ వచ్చిందని మల్లారెడ్డి వెల్లడించారు. దర్శకుడు హరీశ్ శంకర్ స్వయంగా అడిగినప్పటికీ, విలన్ వేషం వేయడం ఇష్టం లేక తాను సున్నితంగా తిరస్కరించానని చెప్పారు. విలన్ కంటే తనకు సీఎం లాంటి పవర్‌ఫుల్ పాత్రల పైనే ఆసక్తి ఉందని ఆయన హింట్ ఇచ్చారు.

# పోలీసుల తీరుపై అంబటి ధ్వజం.. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతానని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:తన నివాసం, కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసు ల వ్యవహారశైలిని నిరసిస్తూ మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. జనవరి 31న సుమారు 7 గంటల పాటు

తన ఆస్తులపై విధ్వంసం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగంపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

తన ఇంటిపై దాడి చేసిన వారికి కేవలం ఏడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లతో స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారని, కానీ అదే సెక్షన్లతో తనను మాత్రం 18 రోజుల పాటు జైలుకు పంపడం అన్యాయమని అంబటి మండిపడ్డారు. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆ స్టేషన్ లోని సీసీటీవీ ఫుటేజీని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు.టీడీపీ నేతలు దాడి చేస్తున్నప్పుడు పోలీసులు వారికి పూర్తిగా సహకరించారని, తాను ఫిర్యాదు చేసే వరకు కనీసం సుమోటోగా కూడా కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు ఈ కేసులో దారుణంగా వ్యవహరించారని అన్నారు. ఈ దాడుల వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ హస్తం ఉందని నేరుగా ఆరోపించారు.ఈ కేసులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంబటి స్పష్టం చేశారు. ఈ ఘటనపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశామని, అక్కడ న్యాయం జరగకపోతే దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మెట్లు ఎక్కేందుకైనా సిద్ధమని హెచ్చరించారు

# ఇంధన భయం వద్దు..41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు

- మొదటి పేజీ తరువాయి

సామాన్యులపై వీటి ప్రభావం ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రధాని చెప్పారు. దేశ అవసరాల్లో సుమారు 60 శాతం ఎల్పీజీ దిగుమతులపై ఆధారపడుతున్నప్పటికీ సరఫరా అనిశ్చిత పరిస్థితుల్లో దేశీయ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ ఉత్పత్తిని పెంచుతున్నామని వెల్లడించారు.

**3.75 లక్షల మంది స్వదేశానికి రప్పించాం**

గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని స్పష్టం చేశారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి భారతీయులకు నిరంతర సహాయం అందిస్తూ ఇప్పటివరకు 3.75 లక్షల మందిని స్వదేశానికి రప్పించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పలు దేశాధినేతలతో కూడా చర్చలు జరిపినట్లు, భారతీయుల భద్రతపై వారు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అందుకే త్వరిత పరిష్కారం కోసం ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

**53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక నిల్వలు**

ఇంధనం భారత ఆర్థిక వ్యవస్థకు కీలకమని, పశ్చిమాసియా దేశాలు ప్రధాన వనరుగా కొనసాగుతున్నాయని తెలిపారు. సరఫరా నిరంతరత కోసం పలు దేశాలతో నిరంతర సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. హర్మూజ్ జలసంధి మార్గంలో చిక్కు కున్న భారత నౌకలు సురక్షితంగా తిరిగి చేరాయని వెల్లడించారు. దేశానికి 53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక చమురు నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, 41 దేశాల నుంచి ఇంధన దిగుమతులు జరుపుతున్నామని తెలిపారు.

**ప్రపంచంపై యుద్ధ ప్రభావం**

గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ ఘర్షణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ప్రధాని తెలిపారు. ఈ పరిస్థితుల్లో త్వరిత పరిష్కారం కోసం ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయని పేర్కొన్నారు.

# రోజుకు 1.5జీబీ డేటా వాడుకోమని ఇచ్చి.. డేటా మిగిల్తే మిడ్ నైట్‌కు మాయం చేయడం ఏంటి ?

- మొదటి పేజీ తరువాయి

అవుతుందని.. అయితే మిగిలిపోయిన డేటా మిడ్ నైట్‌కు ఎక్స్‌పైరీ అయిపోతుందని ఆయన వివరించారు. ఆ మిగిలిపోయిన డేటాకు ఎలాంటి రిఫండ్ ఉండదని చెప్పారు.

ఇదేదో పొరపాటున జరుగుతుంది కాదని.. ఇది టెలికాం కంపెనీల పాలసీ అని తెలిపారు. అవసరం ఉన్నా లేకపోయినా వాడుకోవాలని లేకపోతే మిడ్ నైట్?కు వ్యాలిడిటీ అయిపోతుందని.. ప్రస్తుతం ఇండియాలో మొబైల్ డేటాను టెలికాం కంపెనీలు ఇలా అందిస్తున్నాయని చెప్పారు. మిగిలిపోయిన.. వాడుకోని డేటాకు డబ్బులెందుకు కట్టాలని.. వాడుకోని డేటాను ట్రాన్స్?ఫర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలా జరిగితేనే.. రీఛార్జ్ చేసుకున్న కస్టమర్లకు న్యాయం జరుగుతుందని.. వాళ్లు కడుతున్న డబ్బుకు విలువ ఉంటుందని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా రాజ్యసభలో వాదించారు. ఈ అంశంపై ఆయన వాదనతో నెటిజన్లు ఏకపక్షంగా ఏకీభవించారు.

ఉదాహరణలతో సహా ఆయన వాదనను బలపరిచారు. ఒక కిరాణా షాపుకు వెళ్లి ఒక కిలో పంచదార కొన్నామనుకుందాం. ఆ కిలో పంచదారలో 800 గ్రాములు మాత్రమే వాడుకున్నాం. ఇంకా నా దగ్గర మిగిలిపోయిన 200 గ్రాముల పంచదారను అర్ధరాత్రి వచ్చి కిరాణా షాపు యజమాని తిరిగి తీసుకుపోడని.. టెలికాం కంపెనీల తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉందని నెటిజన్లు చెప్పారు.

టెలికాం కంపెనీల డైలీ డేటా లిమిట్?పై వినియోగదారుల నుంచి గతంలోనూ తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. అయినప్పటికీ టెలికాం కంపెనీలు డైలీ డేటా వినియోగంపై 24 గంటల వ్యాలిడిటీ మాత్రమే ఇచ్చాయి. రోజుకు ఇంత అని ఆఫర్ చేసిన డే టాను వినియోగదారుడు వాడుకోకపోతే అది అతని సమస్య అని, తమకు ఏం సంబంధం ఉం దని.. ఎందుకు ఆ డేటాను యాడ్ చేయాలనే రీతిలో టెలికాం కంపెనీలు వ్యవహరిస్తున్నాయి.

# కోర్టు ధిక్కరణ కేసులో దోషిగా హైడ్రా కమిషనర్..!






**హైదరాబాద్ పెన్ పవర్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు హై కోర్టులో చుక్కెదురైంది. కోర్టు ధిక్కరణ కేసులో తెలంగాణ హైకోర్టు ఆయనను దోషిగా తేల్చింది. బతుకమ్మ కుంట భూమి వ్యవహారంలో ఉద్దేశపూర్వకంగానే రంగనాథ్ కోర్టు ఆదేశాలు ఉల్లంఘించారని సోమవారం హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ వివాదంలో ఉన్న భూమిని, ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బతుకమ్మ కుంట నిర్మించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది హైకోర్టు. వివాదంలో ఉన్న బతుకుమ్మ కుంట భూమి వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై విచారించిన హైకోర్టు సోమవారం హైడ్రా కమిషనర్‌ను దోషిగా తేల్చింది. నాలుగు వారాల్లో సదరు భూమిలో చేపట్టిన అన్ని నిర్మాణాలను తొలగించాలని, పూర్తి నివేదికను అందజేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అత్యున్నత ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. చట్టాన్ని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన ప్రభుత్వ అధికారులపై కఠిన చర్యలు తప్పవని హైకోర్టు హెచ్చరించింది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారి 'అసిస్టెంట్ సిటీ ప్లానర్' (ఎసిపి) శ్రీనివాస్..

# 'ఎసిపి' సారథ్యంలో..!
# టిజి-బిపాస్ చట్టం ఉల్లంఘన..!

## డిప్యూటి కమిషనర్ మౌనం.. చట్టాన్ని తుంగలో తొక్కిన ఘనులు..?

-4 లో

- బహుదూర్‌పల్లిలో అక్రమ షెడ్డుకు టౌన్‌ప్లానింగ్ అధికారుల 'అండ'..?
- అధికార పార్టీ సిఫార్సులకు టిజి-బిపాస్ చట్టాన్ని తాకట్టు పెట్టి తలవంచారా..?
- రూ.లక్షల్లో డీల్ కుదుర్చుకుని..? ప్రభుత్వ ఖజానాకు గండి..?
- ఫిర్యాదులు వెళ్ళినా పట్టించుకోని ఏసిపి.. చకచకా పూర్తైన అక్రమ షెడ్డు..!
- ఈ వ్యవహారంలో ఏసిపి నుంచి చైన్‌మెన్ వరకు సహకరంపై ఆరోపణలు..!

బహుదూర్‌పల్లిలో టిజి-బిపాస్ చట్టాన్ని బహిరంగంగానే తుంగలో తొక్కుతూ, టౌన్‌ప్లానింగ్ అధికారుల అండతో అక్రమ షెడ్డు నిర్మాణం పూర్తికావడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. దున్నపోతు మీద వర్షం పడిన వైనాన్ని అవలంభిస్తున్న అధికారులు.. ఈ వ్యవహారంలో రూ.లక్షల్లో చేతులు మారినట్టు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మరోవైపు ఉన్నతాధికారులకు వాటాలు వెళ్తున్నందునే చర్యలు లేవనే విమర్శలు దుమారం లేపుతోంది.. దుండిగల్ సర్కిల్-59, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, టౌన్‌ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం ఇప్పుడు సంచలనం సృష్టిస్తుంది..
**దుండిగల్, పెన్ పవర్, మార్చి 23:**


బహుదూర్‌పల్లిలో భారీ షెడ్డు నిర్మాణం తుది దశలో..

## ముఖ్యమంత్రి పదవిపై మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

- కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్తులో బీసీ నాయకుడు సీఎం అవుతాడని వ్యాఖ్య
- కేసీఆర్, రామచందర్ రావులకు అలా చెప్పే దమ్ముందా అని నిలదీత
- బీజేపీ నాయకులు బీసీలకు వ్యతిరేకులు అని విమర్శ

-6 లో



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

- దుండిగల్‌లో బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్..
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని కృష్ణారెడ్డి ఆరోపణ..
- బౌరంపేట్ 'పిఏసిఎస్' బ్యాంకు పరిధిలో 650 మంది రైతులు..
- కేవలం 15 మందికి మాత్రమే "రైతు రుణమాఫీ" జరిగిందని విమర్శ..
- రైతుబంధు, రుణమాఫీ లేక రైతులకు తీవ్ర అన్యాయం..!
- ఈ అక్రమ అరెస్టులకు ప్రజలే సమాధానం చెబుతారన్న పీసరి కృష్ణారెడ్డి..

బీజేపీ నేత పీసరి కృష్ణారెడ్డిని అడ్డుకున్న దుండిగల్ పోలీసులు..


# ఆరు గ్యారెంటీల మోసంపై...
# అసెంబ్లీ ముట్టడికి పిలుపు

## అసెంబ్లీ ముట్టడిని అడ్డుకునేందుకు బీజేపీ నేత ముందస్తు అరెస్ట్..




దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో బీజేపి నేత పీసరి కృష్ణారెడ్డి, ఎంబరి ఆంజనేయులు..

**దుండిగల్, పెన్ పవర్, మార్చి 23:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డిని పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా దుండిగల్ పోలీసులు అడ్డగించి అదుపులోకి తీసుకున్నారు.. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాంటి పాలననే కొనసాగించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాల గొంతును నొక్కేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు.. రైతు సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రైతులకు ఏమి న్యాయం చేసిందని ఆయన ప్రశ్నించారు.. దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట పీఏసీఎస్ బ్యాంకులో 650 మంది రైతులు రుణాలు తీసుకోగా కేవలం 15 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని ఆరోపించారు.. మిగిలిన 635 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.. రైతుబంధు, రుణమాఫీ వంటి హామీలు అమలు చేయకుండా రైతులను నిర్లక్ష్యం చేయడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ అక్రమ అరెస్టులు, ప్రజావ్యతిరేక విధానాలకు త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కృష్ణారెడ్డి హెచ్చరించారు.

# అనుమతుల్లేని అక్రమ షెడ్డులో..
# మద్యం దుకాణం..!

## సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీడిమెట్ల సర్కిల్ షోకాజ్ నోటీసు జారీ..

- సుచిత్ర రోడ్డు వెన్నలగడ్డలో అక్రమ షెడ్డు నిర్మాణంపై నివాసితుల ఫిర్యాదు..
- జీహెచ్ఎంసి యాక్ట్ 1955 టిజి-బిపాస్ 2020 యాక్ట్ ఉల్లంఘనగా గుర్తింపు..
- మార్చి 16న జీడిమెట్ల సర్కిల్ సిఎంసి అధికారులు షోకాజ్ నోటీసు జారి..
- పనులు నిలిపివేసి 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని, పేర్కొన్న అధికారులు..
- ఏప్రిల్ 4న విచారణకు హాజరు కావాలి లేకపోతే కూల్చివేతకు హెచ్చరిక..
- కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ 'సిఎంసి'కి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు..




**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 23:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని సుచిత్ర వెన్నెలగడ్డలో..! రహదారి ఆక్రమణతో, అనుమతుల్లేని అక్రమ షెడ్డులో మద్యం దుకాణం నిర్వహణపై స్థానికులు మండి పడుతున్నారు.. సంబంధిత శాఖ ఎక్సైజ్ అధికారులకు స్థానికుల లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహించడంతో, సోమవారం మరోసారి కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదును అందజేశారు.. జీడిమెట్ల సర్కిల్ అనుమతి లేకుండా టిన్ షెడ్ నిర్మాణం చేపట్టిన ఈ ఘటనపై నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఫిర్యాదు దారుల ప్రకారం.. వెన్నలగడ్డ ప్రాంతంలోని 'ఎల్‌జిఎస్' సుచిత్ర క్లాసిక్ అపార్ట్‌మెంట్స్ పక్కన ఉన్న ప్లాట్‌లో మద్యం దుకాణం నిర్వహణకు, ఎలాంటి మున్సిపల్ అనుమతి లేకుండా టిన్ షెడ్ నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు 16.03.2026న ఫిర్యాదు చేశారు.. ఈ ఫిర్యాదును స్వీకరించిన అధికారులు వెంటనే పరిశీలన చేపట్టి నిర్మాణం అనధికారమని నిర్ధారించారు..

-5 లో



దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారి 'అసిస్టెంట్ సిటీ ప్లానర్' (ఎసిపి) శ్రీనివాస్..

# 'ఎసిపి' సారథ్యంలో..! టిజి-బిపాస్ చట్టం ఉల్లంఘన..!

## డిప్యూటి కమిషనర్ మౌనం.. చట్టాన్ని తుంగలో తొక్కిన ఘనులు..?

- బహుదూర్‌పల్లిలో అక్రమ షెడ్డుకు టౌన్‌ప్లానింగ్ అధికారుల 'అండ'..?
- అధికార పార్టీ సిఫార్సులకు టిజి-బిపాస్ చట్టాన్ని తాకట్టు పెట్టి తలవంచారా..?
- రూ.లక్షల్లో డీల్ కుదుర్చుకుని..? ప్రభుత్వ ఖజానాకు గండి..?
- ఫిర్యాదులు వెళ్ళినా పట్టించుకోని ఏసిపి.. చకచకా పూర్తైన అక్రమ షెడ్డు..!
- ఈ వ్యవహారంలో ఏసిపి నుంచి చైన్‌మెన్ వరకు సహకరంపై ఆరోపణలు..!

బహుదూర్‌పల్లిలో టిజి-బిపాస్ చట్టాన్ని బహిరంగంగానే తుంగలో తొక్కుతూ, టౌన్‌ప్లానింగ్ అధికారుల అండతో అక్రమ షెడ్డు నిర్మాణం పూర్తికావడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. దున్నపోతు మీద వర్షం పడిన వైనాన్ని అవలంభిస్తున్న అధికారులు.. ఈ వ్యవహారంలో రూ.లక్షల్లో చేతులు మారినట్టు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మరోవైపు ఉన్నతాధికారులకు వాటాలు వెళ్తున్నందునే చర్యలు లేవనే విమర్శలు దుమారం లేపుతోంది.. దుండిగల్ సర్కిల్-59, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, టౌన్‌ప్లానింగ్ విభాగం నిర్లక్ష్యం ఇప్పుడు సంచలనం సృష్టిస్తుంది..

**దుండిగల్, పెన్ పవర్, మార్చి 23:**

దుండిగల్ సర్కిల్-59 పరిధిలోని బహుదూర్‌పల్లిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు స్వయంగా నిబంధనలను పక్కనబెట్టి వ్యవహరించారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.. 'టిజి-బిపాస్' చట్టాన్ని బహిరంగంగానే ఉల్లంఘిస్తూ, ఒక అక్రమ షెడ్డు నిర్మాణం పూర్తి స్థాయిలో ముగియడం స్థానికంగా పెద్ద చర్చకు దారి తీసింది.. అధికార పార్టీ సిఫార్సులకు తలొగ్గిన అధికారుల దోపిడీకి నిదర్శనమని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తాయి.. దుండిగల్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ సిటీ ప్లానర్, టిపిఎస్ అధికారులు చట్టబద్ధ బాధ్యతలను విస్మరించి, అధికార పార్టీకి చెందిన యువ నాయకుడి సిఫార్సులకు లోబడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణం ప్రారంభ దశలోనే నిలిపివేయాల్సిన అధికారులు, నిర్మాణం పూర్తయ్యే వరకు చోద్యం చూస్తూ ఊరుకున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..




బహుదూర్‌పల్లి లోని భారీ అక్రమ షెడ్డు మార్చి 3న ఇలా ఉండగా..

### కమిషనర్ దృష్టికి వెళ్లినా చర్యలు శూన్యం..!

ఈ అక్రమ నిర్మాణంపై పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాలతో, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఫలితం శూన్యమేనని విమర్శలు వినిపిస్తున్నాయి.. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ ఏసిపి, టిపిఎస్ అధికారులు నిర్మాణదారునికి అండగా నిలవడం పట్ల తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. 'చైన్‌మెన్' నుంచి కమిషనర్ బాహాటంగానే సహకారం..? ఈ వ్యవహారంలో కేవలం ఒక్కరు కాదు, కమిషనర్ స్థాయి నుంచి ఫీల్డ్ స్థాయి చైన్‌మెన్‌ల వరకు సమన్వయంతో వ్యవహరించినట్టు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ షెడ్డు నిర్మాణ దారునితో ముందస్తు ఒప్పందం కుదుర్చుకుని, చర్యలు తీసుకోకుండా సహకరించినట్లు స్థానికులు చెబుతున్నారు..





బహుదూర్‌పల్లిలో ఈ అక్రమ భారీ షెడ్డు నిర్మాణం పూర్తి కావడం వెనుక అధికారుల నిర్లక్ష్యమే కాదు, బరితెగించి సహకారించారనే అనుమానాలు బలపడుతున్నాయి.. ఈ వ్యవహారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యవస్థలో పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, టిజి-బిపాస్ చట్టాన్ని తుంగలో తొక్కిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు..

### రూ.లక్షల్లో లావాదేవీలు..?

ఈ అక్రమ నిర్మాణానికి సంబంధించి లక్షల రూపాయలు చేతులు మారినట్టు సమాచారం బయటకు వస్తోంది.. ప్రభుత్వ ఖజానాకు వెళ్లాల్సిన ఫీజులు, పెనాల్టీలు అధికారులు అడ్డదారుల్లో స్వాహా చేసుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.. చట్టం సాధారణ ప్రజలకు మాత్రమేనా..? అధికార పార్టీ నేతలకు, అక్రమార్కులకు వర్తించదా..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఇలా వ్యవహరిస్తే, నగర అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుందని మండి పడుతున్నారు..

మార్చి 19న ఇలా నిరాటంకంగా పనులు కొనసాగాయి..






'పెన్ పవర్' దినపత్రికలో వరుస కథనాలు..



బహుదూర్‌పల్లిలో భారీ షెడ్డు నిర్మాణం తుది దశలో..



వెన్నెలగడ్డ వాసులు సోమవారం ఫిర్యాదు అనంతరం..



జీడిమెట్ల సర్కిల్-55 డిప్యూటీ కమిషనర్‌కి ఫిర్యాదు..

# అనుమతుల్లేని అక్రమ షెడ్డులో...
# మద్యం దుకాణం..!

## సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీడిమెట్ల సర్కిల్ షోకాజ్ నోటీసు జారీ..

- సుచిత్ర రోడ్డు వెన్నలగడ్డలో అక్రమ షెడ్డు నిర్మాణంపై నివాసితుల ఫిర్యాదు..
- జీహెచ్ఎంసి యాక్ట్ 1955 టిజి-బిపాస్ 2020 యాక్ట్ ఉల్లంఘనగా గుర్తింపు..
- మార్చి 16న జీడిమెట్ల సర్కిల్ సిఎంసి అధికారులు షోకాజ్ నోటీసు జారి..
- పనులు నిలిపివేసి 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని, పేర్కొన్న అధికారులు..
- ఏప్రిల్ 4న విచారణకు హాజరు కావాలి లేకపోతే కూల్చివేతకు హెచ్చరిక..
- కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ 'సిఎంసి'కి సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 23:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని సుచిత్ర వెన్నెలగడ్డలో..! రహదారి ఆక్రమణతో, అనుమతుల్లేని అక్రమ షెడ్డులో మద్యం దుకాణం నిర్వహణపై స్థానికులు మండి పడుతున్నారు.. సంబంధిత శాఖ ఎక్సైజ్ అధికారులకు స్థానికుల లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహించడంతో, సోమవారం మరోసారి కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదును అందజేశారు.. జీడిమెట్ల సర్కిల్ అనుమతి లేకుండా టిన్ షెడ్ నిర్మాణం చేపట్టిన ఈ ఘటనపై నివాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఫిర్యాదు దారుల ప్రకారం.. వెన్నలగడ్డ ప్రాంతంలోని 'ఎల్‌జిఎస్' సుచిత్ర క్లాసిక్ అపార్ట్‌మెంట్స్ పక్కన ఉన్న ప్లాట్‌లో మద్యం దుకాణం నిర్వహణకు, ఎలాంటి మున్సిపల్ అనుమతి లేకుండా టిన్ షెడ్ నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు 16.03.2026న ఫిర్యాదు చేశారు.. ఈ ఫిర్యాదును స్వీకరించిన అధికారులు వెంటనే పరిశీలన చేపట్టి నిర్మాణం అనధికారమని నిర్ధారించారు..



అక్రమ షెడ్డు నిర్మాణ సమయంలో, మద్యం దుకాణం వద్దని, స్థానికుల నిరసన..ఫైల్‌ఫొటో..

### పలుకుబడితో షెడ్డు నిర్మాణం..!
### అడకత్తెరలో పోకలా టౌన్‌ప్లానింగ్..

కుత్బుల్లాపూర్ జోన్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెన్నెలగడ్డలో అక్రమ షెడ్డులో స్థానికులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వ్యవహారం రోజురోజుకు ముదురుతోంది.. ఓవైపు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు స్థానికులు ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.. మరోవైపు మద్యం దుకాణం ఏర్పాటుకు, అక్రమ షెడ్డు నిర్మాణానికి అధికారపార్టీ నాయకుల పలుకుబడి ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మద్యం దుకాణం నిర్వహించాలంటే షెడ్డు నిర్మాణానికి అనుమతులు అవసరం లేదని, ల్యాండ్ యజమానితో అగ్రిమెంట్ ఉంటే సరిపోతుందని, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చెప్పడం గమనార్హం..


సుచిత్ర రోడ్డులో మద్యం దుకాణం నిర్వహిస్తున్న, అక్రమ షెడ్డుకు అతికించిన షోకాజ్ నోటీస్..


పెన్ పవర్ PEN POWER
4 పెన్ పవర్ గురువారం 12 మార్చి 2026
వైన్ షాపుకి సై సై..!
ఆబ్జెక్షన్స్‌కి 'నై నై'..!
ప్రజల క్షేమం కంటే..! ప్రభుత్వానికి ఆదాయమే ప్రధానమా..?


మద్యం దుకాణాల ఏర్పాటుకు "బడి-గుడి" నిబంధనలు మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్న ప్రభుత్వం.. స్థానికుల అభిప్రాయాలను సేకరించకుండానే సంబంధిత అధికారులు దుకాణాలు మంజూరు చేయడం, సరైనది కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ప్రభుత్వానికి ఆర్థిక వనరులు కల్పించేందుకు ఇప్పటికే అనధికారికంగా "బెల్ట్ షాపులు" నిర్వహిస్తుండగా..! తాటి కల్లు పేరుతో మందుతో తయారు చేసిన కల్లును విక్రయించి ప్రజలను మత్తులో ఉంచుతున్నారని స్థానికులు మండి పడ్డారు.. ప్రజల శ్రేయస్సు కోరే విధంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వాలు, పాలకులు.. తాగుబోతులను చేస్తూ, ఆర్థికంగా క్షీణింపజేసి, అనారోగ్యాలకు గురిచేయడానికి ప్రభుత్వం కీలకంగా మారిందని ఆరోపిస్తున్నారు.



మద్యం దుకాణం కోసం నిర్మిస్తున్న, అక్రమ షెడ్డువద్ద స్థానికుల ధర్నా.. ఫైల్‌ఫొటో..

# గచ్చిబౌలి, రాయదుర్గంలలో భారీగా పెరిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్, మార్చి23, పెన్ పవర్:**
హైదరాబాద్ నగరంలో ఇళ్లకు మంచి డిమాండ్ ఉంది. గత ఫిబ్రవరి నెలలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు 32 శాతం మేర పెరిగాయి. అధిక విలువ కలిగిన ఇళ్లకు అధికంగా డిమాండ్ ఉన్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. గౌచ్చిబౌలి, రాయదుర్గం, నార్సింగి ప్రాంతాల్లో అధిక విలువ ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు పేర్కొంది. అత్యధికంగా ఒక్క ఫ్లాట్ రూ. 8.90 కోట్లు పలికినట్లు తెలిపింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో సొంతిల్లు కొనుగోలు చేయాలనుకుంటున్న వారి సంఖ్యా పెరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఇళ్లకు మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్ ప్రాంతంలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరిగాయి. గత ఏడాది ఫిబ్రవరి నెలలో 5988 ట్రాన్సాభన్లు జరిగితే ఈ ఏడాది 2026 6179కి పెరిగాయి. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపాదికన చూసుకుంటే రెండు శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది 2026, జనవరి నెలలో 4686 యూనిట్లతో పోలిస్తే ఫిబ్రవరి నెల రిజిస్ట్రేషన్లు 32 శాతం పెరిగినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో ఇళ్ల ట్రాన్సాభన్లు ప్రైమరీ, సెకండరీ మార్కెట్లో జరుగుతుంటాయి. కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల్లో నేరుగా బిల్డర్ నుంచి కొనే మార్కెట్‌ను ప్రైమరీగా పరిగణిస్తారు. ఈ నివాసాలను తిరిగి అమ్మితే ఒక యజమాని నుంచి మరొక వ్యక్తి కొనుగోలు చేస్తారు. దీన్ని సెకండరీ మార్కెట్ గా గుర్తిస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలతో పాటుగా సంగారెడ్డి జిల్లాలోని కొంత భాగం కూడా హైదరాబాద్ రియల్ ఎస్టేటే పరిధిలోకి వస్తుంది. ఫిబ్రవరి నెలలో మొత్తం 28 రోజులో అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగినట్లు నివేదిక పేర్కొంది. రిజిస్ట్రేషన్ ట్రాన్సాక్షన్లలో కోటి రూపాయలు అంత కంటే ఎక్కువ విలువైన ఇళ్ల వాటా 18 శాతంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 6



శాతం పెరిగాయి. సగటు చదరపు అడుగు విలువ ఏడాది కాలంలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 6 శాతం, సంగారెడ్డి జిల్లాలో 7 శాతం మేర ధరలు పెరిగాయి. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల సగటు చదరపు అడుగు రూ. 4457 గా ఉంది. ఫిబ్రవరి నెలలో రూ. 4139 కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగితే వాటిలో కోటి రూపాయలపై విలువ కలిగిన ఇళ్ల విలువే 48 శాతంగా ఉందిఅధిక విలువ ఉన్న నివాస లావాదేవీలు ఐటీ కేంద్రంగానే అధికంగా జరిగాయి. అత్యధికంగా 3 వేల చదరపు అడుగుల కంటే అధిక వైశాల్యం కలిగినవి ఉన్నాయి. విలువ పరంగా మొదటి నాలుగు ట్రాన్సాన్లు గమనిస్తే నార్సింగిలో ఒక్కో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ విలువ రూ. 8.90 కోట్లు నమోదైంది. ఆ తర్వాత గచ్చిబౌలిలో రూ. 7.93 కోట్లు, రాయదుర్గంలో రూ. 6.54 కోట్లు, షేక్ పేట్‌లో రూ. 6.34 కోట్లతో ఒక్కో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ జరిగింది.

నెలల వారీగా చూసుకుంటే హైదరాబాద్ నగరంలో జనవరిలో 2025లో 5464 రిజిస్ట్రేషన్లు జరగగా 2026లో 4686 ఇళ్లు అమ్ముడయ్యాయి.

ఇక ఫిబ్రవరి నెలలో 2025లో 5988 యూనిట్లు రిజిస్టర్ కాగా అది ఫిబ్రవరి నెలలో 6179గా నమోదైందివిస్తీర్ణం పరంగా చూసుకుంటే 500 చదరపు అడుగు లోపు ఫ్లాట్లు రిజిస్ట్రేషన్లు 3 శాతం పెరిగాయి, 501-1000 చ.అ.లోపు ఇళ్లు 15 శాతం, 1001-2000లోపు ఇళ్లు 66 శాతం, 2001-3000 చ.అ.లోపు ఇళ్లు 13 శాతం, 3000 పైన ఇళ్లకు 3 శాతం రిజిస్ట్రేషన్లు పెరిగాయి. జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్
నెలలో 14 శాతం, మేడ్చల్-మల్కాజిగిరిలో 45 శాతం, రంగారెడ్డిలో 41 శాతం ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

# అసెంబ్లీలో వార్ వన్ సైడ్...

**హైదరాబాద్, మార్చి23, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం అసెంబ్లీ వేదికగా శరవేగంగా మారుతోంది. గత పదేళ్లుగా సభను శాసించిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో అధికార పక్షం సంధిస్తున్న విమర్శలకు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న అగ్రెసివ్ స్ట్రాటజీ, ప్రతిపక్షనేత కేసీఆర్ సభకు గైర్హాజరు కావడం.. ఈ రెండు అంశాలు సభలో చర్చను వార్ వన్ సైడ్ మారుస్తున్నాయిప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర అత్యంత కీలకం. కానీ, కీలకమైన బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ దూరంగా ఉండటం అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది. కేటీఆర్, హరీష్ రావు వంటి హేమాహేమీలు ఉన్నప్పటికీ, సభను తన వాక్చాతుర్యంతో, చారిత్రక ఆధారాలతో అదుపులోకి తెచ్చుకునే కేసీఆర్ మార్క్ వ్యూహం ఇక్కడ కొరవడింది. ప్రజలు ఎన్నుకున్నా సభకు రావడం లేదనే అంశాన్ని రేవంత్ రెడ్డి ఒక అస్త్రంగా మార్చుకున్నారు. ప్రజాధనం జీతంగా తీసుకుంటూ సభకు రాకపోవడం బాధ్యతారాహిత్యం అనే విమర్శను కాంగ్రెస్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడంలో సఫలీకృతం అవుతున్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు ఉపయోగించిన సాక్ష్యాధారాల వ్యూహాన్నే ఇప్పుడు రేవంత్ తిరిగి వారిపైనే ప్రయోగిస్తున్నారు. బీఆర్ఎస్ ఏదైనా ప్రజా సమస్యను లేవనెత్తినప్పుడు, రేవంత్ రెడ్డి వెంటనే గత పదేళ్లలో జరిగిన వైఫల్యాలను, శ్వేతపత్రాలను బయటపెడుతున్నారు. దీంతో చర్చ ప్రస్తుత సమస్యల నుంచి మళ్ళీ పాత ప్రభుత్వ తప్పుల వైపు మళ్లుతోంది. కేటీఆర్ వేసే ప్రశ్నలకు రేవంత్ రెడ్డి అంతే దీటుగా, తనదైన శైలిలో తెలంగాణ యాసతో విరుచుకుపడుతున్నారు. ఇది సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఉత్సాహాన్ని నింపుతుండగా, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది. సభలో బీఆర్ఎస్ గళాన్ని కేటీఆర్, హరీష్ రావు వినిపిస్తున్నప్పటికీ, వారి మధ్య సమన్వయం కంటే డిఫెన్స్ కే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఆరు గ్యారెంటీలపై కేటీఆర్ చేసే కొన్ని సవాళ్లు, ప్రభుత్వం వద్ద ఉన్న పాత ఫైళ్ల వల్ల తిరిగి పార్టీకే ఇబ్బందిగా మారుతున్నాయి. హరీష్ రావు గణాంకాలతో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నా, మంత్రులందరూ ఏకతాటిపైకి వచ్చి ఆయనను అడ్డుకుంటున్నారు. బీఆర్ఎస్ మళ్ళీ సభలో పట్టు సాధించాలంటే కేసీఆర్ రాక తప్పనిసరి అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధినేత సభలో ఉంటే ఎమ్మెల్యేల్లో ఉండే



ధైర్యం వేరు. ప్రస్తుతం సభలో అజెండాను ప్రభుత్వం సెట్ చేస్తోంది. దాన్ని ప్రతిపక్షం వైపు తిప్పుకోవాలంటే కేసీఆర్ అనుభవం, విషయ పరిజ్ఞానం అత్యవసరం. ప్రస్తుతానికి తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి హవా స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ యుద్ధంలో గెలవాలంటే సైన్యం మాత్రమే సరిపోదు, సేనాని కూడా రంగంలో ఉండాలి. కేసీఆర్ సభకు వస్తే తప్ప ఈ వన్ సైడ్ వార్ రసవత్తరమైన ద్వైపాక్షిక పోరుగా మారే అవకాశం లేదు.
రేవంత్ పంచ్ లు కేసీఆర్ కు అసెంబ్లీకి రాకున్నా ఇస్తున్న జీతం కోటి.. రాక మాత్రం అంటిముట్టనట్టు" అంటూ రేవంత్ రెడ్డి సంధిస్తున్న బాణాలు గులాబీ క్యాడర్‌కు గుచ్చుకుంటున్నాయి. "ప్రజాధనం తీసుకుంటూ.. ప్రజల గొంతుక వినిపించరా?" అంటూ రేవంత్ వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక గులాబీ తమ్ముళ్లు నీళ్లు నములుతున్నారు. కేసీఆర్ ఉండి ఉంటే తనదైన శైలిలో 'ఏం తమ్మి.. ఏం మాట్లాడుతున్నావ్?' అని కౌంటర్ ఇచ్చేవారేమో కానీ, ఇప్పుడు ఆ లోటు స్పష్టంగా కనిపిస్తోంది. కేటీఆర్ అస్త్రంగా ఆరు గ్యారెంటీలు ఏవి? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటుంటే.. రేవంత్ మీ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలు ఏవి? ఆ ప్రాజెక్టుల అంచనాలు ఏమయ్యాయి? అంటూ నిలదీస్తున్నారు. చర్చ ప్రజా సమస్యల మీద జరగాల్సింది పోయి, "నువ్వు ఎక్కువ తిన్నావా.. నేను ఎక్కువ తిన్నానా?" అన్న చందంగా పాత రికార్డుల దుమ్ము దులిపే కార్యక్రమంగా మారిపోయింది. కేసీఆర్ మార్క్ వ్యూహచతురత లేకపోవడంతో రేవంత్ దూకుడు ముందు కేటీఆర్ వ్యూహాలు "తేలిపోయిన అప్పడాల్లా" మారుతున్నాయని విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ఏకపక్షంగా సాగిస్తున్న ఈ 'వన్ సైడ్ వార్' ఆపాలంటే, గజ్వేల్ సింహం గర్జించాల్సిందే అని పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. "సార్.. మీరు రండి సార్.. లేకపోతే రేవంత్ అన్న మాకు చుక్కలు చూపిస్తున్నాడు" అని లోలోపల మదనపడుతున్నారు. మొత్తానికి కేసీఆర్ రాకపోయేసరికి అసెంబ్లీలో బీఆర్ఎస్ పరిస్థితి "కెప్టెన్ లేని టీమ్ ఇండియా"లా తయారైంది. మరి కేసీఆర్ ఎప్పుడు ఎంట్రీ ఇస్తారు? రేవంత్ స్పీడ్‌కు ఎప్పుడు బ్రేక్ వేస్తారు? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

# 21 మీటర్లు దాటితే హై-రైజ్ భవనాలు

**హైదరాబాద్, మార్చి23, పెన్ పవర్:**
తెలంగాణ ప్రభుత్వం బిల్డింగ్ రూల్స్‌లో కీలక సవరణలు చేసింది. ఇకపై 21 మీటర్ల పైబడిన వాటినే హై-రైజ్ భవనాలుగా గుర్తిస్తారు. భారీ నిర్మాణాలకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తూనే, రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి వెసులుబాటు కల్పించింది. సెట్‌బ్యాక్ నిబంధనలలో 10 శాతం సడలింపునిచ్చింది. పట్టణాల్లో వర్టికల్ గ్రోత్‌ను ప్రోత్సహించాలని నిర్ణయించింది. తెలంగాణలో శరవేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, భవన నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగానికి నూతన జవజీవాలు పోస్తూ.. నిర్మాణ నిబంధనలలో కీలక మార్పులు చేస్తూ మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ జీవో 95ను విడుదల చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేరుతో వెలువడిన ఈ ఉత్తర్వులు.. ముఖ్యంగా హై-రైజ్ భవనాలు, టీడీఆర్ వినియోగం, అదనపు అంతస్తుల అనుమతులపై స్పష్టమైన మార్గదర్శకాలను వెలువరించాయి. ప్రభుత్వం తాజా సవరణల ప్రకారం.. భవనాల ఎత్తు విషయంలో స్పష్టతనిచ్చింది. ఇకపై 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న నిర్మాణాలను మాత్రమే 'హై-రైజ్' భవనాలుగా పరిగణిస్తారు. అయితే, సాంకేతిక అవసరాల

కోసం నిర్మించే చిమ్నీలు, కూలింగ్ టవర్లు, లిఫ్ట్ మెషిన్ రూములు, వాటర్ ట్యాంకులను ఈ ఎత్తు లెక్కలోకి తీసుకోరు. ఇది నిర్మాణదారులకు సాంకేతిక పరంగా కొంత ఉపశమనం కలిగించనుంది. బదిలీ చేయగల అభివృద్ధి హక్కుల వినియోగాన్ని ప్రభుత్వం మరింత తప్పనిసరి చేసింది. 750 నుండి 2000 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో 18 నుండి 21 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణాలు చేపట్టాలంటే టీడీఆర్ వాడటం నిబంధనగా మార్చారు. 10 అంతస్తులకు మించిన భవనాల్లో 10వ అంతస్తు పైబడిన విస్తీర్ణంపై 3 శాతం, అలాగే 20 అంతస్తులు దాటిన భవనాల్లో 20వ అంతస్తు పైబడిన ఏరియాపై 5 శాతం టీడీఆర్ లోడింగ్ ఉండాలి. నిర్మాణ అనుమతి సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలి, మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికేట్
వచ్చే లోపు అందజేయాల్సి ఉంటుంది. నగరాల్లో స్థల లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో 'వర్టికల్ గ్రోత్'ను ప్రోత్సహించేందుకు రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తులకు అనుమతినిచ్చారు. 2000 చ.మీ కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో 40 అడుగుల రోడ్డు ఉంటే 3 అదనపు అంతస్తులు, 60 అడుగుల రోడ్డు ఉంటే 4 అదనపు అంతస్తులు, 80 అడుగుల రోడ్డు ఉంటే 5 అదనపు అంతస్తుల వరకు నిర్మించుకోవచ్చు.
భవనాల చుట్టూ వదిలే సెట్‌బ్యాక్ నిబంధనలలో టీడీఆర్ వినియోగం ద్వారా 10 శాతం వరకు సడలింపు పొందే అవకాశం కల్పించారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల సెట్‌బ్యాక్ ఉండాలనే నిబంధనను మాత్రం కచ్చితంగా పాటించాలి. మాస్టర్ ప్లాన్ రోడ్ల మార్పులు జరిగినప్పుడు కన్వర్షన్ ఛార్జీలు చెల్లించి, దానికి సమానమైన టీడీఆర్‌ను సమర్పించే వెసులుబాటు కూడా కల్పించారు.

# ముఖ్యమంత్రి పదవిపై మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి పదవి అంశంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్తులో బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతాడని జోస్యం చెప్పారు. తమ పార్టీల నుంచి బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావులకు చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు బీసీ వ్యతిరేకులు అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం డిక్లరేషన్ ప్రకటించి చట్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం అందరికీ సన్నబియ్యం ఇస్తోందని, ఇది చారిత్రాత్మకమని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో బియ్యం దోపిడీ జరిగిందని ఆరోపించారు.

## పంట నష్టపోయిన ప్రతి ఒక్కరైతునూ ఆదుకుంటాం... ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం చెల్లిస్తాం

**ఆత్మకూరు: మార్చి23, పెన్ పవర్:** నంతసాగరం మండలంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటించారు.. గుడిగుంట గ్రామంలో ఇటీవల వడగండ్ల వానకు నష్టపోయిన వరి పంటను రైతులు, అధికారులతో కలిసి పరిశీలించారు.. చేతికి వచ్చిన పంట వడగండ్ల వానకు పూర్తిగా నష్టపోయామని, తమను మీరే ఆదుకోవాలంటూ మంత్రి ఎదుట తమ గోడు వెళ్ళబోసుకున్న అన్నదాతలు... ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని రైతులను ఓదార్చిన మంత్రి ఆనం, రెండురోజుల్లో ఎన్యుమరేషన్ పూర్తి చేసి నివేదిక పంపించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింద అన్నారు. ఉ వడగండ్ల వానకు అనంతసాగరం, మర్రిపాడు, రాపూరు, కలువాయి మండలాల్లో సుమారు 1200 హెక్టార్లలో వరి, పత్తి, పొగాకు పంటలు దెబ్బతిన్నాయి... ఎక్కువగా వరి పంటకు నష్టం వాటిల్లి సుమారు 1000 మందికి పైగా రైతులు నష్టపోయార అన్నారు ఉ ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడుతో పంట నష్టం పై చర్చించాం... వారు రైతులను ఆదుకునేందుకు సానుకూలంగా స్పందించార అన్నారు. రైతులు ఎవరు అధైర్య పడొద్దు... మీ కష్టానికి తప్పకుండా న్యాయం చేస్తాం... త్వరలోనే నష్టపరిహారాన్ని అందిస్తామని అన్నారు.

# అసెంబ్లీ ముట్టడికి బీజేపీ ప్రయత్నం.. నెలకొన్న ఉద్రిక్తత

**హైదరాబాద్: మార్చి23, పెన్ పవర్:** రాష్ట్ర బడ్జెట్పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం నాడు బీజేపీ అసెంబ్లీ ముట్టడికి యత్నించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బడ్జెట్పై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. కీలక నేతలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తూ, భద్రతను కట్టుదిట్టం చేశారు. దీంతో అసెంబ్లీ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# బడ్జెట్‌పై భారీ నిరసన ర్యాలీ

**జయశంకర్ భూపాలపల్లి: పెన్ పవర్:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, ల్లా, మండల నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్‌పై భారీ నిరసన ర్యాలీ నిర్వహించబడింది. అనంతరం అంబేద్కర్ కూడలిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో 136 బీసీ కులాలు ఉండగా, సుమారు 65% జనాభా ఉన్న బీసీల కోసం కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. బీసీల జనాభా శాతాన్ని అనుసరించి కనీసం 51% బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా, ప్రభుత్వం కేవలం అంకెల గారడీతో ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ఆరోగ్య శాఖకు 4.1%, విద్యా శాఖకు 8.1% మాత్రమే కేటాయించడం దురదృష్టకరమని, ఈ రెండు రంగాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు.
2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను, ప్రస్తుతం లక్షల కోట్ల అప్పులతో నడిపిస్తూ వడ్డీల రూపంలో భారీ భారం మోపుతున్నారని విమర్శించారు. ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు చెల్లించడానికే పెద్ద మొత్తంలో నిధులు ఖర్చవుతున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయించిన నిధులు కూడా పూర్తిగా ఖర్చు చేయకుండా, కేవలం లెక్కల పరంగా మాత్రమే చూపిస్తూ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం లేదని, 16 మంది మంత్రుల్లో కేవలం ముగ్గురు మాత్రమే బీసీ వర్గానికి చెందినవారని పేర్కొన్నారు. అదే సమయంలో తక్కువ శాతం ఉన్న వర్గాలకు అధిక ప్రాతినిధ్యం ఇవ్వడం అన్యాయమని అన్నారు. తెలంగాణలో సంపద సృష్టించేది బీసీలేనని, కానీ అధికారంలో మాత్రం వారికి తగిన భాగస్వామ్యం ఇవ్వడం లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. 2028లో టిఆర్పి పార్టీ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం, సత్వర న్యాయం ప్రధాన అజెండాగా తీసుకుని, ప్రతి వర్గానికి వారి హక్కు మేర బడ్జెట్ కేటాయిస్తామని తెలిపారు. అలాగే బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలని, ప్రతి సంవత్సరం కనీసం రూ. 20,000 కోట్లు బీసీల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, రేగొండ మండల మహిళా అధ్యక్షురాలు అనిత, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బండి సునీల్, జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గండు కరుణాకర్, జిల్లా కోఆర్డినేటర్ మామిడి శ్రీకాంత్, జిల్లా కోశాధికారి జిలకర శ్రీను, సోషల్ మీడియా ఇంచార్జ్ శ్రీకాంత్, జిల్లా నాయకులు మడే సంతోష్, ఇనుగాల ప్రణీత్, లక్ష్మణ్ అల్లం రామ్ చరణ్ కృష్ణ మనోహర్ రావు, మేనం సంతోష్, మడే సతీష్, భువనగిరి రాజేష్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మినీ సరస్ ఫెయిర్ 2026 సందర్భంగా భరోసా కేంద్రం అవగాహన స్టాల్ ప్రారంభం

**మహబూబ్ నగర్: మార్చి23, పెన్ పవర్:** పట్టణంలోని శిల్పారామంలో డి.ఆర్.డి.ఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినీ సరస్ ఫెయిర్లో గ్రామీణ స్వయం సహాయక సంఘాలు తయారుచేసిన చేనేత, హస్తకళ మరియు ఆహార ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ ఫెయిర్కు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, మహబూబ్నగర్ జిల్లా పోలీసుల తరఫున మహిళలు మరియు బాలబాలికల భద్రత కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసారు. ఈ స్టాల్ను మహబూబ్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మాల మమత ప్రారంభించారుఏ. ఈ సందర్భంగా భరోసా కేంద్రం ద్వారా అందించే సేవలు మరియు లాభాలను ప్రజలకు వివరించారు: మహిళలు, బాలబాలికలపై జరిగే హింస, వేధింపులు, దౌర్జన్యాలకు గురైన బాధితులకు సురక్షిత వాతావరణంలో సహాయం కౌన్సిలింగ్ సేవలు ద్వారా మానసిక ధైర్యం కల్పించడం, అవసరమైనప్పుడు న్యాయ సహాయం మరియు కేసులపై మార్గదర్శకం, మెడికల్ సపోర్ట్ మరియు ఇతర అత్యవసర సేవలు, బాధితులకు సంబంధించిన ఫిర్యాదులను వేగంగా స్వీకరించి, సంబంధిత విభాగాలతో సమన్వయం చేయడం, కుటుంబ వివాదాల పరిష్కారం కోసం సమాధానపూర్వక చర్చలు, భరోసా కేంద్రం సభ్యులు స్టాల్ను సందర్శిస్తున్న ప్రజలకు ఈ సేవలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తూ, ఎలాంటి సమస్యలు వచ్చినా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# ఉప్పల్, బాగయత్ లో బైక్ ను ఢీకొన్న టిప్పర్ వాహనం

**నాగోల్ కు చెందిన తుమ్మ శారద(46) అక్కడికక్కడే మృతి..**

**మేడ్చల్: పెన్ పవర్:** ఉప్పల్ ఏసియన్ థియేటర్ నుండి నాగోల్ వైపు మహిళ బైక్ పై వెళ్తుండగా ఉప్పల్ బాగాయత్ లో బాలాజీ వైన్స్ సమీపంలో టిప్పర్ వాహనండ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా వాహనం నడిపి ఆమె వాహనాన్ని వెనక నుండి ఢీకొట్టాడు. దీంతో ఆమె కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు తుమ్మల శారద శీ46). సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# క్యూ నెట్ కార్యాలయాలపై దాడులు

**హైదరాబాద్: పెన్ పవర్:** మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో వందల కోట్ల రూపాయల వసూళ్లకు పాల్పడిన క్యూ నెట్ సంస్థపై సీసీఎస్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, బెంగళూరు నగరాల్లోని ఆరు చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తాజాగా నమోదైన రెండు కేసుల ఆధారంగా ఈ దాడులు చేపట్టారు. సుమారు 20 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# మూడు నెలల్లో 28 మంది మృతి..

**'కీడు' సోకిందని ఊరు ఖాళీ చేసిన గ్రామస్థులు**

**కరీంనగర్: పెన్ పవర్:** జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామంలో గత మూడు నెలలుగా వరుసగా 28 మంది వివిధ కారణాలతో మరణించడం తీవ్ర ఆందోళన కలిగించింది. గ్రామానికి ఏదో 'కీడు' సోకిందని బలంగా నమ్మిన గ్రామస్థులు, పురోహితుడి సూచన మేరకు వింత నిర్ణయం తీసుకున్నారు. ఒక రోజంతా ఊరు ఖాళీ చేసి పొలాల్లో 'కీడు వంటలు' వండుకోవాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం తెల్లవారుజామునే ఇళ్లకు తాళాలు వేసి, డప్పు చాటింపు వేయించి మరీ ఊరి బయటకు వెళ్లారు. ఇలా చేస్తేనే గ్రామానికి పట్టిన పీడ విరుగడవుతుందని వారు విశ్వసిస్తున్నారు

# సమ్మర్ మూవీస్ పై ఆశలు

**హైదరాబాద్, మార్చి 23, పెన్ పవర్:** సంవత్సరం తెలుగు సినిమా ఇండస్ట్రీల హవా కొనసాగుతుందనే చెప్పాలి. సంక్రాంతికి 'మన శంకర్ వరప్రసాద్' సినిమాతో చిరంజీవి భారీ సక్సెస్ ని సాధించాడు. 400 కోట్ల వరకు కలెక్షన్స్ ని కొల్లగొట్టాడు. సంక్రాంతి సీజన్ బాగా కలిసి రావడంతో ఆ తర్వాత కూడా సినిమా ఇండస్ట్రీకి భారీ లాభాలు వస్తాయని అంచనాలో సినిమా మేధావులైతే ఉన్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే రీసెంట్ గా రిలీజ్ అయిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా సైతం పాజిటివ్ టాక్ ను సంపాదించుకొని ముందుకు సాగుతుంది. ఇక అడివి శేషు హీరోగా చేస్తున్న 'డకాయిట్' సినిమా సైతం ఏప్రిల్ నెలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అలాగే శర్వానంద్ బైకర్ సినిమా వస్తుంది. నిఖిల్ హీరోగా చేస్తున్న స్వయంభూ సినిమా కూడా ఈ సమ్మర్ లోనే వస్తుందిడఇక ఈ సినిమాలతో పాటు గా ఏప్రిల్ 30 వ తేదీన రామ్ చరణ్ హీరోగా చేస్తున్న 'పెద్ది' సినిమా సైతం భారీ అంచనాలతో బరిలోకి దిగబోతుంది.ఇక మే నెలలో ఏ సినిమాలు రాబోతున్నాయి అనే విషయం మీద ఇంకా సరైన క్లారిటీ రానప్పటికి మొత్తానికైతే ఈ సినిమాలన్ని భారీ విజయాలను సాధిస్తాయనే కాన్ఫిడెన్స్ ను వ్యక్తం చేస్తున్నారు. పెద్ది సినిమా ఈ సమ్మర్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బాస్టర్ హిట్ గా నిలువబోతుందనే వార్తలు కూడా వస్తున్నాయి.ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అంటూ మేకర్స్ చెబుతున్నారు. దానికి తగ్గట్టుగానే ఈ సినిమా మీద ప్రేక్షకుల్లో విశేషమైన హైప్ కూడా ఉంది. ఇక ఇలాంటి క్రమంలోనే ఇండియన్ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసేలా రామ్ చరణ్ పెద్ది సినిమాతో భారీ రికార్డులను కొల్లగొడతాడా? లేదా అనేది కూడా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం తెలుగు సినిమా ఇండస్ట్రీ కొంతవరకు డౌన్ లో ఉంది.దీనిని టాప్ లెవెల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత రామ్ చరణ్ మీదే ఉంది అంటూ పలువురు సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాల్ని తెలియజేస్తుండటం విశేషండచూడాలి మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను సాధిస్తుంది. తద్వారా మరోసారి తెలుగు సినిమా స్థాయి పెరుగుతుందా లేదా అనేదిడ

# కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ప్రారంభం

**హైదరాబాద్: పెన్ పవర్:** మనకు వచ్చిన సంపాదనలో ఎంతోకొంత సమాజానికి ఖర్చు చేయాలన్న సంకల్పంతో కేసి పుల్లయ్య ఫౌండేషన్ స్థాపించడం గొప్ప విషయమని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు . అతి తక్కువ కాలంలోనే ఈ ఫౌండేషన్ సేవలు అన్ని ప్రాంతాలకు విస్తరించడం శుభ పరిణామం అన్నారు. కేసి పుల్లయ్య ఫౌండేషన్ ప్రధాన కార్యాలయం హైదరాబాద్ దోమలగూడలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా , ఫౌండేషన్ ట్రస్టీలు పాల్గొని వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో వివిధ సేవలు అందించిన ప్రముఖులను మంత్రి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కేసీ పుల్లయ్య స్థాపించిన ఫౌండేషన్ను నిరంతరం కొనసాగిస్తూ తండ్రి ఆశయాలను నెరవేరుస్తున్న ఆయన కుమారులు కుటుంబ సభ్యులను కేంద్రమంత్రి అభినందించారు. కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ట్రస్టీ అనిల్ కుమార్ మాట్లాడుతూ కెసి పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఐదు శాఖలు ఏర్పాటు చేసి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. హెచ్ఐవి బాధితులకు , న్యూట్రిషన్ ఫుడ్, నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్స్ నేర్పించి ఉపాధి కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# అర్బన్ క్లీన్ యాప్

**హైదరాబాద్: పెన్ పవర్:** నగర జీవనశైలి అంటేనే.. ఉరు కుల.. పరుగుల జీవితం.. ఇంట్లో పనులు చేసుకునే తీరిక, సమయం చాలా మందికి ఉండదు.. అలాంటి సమయంలోనే నమ్మకమైన సర్వీస్ ఇచ్చేవాళ్లు ఎంతో ముఖ్యమని సినీ నటుడు సత్యదేవ్ అన్నారు. హైదరాబాద్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ క్లీన్ ప్లాట్ఫామ్ను, మొబైల్ యాప్ను ప్రారంభించారు. రోజురోజుకు అభివృద్ధి చెందుతోన్న హైదరాబాద్ వంటి నగరం లో తొలిసారి ఇన్ కమ్యూనిటీ సేవక్ అనే కాన్సెప్ట్ తీసుకురావడం అభినంద నీయమని సత్యదేవ్ అన్నారు. తాము ఇప్పటికే ఇన్ కమ్యూనిటీ సర్వీసెస్ ద్వారా 11 వేల సేవలు అందించామని, తొలి దశలో 32 వేల మందికి సర్వీస్ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అర్బన్ క్లీన్ ఫౌండర్ సీఈవో వాడ పల్లి రామకృష్ణ తెలిపారు. తమ సిబ్బంది ఇంట్లో అన్ని విభాగాలకు సంబంధించిన సేవలూ అందిస్తారని, వినియోగదారుల భద్రతతో పాటు, సుశిక్షితులైన పనివారినే తీసుకుంటు న్నట్లు వెల్లడించారు.

# మరో 2 రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు

**హైదరాబాద్: పెన్ పవర్:** రాష్ట్రంలో ఈ నెల 25, 26 తేదీల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. ద్రోణి ప్రభావం కారణంగా రాష్ట్రంలో శీతల వాతావరణం కొనసాగుతోంది. సోమ, మంగళవారాల్లో సాధారణ పరిస్థితులు ఉంటాయని తెలిపింది. కాగా ఇప్పటికే పలు జిల్లాల్లో వానలు పడిన విషయం తెలిసిందే.

## తక్షణ చర్యతో రూ.62,000 నగదు రికవరీ

### ఆటో డ్రైవర్ నిజాయితీ, పోలీస్ సిబ్బంది అప్రమత్తత

**మహబూబాబ్ నగర్: పెన్ పవర్:**ఈ నెల 21 న గద్వాల్కు చెందిన ఉమాదేవి గద్వాల్కు వెళ్లేందుకు ఆటోలో ప్రయాణించారు. పొన్నకల్ స్టేజ్ వద్ద బస్సు ఎక్కే తొందరలో ఆటో దిగిన అనంతరం, తన వద్ద ఉన్న రూ. 62,000 నగదు కలిగిన బ్యాగ్ ఆటోలోనే మర్చిపోయిన విషయం గుర్తించారు. ఘటనపై వెంటనే అడ్డకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ఎం.శ్రీనివాస్ వెంటనే స్పందించి, పీసీ 218 ఏ.రాహుల్ను దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. పీసీ రాహుల్ మండల పరిధిలోని సీసీ కెమెరాలను పరిశీలించి, ఆటో నంబర్ ఖా 38 ు 2272ను గుర్తించి, డ్రైవర్ చంద్రకాంత్ ఖిలగానాపూర్, వనపర్తి జిల్లా గా గుర్తించారు.. పోలీసులు విచారణకు వెళ్లగా, డ్రైవర్ చంద్రకాంత్ డబ్బులు ఎవరికివ్వాలో తెలియక తన వద్ద భద్రపరచుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన నిజాయితీగా స్పందించి, బ్యాగ్తో పాటు అందులో ఉన్న రూ. 62,000 నగదును పీసీ రాహుల్ కి అప్పగించారు. ఆ తరువాత పీసీ రాహుల్ ఆ మొత్తాన్ని ఎస్ఐ శ్రీనివాస్ కి అందజేయగా, 23-03-2026న అడ్డకల్ పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఉమాదేవి నగదు తిరిగి అందజేశారు

# కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ టీమ్.. ఏఐసీసీ నిర్ణయం




**హైదరాబాద్, మార్చి 23, పెన్ పవర్:**ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు ఎన్నికల ప్రచారానికి నేతలను ఏఐసీసీ ఎంపిక చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెలంగాణ నుంచి నలుగురు నాయకులను ఏఐసీసీ ఎంపిక చేసింది. వారిలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, శాసన మండలి విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలను ఏఐసీసీ కేరళ ఎన్నికల ప్రచారానికి నియమించింది. మంత్రి శ్రీధర్ బాబుని రెండు జిల్లాల ఇంచార్జ్గా నియమించగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ త్రివేండ్రంలోని కేరళ పీసీసీ కార్యాలయంలో వీరితో సమావేశం అయ్యారు. ఏప్రిల్ 7వ తేదీ వరకు వారికి కేటాయించిన ప్రాంతాల్లో వీరు ఎన్నికల కార్యక్రమాలు చేయాల్సి ఉంటుందని కాంగ్రెస్ వారికి ఆదేశాలు జారీ చేసింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# క్షయపై ఉన్న అపోహలను పారద్రోలాలి

**హైదరాబాద్, మార్చి 23, పెన్ పవర్:**ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24 న నిర్వహిస్తారు. భయంకర మైన అంటు వ్యాధైన టీబీ (క్షయ) దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు 1000 మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 నుండి క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది. 1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మ క్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్) మొదటి సారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 120 సంవత్సరాలు కావస్తున్నాయి. ఐరోపాలో క్షయ బ్యాక్టీరియా 7 వేల ఏళ్ల క్రితమే మనుగడ సాగించినట్లు, అత్యంత ప్రాచీన క్షయ కేసు 7వేల ఏళ్ళ క్రితమే ఉన్నట్లు స్జెగెడ్ విశ్వ విద్యాలయానికి చెందిన పరిశోధకులు మురియెల్ మాసన్ పరిశోధనలో వెల్లడైంది. హైపర్ ట్రోఫిక్ పల్మనరీ ఆస్టియోపతి (హెచ్‌పీవో) అనే వ్యాధికి వేల సంవత్సరాల క్రితం క్షయ కారణమనీ, పురావస్తు రికార్డుల్లో నమోదైన వివరాల ప్రకారం గుర్తించారు. ఈ అధ్యయనంలో భాగంగా పరిశోధకులు దక్షిణ హంగరీలో ఏడువేల సంవత్సరాల క్రితంనాటి ప్రదేశంలో 71 మానవ అస్థిపంజరాలను పరీక్షించారు. వీటి ఆధారంగా ఇన్ఫెక్షన్లు, జీవక్రియ సంబంధ వ్యాధులకు సంబంధించి పలు కేసులను గుర్తించారు. కొన్ని అస్థిపంజరాల్లో హెచ్‌పీవోకు సంబంధించిన సంకేతాలు కూడా గుర్తించడంతో క్షయ అప్పట్లోనే ఉన్నట్లు భావిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గణాంకాల ప్రకారం ప్రపంచంలో మూడొంతుల మంది క్షయ వ్యాధిగ్రస్తులు భారతదేశంలోనే ఉన్నారు. టీబీ కారణంగా ఇండియాలో ఏటా 4,80,000 మరణాలు సంభవిస్తున్నాయి. భారత ప్రభుత్వ గణాంకాల ప్రకారం క్షయ కారణంగా దేశంలో రోజుకి 1,300 మంది చనిపోతున్నారు. గత 50 ఏళ్లుగా టీబీని నివారించేందుకు ఇండియా పోరాటం చేస్తున్నప్పటికీ అది అంతం కావడం లేదు. అందుకే ఇప్పటికీ దీన్ని 'సైలెంట్ కిల్లర్' అని పిలుస్తున్నారు. క్షయ అనగానే దగ్గు గుర్తుకు రావడం సహజం, తద్వారా కేవలం ఊపిరి తిత్తులకు మాత్రమే క్షయ వ్యాధి కలుగుతుందని అనేకమంది భావిస్తుంటారు. కానీ క్షయ వ్యాధి అనేది, శరీరంలో ఏ భాగానికైనా రావొచ్చు. చర్మం, గర్భాశయం మొదలైనవి. అదే విధంగా మెదడుకు కూడా క్షయవ్యాధి సోకుతుంది. తద్వారా మెదడులోని రక్తనాళాలు వాపునకు గురవడం జరుగుతుంది. దీనిని మెనింజైటిస్ క్షయ వ్యాధిగా కూడా పిలుస్తారు.క్షయ రోగాన్ని ఒకప్పుడు ప్రాణాంతకమైన వ్యాధిగా పరిగణించే వారు. కానీ క్రమేపీ దాన్ని నిరోధించటం, నివారించటం మొదలైంది. మైకో బాక్టీరియం క్షయ అనే బ్యాక్టీరియా వల్ల క్షయవ్యాధి వస్తుంది. ఇది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. అయితే ఇది శరీరంలోని ఏదైనా అవయవానికి కలిగి ఉంటుంది. క్షయ అనేది నయం చేయగల మరియు నివారించగల వ్యాధి. ఊపిరితిత్తుల టిబి దగ్గు, తుమ్ము లేదా బిందువుల ద్వారా ఉమ్మివేసినప్పుడు ఇది వ్యక్తి నుండి వ్యక్తికి గాలి ద్వారా వ్యాపిస్తుంది. టిబి ఉన్న వ్యక్తి దగ్గు, నిరీక్షణ, హిమోప్టిసిస్, జ్వరం, రాత్రి చెమటలు, ఆకలి లేకపోవడం లేదా 2 వారాల కన్నా ఎక్కువ బరువు తగ్గడం వంటి లక్షణాలను కలిగి ఉంటుంది. క్షయవ్యాధి నిర్ధారణ మరియు చికిత్స పూర్తిగా ఉచితం మరియు జాతీయ టిబి ఎలిమినేషన్ ప్రోగ్రామర్ (ఎన్‌టిఇపి) చేత సమన్వయం చేయబడుతుంది. మెదడు క్షయ వ్యాధి కారకాలు ప్రధానంగా...ఎక్కువ మద్యం సేవించడం, ఎయిడ్స్, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడం, డయాబెటిస్ మెల్లిటస్ (రక్తంలో చక్కర నిల్వలు అమాంతం పెరిగి పోవడం, ఇన్సులిన్ స్థాయిలు హీనంగా తగ్గిపోవడం) తదితరాలు కారకాలుగా ఉంటాయి.సాధారణంగా ఎక్స్-రే, గళ్ళ పరీక్షలతో 60% నుంచి 70 శాతం కేసుల్లో టి.బి అని నిర్ధారించవచ్చు. వీటితో నిర్ధారణ కాకపోతే అప్పుడు సెరోలజీ, పీసీఆర్, మాంలో వంట్ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ఇవేగాక అవసరాన్ని బట్టి సీటీస్కాన్, టోన్స్కాన్, బయాప్సీ వంటి పరీక్షలు చేయించాలి. మెదడు క్షయ వ్యాధిని తగ్గించుకునే చికిత్సలో ప్రధాన భాగం ఆహార ప్రణాళికలలో మార్పులు చేయడమే. శరీరంలో రోగ నిరోధక శక్తి తత్వాలు పెరిగే కొలదీ, రోగాన్ని ఎదుర్కొనే శక్తిని శరీరనీ పొందగలదు. కావున ఈ వ్యాధికి గురైన వారు తమ ఆహార ప్రణాళికలో తాజా పండ్లు, కాయగూరలు, మరియు ఆరోగ్యకర ప్రోటీన్ నిల్వలు ఎక్కువగా ఉండే ఆహార పదార్ధాలు డైటీషియన్ సలహా మేరకు తీసుకొనవలసి ఉంటుంది. తద్వారా త్వరగా కోలుకునే అవకాశనీ ఉన్నది. మెనింజెటిస్ క్షయ వ్యాధి సమస్యలు అత్యంత జఠిలనీ గా ఉంటాయి. కొన్ని సందర్భాలలో ప్రాణాంతకం కూడా కావొచ్చు. చికిత్సా సమయంలో ముఖ్యంగా పండ్లనే ఎక్కువ తీసుకొనవలసి ఉంటుంది. చికిత్స పూర్తయిన తర్వాత డాక్టర్ సలహా మేరకు పాలను కూడా తీసుకొనవచ్చు.పాలలో అత్యధిక మోతాదులో కాల్షియం నిల్వలు ఉంటాయి, కావున మెదడు క్షయ వ్యాధికి గురైన వారికి మంచి ఆహారంగా సూచించ బడుతుంది. క్షయ వ్యాధి ఉన్న రోగి దగ్గినప్పుడు క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయి. క్షయ వ్యాధి గ్రస్తుడు దగ్గినపుడు, అతని ఊపిరితిత్తుల నుండి వచ్చే కఫం ద్వారా ఈ బాక్టీరియా గాలిలో చేరి, దగ్గరలో ఉన్న ఆరోగ్యవంతమైన మనిషి పీల్చే గాలితోపాటు అతని ఊపిరితిత్తుల లోనికి ప్రవేశించి జబ్బుకు పునాది వేస్తుంది. కనుక వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత, ఇళ్లలో గాలి, వెలుతురు మొదలైనవి బాగా ఉండేలా చూసుకోవాలి. దగ్గినప్పుడు, తుమ్మిన ప్పుడు చేతి రుమాలు అడ్డంగా పెట్టుకోవాలి. ఎక్కడపడితే అక్కడ ఉమ్మేయ కూడదు. ఉమ్మి వేయడానికి మూత ఉన్న కప్పు ఉప యోగించాలి. మంచి పోషకాహారం తీసుకుని వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింప జేసుకోవాలి. 2025 నాటికి టిబిని అరికట్టడం లక్ష్యంగా చికిత్స మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చు. దీర్ఘకాలిక సీక్వెల్ ప్రారంభ రోగ నిర్ధారణ

మరియు చికిత్స ద్వారా నివారించవచ్చు. క్షయవ్యాధి చికిత్స, వైద్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కార్యక్రమాలలో భాగంగా ఆరోగ్య కేంద్రాలలోనే అందు బాటులో ఉన్నాయి. ప్రస్తుతం రివైజ్డ్ టి.బి. కంట్రోలు ప్రోగ్రాంను ప్రభుత్వం అమలు పరుస్తోంది. క్రమం తప్పకుండా పూర్తి మోతాదులో మందులు వేసుకున్నట్లయితే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేసు కోవచ్చు. క్షయరోగి క్రమం తప్పకుండా, ఆపకుండా కనీసం ఆరునెలలపాటు మందులు వేసుకొనవలసి ఉంటుంది. కొంతమంది రోగులకు ఒక సంవత్సరం పాటు మందులు ఇవ్వవలసి ఉంటుంది. వైద్యులను సంప్రదించిన తరువాతనే వారి సలహా మేరకు మాత్రమే మందులు వేసుకొనడం ఆపివేయాలి.

# అడ్డంగా బుక్కైన రోహిత్...

**హైదరాబాద్, మార్చి23, పెన్ పవర్:**



తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన మాదకద్రవ్యాల పార్టీకి సంబంధించి కీలక నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ సాగిస్తున్న క్రమంలో విస్మయకర వాస్తవాలు కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. మొదట్లో ఈ వ్యవహారం వెనక దుబాయ్ ఆస్తులు.. బినామీ వ్యక్తులు ఉన్నారని ప్రచారం జరిగింది. అయితే అంతకుమించిన దారుణమైన నిజాలు ఈ వ్యవహారం వెనుక ఉన్నాయని సమాచారం.ఈ పార్టీకి మాదక ద్రవ్యాలను సరఫరా చేసిన అభిషేక్ సింగ్ ప్రస్తుతం మహేశ్వరం ఎస్ఓటి పోలీసుల అదుపులో ఉన్నారు. ఆయనను శంషాబాద్ తరలించారు. అక్కడ ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారణ సాగిస్తున్నారు. రోహిత్ రెడ్డి డ్రైవర్ శరత్ కుమార్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అభిషేక్ సింగ్ ను పోలీసులు విచారించారు. రోహిత్ రెడ్డి, అభిషేక్ మధ్య అనేక పర్యాయాలు మాదకద్రవ్యాల కొనుగోలు జరిగినట్టు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ కాల్ సంభాషణలను కూడా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. బ్యాంకు ఖాతాల ఆధారంగా రోహిత్ రెడ్డి భారీగానే నగదును అభిషేక్ కు బట్వాడా చేసినట్టు తెలుస్తోంది. మొత్తంగా ఐదు వీకెండ్ పార్టీలలో అభిషేక్ రోహిత్ రెడ్డికి మాదక ద్రవ్యాలను సరఫరా చేసిన సమాచారం. గతంలో 14 సార్లు.. వీకెండ్ పార్టీలు కలుపుకొని మొత్తం 19 సార్లు రోహిత్ రెడ్డి కి అభిషేక్ మాదకద్రవ్యాలను సరఫరా

చేసినట్టు సమాచారం.వ్యవసాయ క్షేత్రంలో జరిగిన పార్టీలో రోహిత్ రెడ్డి డ్రైవర్ శరత్ కుమార్ కు అభిషేక్ నిషేధిత మత్తు పదార్థం అందించిన సమాచారం. ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారుల విచారణలో ఇదే తేలింది. అభిషేక్ కు భారీగా నెట్వర్క్ ఉందని.. అందులో చాలామంది కస్టమర్లు ఉన్నారని సమాచారం.అభిషేక్ ఐటీ ఉద్యోగిగా పని చేస్తున్నాడని.. అతడు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నాడని.. గోవా, బెంగళూరు ప్రాంతంలో ఉన్న నైజీరియన్ వ్యక్తుల వద్ద నిషేధిత మత్తు పదార్థాలను కొనుగోలు చేసి

.. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలు.. వీకెండ్ పార్టీలకు సరఫరా చేస్తాడని సమాచారం. ఈ క్రమంలోనే రోహిత్ రెడ్డి.. బాబిలోన పబ్ నిర్వాకుడు అర్జున్ రెడ్డికి.. నిషేధిత మత్తు పదార్థాలను అభిషేక్ అందించినట్టు తెలుస్తోంది. అభిషేక్ కాల్ లిస్టులో ఉన్న వ్యక్తుల వివరాలను సేకరించిన ప్రత్యేక దర్యాప్తు బృందం.. అతని కస్టమర్లపై కూడా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన పార్టీలో పాల్గొన్న వ్యక్తుల వివరాలను కూడా సిట్ సేకరించినట్టు తెలుస్తోంది. రోహిత్ రెడ్డికి మాత్రమే కాకుండా కౌశిక్ రవితో కూడా అభిషేక్ కు సంబంధం ఉన్నట్టు తెలుస్తోంది..రోహిత్ రెడ్డి పార్టీ వ్యవహారంలో మరో వ్యక్తి వెలుగులోకి వచ్చాడు. రోహిత్ రెడ్డికి సంబంధించిన వ్యవసాయ క్షేత్రంలో కొంత భాగాన్ని ఏలూరు ప్రాంతానికి చెందిన మరవలేని రమేష్ గతంలో బాడుగకు తీసుకున్నాడు. ఇందులో నాటు కోళ్లను పెంచుతున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నాడు. అయితే ఆరోజు జరిగిన పార్టీకి తమ ప్రాంతానికి చెందిన ఎంపీ పుట్టా మహేష్ హాజరవుతున్న నేపథ్యంలో రమేష్ అక్కడికి వచ్చాడు. పార్టీలో మద్యం తాగాడు. పోలీసులు దాడులు చేసే సమయానికి రమేష్ అక్కడే ఉండడంతో అరెస్ట్ చేశారు. అతడి మీద ఎక్సైజ్ యాక్ట్ లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# చంద్రబాబును బుక్ చేసిన చిరంజీవి



**విజయవాడ, మార్చి 23, పెన్ పవర్:** తెలంగాణలో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో మెగాస్టార్ చిరంజీవిచేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన నోటి నుంచి వచ్చిన కొన్ని మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అనవసరంగా ఆయన ఆ వ్యాఖ్యలు చేశారా? అని అనిపించేలా ఉన్నాయి. ఆయనకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు ఇచ్చారు. అయితే చిరంజీవి నందమూరి తారక రామారావు గురించి ఒక్క ప్రస్తావన కూడా చేయలేదు. ఆయన పేరుతో అవార్డు తీసుకున్నందుకు ఒకటి రెండు మాటలు అయినా చెప్పి ఉండాల్సింది. కానీ ఎందుకో చిరంజీవి ఎన్టీఆర్ ప్రస్తావన తీసుకురాలేదు. సహజంగానే ఏదైనా అవార్డులు ఎవరి పేరు మీద అయినా తీసుకుంటే వారి గురించి ప్రస్తావించడం అనేది ముఖ్యం. కానీ ఎందుకో చిరంజీవి ఆ విషయంలో పొరపాటు చేసినట్లు కనిపించారు. అయితే వెంటనే దానిని సరిదిద్దుకున్నారు. ఎన్టీఆర్ అవార్డు తీసుకోవడం పై ట్వీట్ చేశారు. ఆయన పేరుతో అవార్డు తీసుకోవడం పై ఆనందం వ్యక్తం చేశారు.అయితే దీనిపై పక్క రాష్ట్రం అని ఏపీని ఉద్దేశించి చిరంజీవి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆంధ్రప్రదేశ్ను పక్క రాష్ట్రం తో పోల్చడం ఏమిటని విమర్శలు వచ్చాయి. తెలంగాణ వేదికగా ఏపీ పక్క రాష్ట్రం కావచ్చు కానీ.. సాటి తెలుగు రాష్ట్రం. అందున సినిమా రంగానికి చెందిన వ్యక్తిగా ఆ మాట అనకూడదు. మరోవైపు కళారంగాన్ని ఆదరించడం, సినీ పరిశ్రమను ప్రోత్సహించడంలో పక్క రాష్ట్రం వెనుకంజలో ఉందని చిరంజీవి వ్యాఖ్యానించారు. అంటే నంది అవార్డులను ఇవ్వలేదన్నది చిరంజీవి అభిమతం గా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి..తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కన ఉండగానే ఏపీ సీఎం చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు చిరంజీవి. నంది అవార్డులను పునరుద్ధరించే విషయంలో చంద్రబాబు ఒక ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా చంద్రబాబు నంది అవార్డులను నిలిపివేసినట్లు అభిప్రాయం వచ్చేలా చిరంజీవి వ్యాఖ్యలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఆయన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా పవన్ కళ్యాణ్ అభిప్రాయం తీసుకుంటూ వస్తున్నదనలో సందేహం లేదు. అందులోనూ సినీ పరిశ్రమకు సంబంధించిన పూర్తి వ్యవహారాలన్నీ పవన్ కళ్యాణ్ చూస్తారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేనకు చెందిన కందుల దుర్గేష్ ఉన్నారు. ఆ ఇద్దరికీ చెబితే ఇట్టే పని జరిగిపోతుంది. కానీ చిరంజీవి మాత్రం చంద్రబాబు ప్రస్తావన తీసుకురావడం విమర్శలకు తావిస్తోంది. అనవసరంగా చంద్రబాబును ఇందులో ఇన్వాల్వ్ చేయడం ఏమిటనేది ఒక ప్రశ్న. ఏపీలో నంది అవార్డులను నిలిపివేసింది జగన్మోహన్ రెడ్డి. వాస్తవానికి తెలుగుదేశం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత నంది అవార్డులను ఇచ్చింది. అయితే 2017లో మొత్తం నాలుగు సంవత్సరాలకు సంబంధించి అవార్డులను ప్రదానం చేశారు. కానీ ఆ సమయంలో సొంతవారికి అవార్డులు ఇచ్చుకున్నారు అన్న విమర్శలు వచ్చాయి. ఇదే సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు విమర్శలు చేశారు.. అటు తరువాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నంది అవార్డులను పూర్తిగా ఇవ్వలేదు. కానీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు కనీసం నోరు తెరవలేదు. పోనీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఎవరు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవలేదు. అటువంటప్పుడు నంది అవార్డుల విషయంలో చిరంజీవి ప్రత్యేకంగా ఇప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని చిన్నచూపు చూసి మాట్లాడడం ఏమిటనేది ప్రశ్న.రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం విషయంలో సినీ పరిశ్రమ ఒకలా ఉంటుంది. ఏపీ ప్రభుత్వం విషయంలో మరోలా వ్యవహరిస్తోంది. ఎందుకంటే తెలంగాణలో సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల ఆస్తులు, పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. అందుకే వారి ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం విషయంలో భయము ఉంటుంది. కానీ ఏపీ మాత్రం కేవలం ప్రేక్షక వర్గానికోపాటు వీక్షక వర్గానికి మాత్రమే పరిమితం అయింది. కేవలం ఆదాయం ఇస్తుందే తప్ప సినీ పరిశ్రమ పెద్దలకు ఇక్కడ ఆస్తులు లేవు. అందుకే ఏపీ ప్రభుత్వం పై నోరు మెదిపే సినీ పరిశ్రమ వ్యక్తులు.. తెలంగాణ ప్రభుత్వం పై మాత్రం చాలా జాగ్రత్తగా మాట్లాడుతారు. అయితే చిరంజీవి చివరిగా ఒక మాట చెప్పారు. సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తేనే జీడీపీ పెరుగుతుందనేది చిరంజీవి వాదన. కానీ ఒక చిన్న పరిశ్రమ ఏదైనా లావాదేవీలకు కూడా చిత్ర పరిశ్రమ సాటి రాదు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలి. వేలాదిమందికి ఉపాధినిస్తుంది ఒకే. సంప్రదాయ సాంస్కృతిక రంగం సినిమా. అంతవరకు ఒకే కానీ.. రాష్ట్ర అభివృద్ధిలో కీలకం అన్న విషయం మాత్రం ఉత్తమాటే. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ ఒక్కటే. నంది అవార్డుల పేరిట ఉన్న దానిని మార్చి గద్దర్ పేరిట ఇస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఏపీ ప్రభుత్వం ఇస్తే ఆ అవార్డులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. బహుశా ఏపీ ప్రభుత్వం ఆ ఆలోచనతోనే నంది అవార్డులను పునరుద్ధరించలేదు. కానీ చిరంజీవి వేదికపై యధాలాపంగా మాట్లాడిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద ఇబ్బంది దుమారానికి దారి తీయడం మాత్రం ఆందోళన కలిగిస్తోం

# జనసేనలో అరవ రచ్చ



**కడప, మార్చి 23, పెన్ పవర్:** జనసేన పార్టీలో అంతర్గత పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం జనసేన అధిష్టానానికి, స్థానిక నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేయాలని చూస్తుంటే, పార్టీలోని అంతర్గత విభేదాలు మాత్రం తీవ్రమవుతున్నాయి. తాజాగా అరవ శ్రీధర్ వ్యవహారం పార్టీలో సెగలు రేపుతోంది పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. త్రిసభ్య కమిటీని కూడా వేసి విచారణ జరిపింది. ఈ క్రమంలో ఆయనపై కేసులు కూడా నమోదు అయ్యాయి. ఇక చర్యలు తీసుకున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆయన మళ్ళీ పార్టీ జెండాతో కార్యక్రమాలు నిర్వహించడం వివాదానికి కేంద్రబిందువైంది. పార్టీ పరంగా ఆయన దూరంగా ఉండాలని అధిష్టానం చెప్పినా, శ్రీధర్ మాత్రం క్షేత్రస్థాయిలో జనసేన జెండాతో పర్యటనలు చేయడం స్థానిక నేతలను అయోమయంలో పడేస్తోంది.అరవ శ్రీధర్ తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తుండటం సమాంతర వ్యవస్థగా మారిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇది కేడర్ మధ్య చీలికకు దారితీస్తోందని అధిష్టానానికి ఫిర్యాదులు అందుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవడం, ఇటీవల జరిగిన కొన్ని పార్టీ అంతర్గత సమావేశాల్లో అరవ శ్రీధర్ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇప్పటికే కొంతమంది నేతలు ఆయనను హెచ్చరించినట్లు తెలుస్తోంది.పార్టీ నుండి ఎలాంటి పిలుపు లేకపోయినా, కీలక నాయకులు పాల్గొనే సభల్లో, కార్యక్రమాల్లో ఆయన ప్రత్యక్షం కావడం స్థానిక నేతలకు ఇబ్బందిగా మారింది. జనసేనను ఇరుకున పెట్టడానికి వైసిపి వంటి ప్రత్యర్థి పార్టీలకు అరవ శ్రీధర్ వ్యవహారం ఒక ఆయుధంగా మారింది. ఒకవైపు క్లీన్ ఇమేజ్ కోసం ప్రయత్నిస్తున్న జనసేనకు, అరవ శ్రీధర్ లాంటి వ్యక్తుల వల్ల కలిగే డ్యామేజ్ తక్కువేమీ కాదు.

# కన్నబాబుకు వ్యతిరేకంగా కాంట్రాక్టర్లు...

**విజయవాడ, మార్చి 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధా ని అమరావతి పనులు ఊపందుకున్నాయి. ఈ పనులు ఇదే వేగంతో కొనసాగాలని, 2029 ఎన్నికల నాటికి అమరావతి పూర్తి చేయాలని చాలా మంది కోరుకుంటున్నారు. అయితే ఇలాంటి సమయంలో ఏపీసీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు బదిలీ కావడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. 2025 జనవరిలో బాధ్యతలు చేపట్టిన ఆయన, కేవలం 14 నెలల కాలంలోనే బదిలీ కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతకుముందు ఉన్న కాటమనేని భాస్కర్ కూడా కేవలం 7-8 నెలలు మాత్రమే పనిచేశారు. అమరావతి వంటి భారీ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇలా తరచుగా కమిషనర్లను మార్చడం వల్ల పనుల వేగంపై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.కన్నబాబు బదిలీ వెనుక అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదు. అయితే ఆయన బదిలీకి అనేక కారణాలున్నాయని అమరావతి వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యంగాకన్నబాబు అమరావతి పనులను పర్యవేక్షించడానికి ఒక 'డాష్ బోర్డు'ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఏ కాంట్రాక్టర్ ఎంత శాతం పని పూర్తి చేశారో స్పష్టంగా తెలిసేది. కొంతమంది కాంట్రాక్టర్లు కేవలం 5 నుంచి 20శాతం మాత్రమే పనులు పూర్తి చేసినట్లు ఇందులో తేలింది. ఈ పారదర్శకత వల్ల ఇబ్బంది పడ్డ కొందరు కాంట్రాక్టర్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని సమాచారం.కన్నబాబు ప్రవేశపెట్టిన కొత్త సాఫ్ట్వేర్ విధానం వల్ల కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని, దీనిపై వారు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. మాజీ సీఎస్ ఒకరు కొందరు ఐఏఎస్ అధికారులతో నిర్వహించిన రహస్య సమావేశానికి కన్నబాబు హాజరయ్యారనే రూమర్ కూడా ఉంది, అయితే ఇందులో ఎంతవరకు నిజం ఉందనేది తెలీదు. ప్రారంభంలో ఆయనపై రైతుల సమస్యల పట్ల అవగాహన లేదనే విమర్శలు వచ్చాయి. అయితే తర్వాత ఆయన చాలా సమస్యలను పరిష్కరించారు. అయినా ఆయన బదిలీ కావడం పలువురిని ఆశ్చర్యపరిచింది.అమరావతి నిర్మాణం అంటే కేవలం రోడ్లు, బిల్డింగ్లే కాదు.. ఇందులో భూ సమీకరణ, పర్యావరణ అంశాలు, టెక్నికల్ ఇష్యూస్ వంటి ఎన్నో సంక్లిష్టతలు ఉన్నాయి. కన్నబాబు స్థానంలో విజయరామరాజు నియమితులయ్యారు. ఆయన ఎంత సమర్థుడైనప్పటికీ, ఇంతటి సంక్లిష్టమైన ప్రాజెక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవడానికి కనీసం ఏడాది సమయం పట్టవచ్చు. ఇది పనుల పురోగతిని మందగించేలా చేసే అవకాశం ఉంది. ఒక కీలకమైన ప్రాజెక్టు పూర్తి కావాలంటే కనీసం 3-4 ఏళ్ల పాటు ఒకే కమిషనర్ను కొనసాగిస్తే బాగుంటుంది. ఇలా తరచూ మార్పులు చేయడం వల్ల ప్రాజెక్టు లక్ష్యాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.అయితే కన్నబాబు ఆకస్మిక బదిలీ వెనుక అనేక రకాల ప్రచారాలు ఉన్నాయి. అధికార వర్గాల్లో సైతం విస్మయం వ్యక్తం అవుతోంది. రాజకీయ కారణాలతోనే కన్నబాబు బదిలీ జరిగిందన్నది ప్రధాన అనుమానం. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో సిఎస్ గా పనిచేసిన వ్యక్తి ఒక ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన సలహాలు సూచనల కోసమే ఈ సమావేశం పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ సమావేశానికి కన్నబాబు హాజరయ్యారని ఒక టాక్ అయితే ఉంది. ఇది తెలిసి ప్రభుత్వం వేటు వేసిందని ప్రచారంలో ఉంది. కానీ ఒక ఐఏఎస్ అధికారిగా సిఆర్డిఏ కమిషనర్ లాంటి పెద్ద పోస్టులో ఉండడం గొప్ప విషయం. అంతకంటే ఇంకా ఏం కావాలని ఆయన జగన్మోహన్ రెడ్డి ప్రాపకం కోసం ప్రయత్నిస్తారు అనేది ఒక అనుమానమే. అది అంత మాత్రం వాస్తవం కాదన్న వారు ఎక్కువ మంది ఉన్నారుమరోవైపు అమరావతి రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతోనే కన్నబాబును మార్చారన్న ప్రచారం ఉంది. అయితే ఈ విషయంలో మాత్రం వాస్తవం ఉంది. కన్నబాబు ప్రారంభంలో బాధ్యతలు తీసుకున్న సమయంలో ఇటువంటి ఫిర్యాదులు వచ్చాయి. కానీ వాటన్నింటినీ అధిగమించి కన్నబాబు బాగానే సెట్ అయ్యారు సి ఆర్ డి ఏ కమిషనర్ గా. మరోవైపు కాంట్రాక్టర్ల ఫిర్యాదు నేపథ్యంలోనే బదిలీ చేశారన్న వాదన ఉంది. ఇటీవల కన్నబాబు ఒక సాఫ్ట్వేర్ తయారు చేశారు. అమరావతి పనులకు సంబంధించిన ప్రగతి ఎప్పటికప్పుడు గుర్తించే సాఫ్ట్వేర్ అన్నమాట. ఒక డాష్ బోర్డు మాదిరిగా ఆ సాఫ్ట్వేర్ తయారు చేశారు. అయితే దీనిపై కాంట్రాక్టర్లు ఆవేదనతో ఉన్నారు. ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతోనే కన్నబాబును తొలగించారు అన్నది ఒక వాదన.అమరావతి రాజధాని అనేది ఒక వ్రతంలా చేయాలి. ఒక ఉద్యమంలా నిర్మాణం చేపట్టాలి. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అది. అటువంటి ప్రాజెక్టుకు సిఆర్డిఏ కమిషనర్ కీలకం. కానీ ఇలా ఎప్పటికప్పుడు కమిషనర్లు మార్చడం ద్వారా ఆ ప్రభావం పనులపై పడుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో మాత్రం సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ అమరావతి రాజధాని పనుల్లో జాప్యం జరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇటువంటి సమయంలో రకరకాల కారణాలు చెప్పి కమిషనర్లను మార్చడం మాత్రం సహేతుకం కాదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## తిరుమలలో క్రెడిట్ వార్

**తిరుమల, మార్చి 23, పెన్ పవర్:** తిరుమలలో తాజాగా ప్రారంభమైన 'ఫుడ్ సేఫ్టీ ల్యాబ్' క్రెడిట్ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఈ ల్యాబ్ ఏర్పాటు తన చొరవతోనే జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. 'క్రెడిట్ చోరీ' చేయడంలో చంద్రబాబు కొత్త రికార్డులు సృష్టిస్తున్నారంటూ ఎద్దేవా చేసింది.జగన్ హయాంలోనే పునాది: గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తిరుమల నాణ్యతా ప్రమాణాల కోసం ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఖీూూA×కి ప్రతిపాదనలు పంపినట్లు వైఎస్సార్సీపీ తెలిపింది.ఆగస్టు 2023లోనే ప్రకటన: దీనికి సంబంధించి ఆగస్టు 2023లో ఖీూూA× సీఈఓ కమలవర్ధన్ రావు టీటీడీ అధికారులతో సమావేశమయ్యారని, ఆ రోజే ల్యాబ్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేస్తూ ఒక వీడియోను విడుదల చేసింది.ట్విట్టర్ వేదికగా విమర్శలు: గత ప్రభుత్వం చేసిన కృషిని ఇప్పుడు తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని వైసీపీ ట్వీట్ చేసింది.తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భక్తుల నమ్మకాన్ని కాపాడేందుకు సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో, అత్యాధునిక పరికరాలతో టీటీడీ ఈ ల్యాబ్ను అందుబాటులోకి తెచ్చింది. దీనిని సీఎం చంద్రబాబు ప్రారంభించగా, ఇది తమ హయాంలోనే మంజూరైన ప్రాజెక్టు అని వైసీపీ ఆధారాలతో సహా వాదిస్తోంది.

## కొత్త జిల్లాల వారీగా జడ్పీలకు రంగం సిద్ధం

**విజయవాడ, మార్చి 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్లో పాలనా వికేంద్రీకరణ దిశగా మరో కీలక అడుగు పడబోతోంది. కేవలం రెవెన్యూ జిల్లాలకే పరిమితం కాకుండా, స్థానిక సంస్థల పరిధిలోనూ సమూల మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా జిల్లా పరిషత్తుల పునర్విభజన ప్రక్రియ ద్వారా గ్రామీణ పాలనను మరింత ప్రజలకు చేరువ చేసేందుకు రంగం సిద్ధమైంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్చినప్పుడు, అది కేవలం రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికే పరిమితమైంది. కానీ, క్షేత్రస్థాయిలో నిధుల మంజూరు, గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో కీలక పాత్ర పోషించే జిల్లా పరిషత్తులు మాత్రం పాత 13 జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి మారబోతోంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలతో కలిపి రాష్ట్రంలోని 28 జిల్లాల్లోనూ ప్రత్యేక జిల్లా పరిషత్తులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.జిల్లా పరిషత్తుల పునర్విభజన కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు, అది ఒక రాజ్యాంగబద్ధమైన ఆవశ్యకత. ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల గడువు ఈ ఏడాది సెప్టెంబరు 24తో ముగియనుంది. చట్టప్రకారం, గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం, ప్రతి జిల్లాకు ఒక జిల్లా పరిషత్తు ఉండాలి. ప్రస్తుతం ఉన్న 13 జడ్పీలు 28 జిల్లాలను కవర్ చేయడం సాంకేతికంగా, పరిపాలనాపరంగా ఇబ్బందికరంగా మారింది. 15వ ఆర్థిక సంఘం నిధులు లేదా ఇతర కేంద్ర పథకాల నిధులు జిల్లా జనాభా, భౌగోళిక విస్తీర్ణం ఆధారంగా జిల్లా పరిషత్తులకు అందుతాయి. కొత్త జడ్పీలు ఏర్పడితే, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు నేరుగా అందే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం ఈ ప్రక్రియ ముందున్న అతిపెద్ద సవాలు జనగణన. ఏప్రిల్ 1 నుంచి జనగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో, కేంద్ర నిబంధనల ప్రకారం జిల్లాలు లేదా మండలాల సరిహద్దులను మార్చడానికి వీల్లేదు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కేంద్రానికి ప్రత్యేక విజ్ఞప్తి చేయాలని భావిస్తోంది. "కొత్త జిల్లాల్లో జడ్పీలు ఏర్పాటు చేయకపోతే ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదు" అనే పాయింట్ను ప్రభుత్వం బలంగా వినిపించనుంది. కేంద్రం మినహాయింపు ఇస్తేనే, నోటిఫికేషన్ విడుదల చేసి జడ్పీల విభజనను పూర్తి చేసే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం రాష్ట్రంలో 13 మంది జడ్పీ చైర్మన్లు మాత్రమే ఉన్నారు. పునర్విభజన జరిగితే ఆ సంఖ్య 28కి పెరుగుతుంది. ఇది రాజకీయంగా ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేస్తుంది. కలెక్టర్ కార్యాలయం ఒకచోట, జడ్పీ కార్యాలయం మరోచోట ఉండటం వల్ల ప్రస్తుతం సమన్వయ లోపం ఉంది. కొత్త జడ్పీలు వస్తే, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు మరింత వేగంగా అమలు అవుతాయి. కొత్త జడ్పీల ఏర్పాటులో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మినహాయించి కేవలం గ్రామీణ ప్రాంతాలనే పరిగణనలోకి తీసుకుంటారు. దీనివల్ల గ్రామీణ సమస్యలపై ఫోకస్ పెంచే అవకాశం ఉంటుంది.

## మంత్రి పదవి కోసం స్పీడ్ తగ్గించారా

**నెల్లూరు, మార్చి 23,పెన్ పవర్:** కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఏపీ పాలిటిక్స్లో పరిచయం అక్కరలేని పేరు. 2014, 2019లో రెండుసార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి..గత ఎన్నికలకు ముందు ఫ్యాన్ స్విచ్ఛాఫ్ చేసి సైకిల్ ఎక్కారు. నెల్లూరు రూరల్లో మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. అలాంటి కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి ఫైర్ బ్రాండ్ లీడర్గా..ఓవైపు వైసీపీని టార్గెట్ చేస్తూనే..మరోవైపు నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెడుతూ వచ్చారు. వందల కోట్ల నిధులతో నెల్లూరు రూరల్లో ఓ రేంజ్లో డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టి సీఎం చంద్రబాబుతో ప్రశంసలు పొందారు. పనితీరులో రాష్ట్రవ్యాప్తంగా 32వ స్థానం, నెల్లూరులో ఫస్ట్ ప్లేస్ సొంతం చేసుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డికి..విస్తరణలో మంత్రి పదవి పక్కా అంటూ ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్లే ఆయన కూడా దూకుడు పెంచుతూ వచ్చారు. కానీ కొన్ని రోజులుగా ఆయన తన రూట్ను మార్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే ఎమ్మెల్యే కోటంరెడ్డికి నెంబర్ వన్ ప్లేస్ దక్కడం..సీఎం చంద్రబాబు దగ్గర ప్రశంసలు పొందడం వెనుక ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డి కృషి ఎంతో ఉందన్నది పబ్లిక్ టాక్. ఎమ్మెల్యే కోటంరెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేనప్పుడు ఆ లోటు కనిపించకుండా గిరిధర్ రెడ్డి ప్రజల్లో తిరుగుతూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారట. ఒక్క మాటలో చెప్పాలంటే కోటంరెడ్డి గిరిధర్ రెడ్డే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అని ప్రజలు చెప్పుకునేలా వందల కోట్లతో అభివృద్ధి పనులను దగ్గరుండి జరిపిస్తున్నారట. ఇలా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించడం వల్లే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డికి మంచి పేరు, ప్రశంసలు దక్కుతున్నాయని తెలుగు తమ్ముళ్లే చర్చించుకుంటున్నారట.అయితే ఒక పక్క మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ఎమ్మెల్యే కోటంరెడ్డి నెక్స్ట్ టార్గెట్ తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని ఎమ్మెల్యేను చేసుకోవడమేనట. ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి తాను పోటీ చేయనని తన తమ్ముడే ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని పలు సందర్భాల్లో చెప్పారు కోటంరెడ్డి. సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు అమాత్య ఆశలను కూడా అలా పక్కన పెట్టి..నియోజకవర్గంపైనే ఫుల్ ఫోకస్ పెట్టారట కోటంరెడ్డి.రెండేళ్లు పూర్తికాక ముందే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.613 కోట్లతో చంద్రన్న రహదారులు, చంద్రన్న పార్కులు, చంద్రన్న వెలుగులు, బ్రిడ్జిల అభివృద్ధి పనుల జాతర చేపట్టారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. ఎక్కడా అవినీతికి తావు లేకుండా..ప్రతి పైసా ఖర్చు వివరాలను ప్రజలకు తెలిపేలా ఒక బుక్ లెట్ తయారు చేసి పబ్లిక్ డొమెయిన్లో ఉంచారట. అభివృద్ధి పనులకు సంబంధించిన బుక్లెట్ను సీఎం చంద్రబాబుకు కూడా చూపించారట ఎమ్మెల్యే కోటంరెడ్డి. వీటిలో కొన్ని పూర్తి కాగా..ఇంకొన్ని చివరి దశలో..మరి కొన్ని టెండర్ల దశలో ఉన్నాయని అంటున్నారు. ఇటీవల 339 పనులను ఒకేసారి స్థానిక ప్రజలతో శంకుస్థాపన చేసి 60 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించారు కోటంరెడ్డి. మరోసారి రూ.27 కోట్లతో ఈ నెల 22న స్థానిక ప్రజల చేత 240 చోట్ల ఒకేసారి ప్రారంభోత్సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నారట.పక్కా వ్యూహం ప్రకారమే నియోజకవర్గ డెవలప్మెంట్కు టాప్ ప్రయారిటీ ఇస్తున్నారట కోటంరెడ్డి. తనకు మంత్రి పదవి వస్తే సంతోషం. కానీ వచ్చే ఎన్నికల్లో తమ్ముడిని ఎమ్మెల్యే చేసి తీరాలని పట్టుదలతో ఉన్నారట. కోటంరెడ్డికి అమాత్య యోగం ఎప్పుడు దక్కుతుందో? సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

## ముద్రగడకు నో చెప్పిన జగన్

**కాకినాడ, మార్చి 23, పెన్ పవర్:** రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభానిది ప్రత్యేక స్థానం. 1978లోనే చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి తో పాటు అసెంబ్లీలో అడుగు పెట్టారు. కానీ రాజకీయంగా స్థిరత్వం ఉండదన్న విమర్శ ఆయనపై ఉంది. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడ టిడిపి నాయకత్వంతో విభేదించి కాంగ్రెస్ లోకి వచ్చారు. కాంగ్రెస్ నుంచి బిజెపి.. అక్కడి నుంచి వైసీపీలో చేరారు. మొన్నటి ఎన్నికలకు ముందు జనసేనలో చేరాలని భావించారు. వీలుకాకపోయేసరికి వైసీపీలో చేరారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ముందు కొత్త డిమాండ్ పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. కానీ జగన్ మాత్రం ఆలోచనలో పడినట్లు సమాచార ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి ఎన్నికలకు ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కోసం గట్టిగానే పనిచేశారు. ఏకంగా పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. అలా చేయకపోతే తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని సవాల్ చేశారు. కానీ ఫలితం లేకపోయింది. పేరు మార్చుకోవాల్సి వచ్చింది. అయితే ముద్రగడ పద్మనాభం పెద్దరికాన్ని గౌరవించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పబ్లిక్ అడ్వైజరీ కమిటీలో ఆయనకు స్థానం ఇచ్చారు. అయితే ఈ కమిటీ టిడిపి పోలిట్ బ్యూరో మాదిరిగా కాదు. పెద్దగా అధికారాలు కూడా ఉండవు. అందుకే తనకు పార్టీలో పెద్ద పదవి ఇవ్వాలని ముద్రగడ జగన్మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు తెలుస్తోంది.ముద్రగడ పద్మనాభం ఉభయ గోదావరి జిల్లాల బాధ్యతలను తనకు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే ఆయనతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చాలామంది విభేదిస్తున్నట్లు సమాచారం. ఎప్పుడో పాతకాలపు రాజకీయాలు అనుసరిస్తుంటారు ముద్రగడ పద్మనాభం. అందుకే పెద్దగా ఎవరికీ నచ్చరు. ఏ కాపు రిజర్వేషన్ ఉద్యమంతో ముందుకు వెళ్లారు అదే కాపులు ఇప్పుడు ఆయనను నమ్మేస్థితిలో లేరు. మరోవైపు గోదావరి జిల్లాలో జనసేన ప్రభావం అధికంగా ఉంది. ఇటువంటి సమయంలో ముద్రగడ పద్మనాభం కు ఉపయోగ గోదావరి జిల్లాల బాధ్యతలు ఇస్తే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే జగన్ ఆ పదవి ఇచ్చేందుకు అంగీకరించరు. మరోవైపు చూస్తే ముద్రగడ తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వయోభారంతో ఇబ్బందులు ఉన్నాయి. అయితే జగన్ ఇప్పుడు పదవి ఇవ్వకపోతే ముద్రగడ నిర్ణయం ఎలా ఉంటుంది అనేది చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## అమెరికా మిలటరీ బేస్‌లకు విద్యుత్ సరఫరా చేసే కేంద్రాలపై దాడి చేస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** తమ విద్యుత్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటే, అమెరికా సైనిక స్థావరాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న పశ్చిమ ఆసియా విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. గల్ఫ్ అరబ్ దేశాలపై దాడులను వివరిస్తూ ఇరాన్ పార్లమెంటరీ రివల్యూషనరీ గార్డ్ ఈ ప్రకటన చేసినట్లు అధికారిక మీడియా సోమవారం ఈ ప్రకటన చేసింది. విద్యుత్ కేంద్రాలపై దాడి జరిగితే, ఆక్రమణ పాలన విద్యుత్ కేంద్రాలను, అమెరికా స్థావరాలకు విద్యుత్ సరఫరా చేసే ప్రాంతీయ దేశాల విద్యుత్ కేంద్రాలను, అమెరికన్లను వాటాలు ఉన్న ఆర్థిక, పారిశ్రామిక మరియు ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటుందని ప్రకటన పేర్కొంది. ఇజ్రాయిల్‌ను 'ఆక్రమణ పాలన'గా ఆ ప్రకటన పేర్కొంది. 48 గంటల్లోగా ఇరాన్ విద్యుత్ ప్లాంట్లను అమెరికా లక్ష్యంగా చేసుకుంటుందని ఆదివారం ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే.

## సర్వతోముఖాభివృద్ధితో చైనా ముందంజ

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజా చైనా అన్ని రంగాల్లో అత్యాధునిక సాంకేతికతలను మేళవించి ప్రజల సమిష్టి కృషితో వేగవంతమైన సర్వతోముఖాభివృద్ధితో చైనా ప్రగతి పథాన దూసుకెళ్తోందని పలురు విధానరూపకర్తలు, ఆర్థిక నిపుణులు, కార్పొరేట్ సంస్థల అధినేతలు ప్రశంసలు కురిపించారు. అత్యాధునిక నాణ్యతతో కూడిన అభివృద్ధి లక్ష్యంగా విధానాల రూపకల్పన కోసం చైనా డెవలప్‌మెంట్ ఫోరం (సిడిఎఫ్) సమ్మిట్ బీజింగ్‌లో ఆదివారం నాడు ఘనంగా ప్రారంభమైంది. ఈ ఏడాది సమ్మిట్ 'చైనా తన 15వ పంచవర్ష ప్రణాళిక కాలం : అత్యంత నాణ్యమైన అభివృద్ధి ? సమిష్టి నూతన అవకాశాల సృష్టి' నేపథ్యంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా గవర్నరు పాన్ గాంగ్‌షెంగ్, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తొలి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాన్ కట్జ్, ఆపిల్ సంస్థ సిఇఒ టిమ్ కుక్, డెవలప్‌మెంట్ రీసెర్చ్ సెంటర్ స్టేట్ కౌన్సిల్ డైరెక్టర్ లు హావో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాన్ గాంగ్ షెంగ్ మాట్లాడుతూ స్థిరమైన, హేతుబద్ధమైన, ఊహించగలిగే సహకార ప్రాధాన్యత ఇదివరకు కంటే ఇప్పుడు చాలా విలువైనదని తెలిపారు. వాణిజ్య ప్రతిబంధకాలు, ఆంక్షలు స్వేచ్ఛా వాణిజ్య పునుదాలను కృగదీస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణవాదాన్ని నిర్దిష్టంగా వ్యతిరేకించితీరాలాని, మరింత సమగ్రత, ప్రయోజనాల విస్తృతితో కూడాన ప్రపంచీకరణ అవసరమని ఆయన తెలిపారు.


## అమెరికా ఎఫ్-15 జెట్‌ను కూల్చిశాం : ఇరాన్

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాకు చెందిన ఎఫ్-15 ఫైటర్ జెట్‌ను కూల్చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. హర్మూజ్ జలసంధి సమీపాన ఎఫ్-15 ఫైటర్ జెట్‌ను ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే క్షిపణితో కూల్చిసినట్లు ఇరాన్ అధికారిక మీడియా టెహ్రాన్ టైమ్స్ సామాజిక మాధ్యమంలో ఓ పోస్టు పెట్టింది. ఎఫ్-15 ఫైటర్ జెట్‌ను కూల్చటానికి ముందు ఇరాన్ దక్షిణ తీరంలో దానిని గుర్తించినట్లు తెలిపింది. అమెరికా విమానం చొరబాటును తమ గగనతల రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకున్నట్లు టెహ్రాన్ టైమ్స్ పేర్కొంది. ఫైటర్ జెట్‌ను కూల్చటానికి ముందు ట్రాక్ చేసిన క్లిప్‌ను పోస్టు చేసింది. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవకుంటే ఇరాన్ విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ హెచ్చరిక తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై అమెరికా లేదా ఇజ్రాయెల్ ఇప్పటివరకు స్పందించలేదు. కాగా, ఇప్పటికే ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికాకు చెందిన 16 యుద్ధ విమానాలు కుప్పకూలాయి.

## యుఎఇకి ప్రాణసంకటంగా మారిన అమెరికా బంధం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇజ్రాయిల్-అమెరికా, ఇరాన్ మధ్య మొదలైన యుద్ధంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) పరిస్థితి కుడితిలో పడిన ఎలుక మాదిరిగా తయారైంది. ఘర్షణ ప్రారంభమైనప్పటి నుంచి యుఎఇపై ఇరాన్ 1,714 డ్రోన్లు, 334 బాలిస్టిక్ క్షిపణులు, 13 క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడులలో అనేక హోటళ్లు, రిఫైనరీలు, విమానాశ్రయాలు, వాణిజ్య మండలులు దెబ్బతిన్నాయి. యుఎఇనే ఇరాన్ ఎందుకు లక్ష్యంగా ఎంచుకుంది? అక్కడ అమెరికా తన సైనిక కేంద్రాలను నిర్వహించడమే దీనికి కారణమా? ఈ ప్రశ్నలకు సమాధానం కొంత క్లిష్టంగానే ఉంటుంది. యుఎఇతో అమెరికాకు బలమైన ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షులు అయిన తర్వాత భారీగా విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. ఇతర భాగస్వాముల కంటే ఉదారంగా స్పందించిన దేశం యుఎఇయేనే. అమెరికా అధ్యక్ష కార్యాలయం శ్వేతసౌధం అందించిన వివరాల ప్రకారం?అమెరికాలో పది సంవత్సరాల కాలంలో 1.4 ట్రిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానని యుఎఇ హామీ ఇచ్చింది. అమెరికాకు అందిన మొత్తం హామీలలో ఇది 27 శాతం. ఖతార్, జపాన్, సౌదీ అరేబియా, భారత్, దక్షిణ కొరియా, బరైన్, ఐర్లాండ్ కూడా అమెరికాలో పెట్టుబడులు పెడతామని తెలిపాయి. ట్రంప్ పొందే విదేశీ పెట్టుబడులలో 62 శాతం అరబ్ దేశాల నుంచి వచ్చేవే. యుఎఇని ఇరాన్ లక్ష్యంగా చేసుకోవడానికి ఈ పెట్టుబడులు ఒక్కటే కారణం కావు. అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా యుఎఇ ఆవిర్భవించడం కూడా కారణమే. గత దశాబ్ద కాలంలో యూఏఈలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా వెయ్యికి పైగా వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలలో వంద శాతం విదేశీ యాజమాన్యాన్ని దుబాయి ప్రభుత్వం అనుమతించిన తర్వాత ఈ పెట్టుబడులు బాగా వచ్చాయి. ప్రపంచబ్యాంక్ డేటా ప్రకారం? యుఎఇలోకి 2018లో 10.4 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు రాగా 2021 నాటికి అవి దాదాపుగా రెట్టింపై 20.7 బిలియన్ డాలర్లకు చేరాయి. 2024లో అవి రెట్టింపు కంటే ఎక్కువై 45.6 బిలియన్ డాలర్లు అయ్యాయి.

## మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు



**హైదరాబాద్ పెన్ పవర్:** మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరులో భాగమే ''జన్ ఆక్రోష్'' ర్యాలీ అని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. ఆదివారంనాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ''కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవడం, ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీయడానికి తీసుకువచ్చిన వీబీ- జీఆర్ఏఎంజీ చట్టాన్ని రద్దు చేయడం, విద్యుత్, విత్తన చట్ట సవరణలను విరమించుకోవడం, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం నుంచి వైదొలగడం వంటి డిమాండ్లను జన ఆక్రోష్ ర్యాలీ ముందుకు తెస్తోంది'' అని అన్నారు. ''వివిధ రాష్ట్రాల్లో జరిగిన యాత్రలలో భాగంగా పర్యటనలతో గ్రామాలు, చిన్న పట్టణాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధ ప్రభావాలను భారత్‌లోని సామాన్య ప్రజలు అనుభవిస్తున్నారు. వంటగ్యాస్, ఇంధన ధరల పెరుగుదల, గ్యాస్ సిలిండర్ల కొరత, ధరల పెరుగుదల, చిన్న, మధ్య తరహా వ్యాపార రంగం కుప్పకూలడం వంటి సమస్యలు ప్రజల జీవితాలను దుర్భరం చేశాయి. ఇటువంటి సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రజల గళాన్ని వినిపించే ఒక గొప్ప వేదికగా జన ఆక్రోష్ ర్యాలీ నిలుస్తుంది'' అని తెలిపారు. ఈ ర్యాలీలో సీపీఐ(ఎం) అఖిల భారత నాయకులు ప్రసంగిస్తారని, మరిన్ని ఉద్యమాలకు కూడా పిలుపునిస్తారని తెలిపారు.

# జగదీశ్వర్ గానయాత్రకు నంది గౌరవం

**హైదరాబాద్ పెన్ పవర్:** జగదీశ్వర్‌కు స్వర్ణ నంది పురస్కారం లభించడం తెలుగు గాన ప్రపంచానికి గర్వకారణమైన ఘట్టంగా నిలిచింది. గాత్రంలో గంభీరత, స్వరంలో సౌందర్యం, భావ ప్రకటనలో ఆవేశం?ఈ మూడు లక్షణాల సమన్వయంతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న గాయకుల్లో డా. గుండి జగదీశ్వర్ శర్మ ఒక విశిష్ట ప్రతిభ. తెలంగాణ భూమిలోని ఆధ్యాత్మిక క్షేత్రాల వైభవాన్ని తన గాత్రంలో మలచి, భక్తి, జానపదం, శాస్త్రీయతల సమ్మేళనంతో గానయాత్ర సాగిస్తున్న ఆయనకు లభించిన ఈ గౌరవం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా తెలుగు సంగీత సంప్రదాయానికి లభించిన మరొక గౌరవంగా చెప్పుకోవాలి.పవిత్ర గోదావరి నది తీరాన వెలసిన ధర్మపురి క్షేత్రం, దక్షిణ కాశీగా, నవనరసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి పొందిన ఆధ్యాత్మిక ప్రదేశం. హరిహరులు, బ్రహ్మతో కూడిన త్రిమూర్తుల క్షేత్రంగా ఖ్యాతి గాంచిన ఈ ప్రాంతంలో గుండి హరిప్రియ, హన్మాండ్లు దంపతులకు జన్మించిన జగదీశ్వర్ శర్మ బాల్యంలోనే సంగీతం పట్ల సహజమైన ఆకర్షణను ప్రదర్శించారు. భక్తి వాతావరణంలో పెరిగిన ఆయనకు స్వరాలంటే పూజా విధానంలా మారింది. చిన్ననాటి నుంచే సాధనను జీవిత భాగంగా చేసుకొని, గురువుల మార్గదర్శకత్వంలో స్వర సాధనను క్రమబద్ధంగా అభ్యసిస్తూ, తన గాత్రాన్ని మెరుగు పరచుకున్నారు. ఈ క్రమశిక్షణే ఆయనను గాత్ర సరస్వతిగా తీర్చిదిద్దింది. సంగీత రంగంలో అడుగుపెట్టిన ప్రారంభ దశల నుంచే ఆయన ప్రతిభ ప్రస్ఫుటమైంది. రేడియో, టెలివిజన్ వంటి మాధ్యమాల ద్వారా తన గాత్రాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ, తెలుగు గాన ప్రపంచంలో తన ప్రత్యేక గుర్తింపును స్థిరపరచుకున్నారు. ముఖ్యంగా ఈటీవీలో ప్రసారమైన 'పాడుతా తీయగా' కార్యక్రమంలో పాల్గొనడం ఆయన జీవితంలో కీలకమలుపుగా నిలిచింది. గానగంధర్వుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో తన గాత్రాన్ని ప్రదర్శించడం ద్వారా ఆయన ప్రతిభకు విశేషమైన గుర్తింపు లభించింది. అదే విధంగా జెమినీ టీవీలోని 'నవరాగం' సంగీత పోటీలో సెమీఫైనల్ వరకు చేరుకోవడం ద్వారా, ప్రముఖ గాయకుల ప్రశంసలు పొందిన తొలి తెలంగాణ గాయకుడిగా గుర్తింపు సంపాదించారు. అయితే ఆయన ప్రయాణం టెలివిజన్ కార్యక్రమాలతో మాత్రమే పరిమితం కాలేదు. సంగీత దర్శకులు కోటి, మాధవపెద్ది సురేష్, ఆర్. పి. పాట్నాయక్ వంటి ప్రముఖులతో కలిసి ఆర్కెస్ట్రా ప్రదర్శనల్లో పాల్గొని, వారి ప్రశంసలను అందుకున్నారు. ఈ అనుభవం ఆయన గాన శైలిలో మరింత నైపుణ్యాన్ని, వైవిధ్యాన్ని తీసుకొచ్చింది. ఇప్పటి వరకు 1600కు పైగా సంగీత విభావరులను నిర్వహించడం ఆయనకు ఒక అరుదైన ఘనత. ఈ కార్యక్రమాలు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించి, ఆయన గాత్రాన్ని విభిన్న వేదికలపై వినిపించాయి. ప్రతి ప్రదర్శనలోనూ శ్రోతల హృదయాలను హత్తుకునే గాత్రమాధుర్యం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. జగదీశ్వర్ శర్మ గాన ప్రస్థానానికి లభించిన అవార్డులు ఆయన ప్రతిభకు నిదర్శనం. ఇప్పటి వరకు 130కి పైగా అవార్డులు అందుకోవడం ద్వారా ఆయన తన స్థానాన్ని మరింత బలపరచు కున్నారు. ముఖ్యంగా ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం పేరుతో మూడు సార్లు, ఘంటసాల పేరుతో రెండు సార్లు అవార్డులు పొందడం ఆయన గాన ప్రతిభకు అద్దం పడుతుంది. తెలంగాణ రత్న, ప్రతిభా రత్న వంటి బహుమతులు ఆయనకు లభించడం ఆయనకు ఉన్న ప్రజాదరణను తెలియ జేస్తుంది. నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ నుంచి జాతీయ స్థాయిలో 'బెస్ట్ సింగర్'గా అవార్డు పొందడం ఆయన గానానికి దేశవ్యాప్తంగా లభించిన గుర్తింపు. అంతేకాకుండా, అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్సులలో 'బెస్ట్ సింగర్'గా స్థానం పొందడం ఆయన ప్రతిభకు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తీసుకొచ్చింది.2021లో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం ఆయన గానసేవకు లభించిన అత్యున్నత గౌరవాల్లో ఒకటి. అప్పటి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఈ డాక్టరేట్ అందుకోవడం ఆయన జీవితంలో మరుపురాని ఘట్టంగా నిలిచింది. ఇది ఆయన వ్యక్తిగత విజయమే కాకుండా తెలంగాణ గాన సంప్రదాయానికి లభించిన గౌరవంగా చెప్పుకోవచ్చు.భక్తి, ఆధ్యాత్మికత, జానపద సంప్రదాయాల మేళవింపుతో ఆయన గానయాత్ర కొనసాగుతోంది. 100కు పైగా ఆడియో సీడీలలో పాల్గొని, వినాయక భక్తి గీతాలు, శ్రీరామ భజనలు, ఆంజనేయ స్తోత్రాలు, జానపద గీతాలు వంటి అనేక గాన రూపాలను ప్రజలకు అందించారు. ముఖ్యంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి శతకాలకు ఆయన గాత్రం అందించడం ద్వారా ఆధ్యాత్మిక గానానికి కొత్త పరిమాణాన్ని ఇచ్చారు. ప్రతి గానంలోనూ భక్తి భావాన్ని ప్రతిబింబింపజేసే ఆయన గాత్రం శ్రోతలకు ఆత్మీయ అనుభూతిని కలిగిస్తుంది. సంగీతాన్ని ఆయన కేవలం వృత్తిగా కాకుండా జీవనపథంగా భావించడం ఆయన ప్రత్యేకత. ప్రతి పాటను పూజార్చనగా భావిస్తూ, శ్రద్ధతో, భక్తితో ఆలపించడం ఆయన గానశైలిలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధానం ఆయనను సాధారణ గాయకుడిగా కాకుండా ఆధ్యాత్మిక గాయకుడిగా నిలబెట్టింది. భక్తి, సామాజిక చైతన్యం, సంగీత వైవిధ్యాల సమ్మేళనంతో ఆయన గాన ప్రస్థానం ఒక ఆదర్శంగా నిలుస్తోంది.ఇటీవల శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో స్వర మాధురి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు స్వర్ణ నంది ఉగాది పురస్కారం ప్రదానం చేయడం విశేషం. వంశీ ఇంటర్నేషనల్ అధినేత వంశీ రామరాజు, దైవజ్ఞ శర్మ, ఆస్ట్రేలియాలోని వ్యాపారి శేషు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం

ఆయన గాన ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది. 28 సంవత్సరాల సంగీత ప్రయాణంలో ఇది ఆయనకు లభించిన మూడవ బంగారు నంది పురస్కారం కావడం ప్రత్యేకత. ఈ అవార్డుతో కలిపి ఆయన అందుకున్న మొత్తం అవార్డుల సంఖ్య 135కు చేరుకోవడం ఆయన సాధనకు ప్రతీకగా నిలుస్తోంది. జగదీశ్వర్ శర్మ గాన ప్రస్థానం కేవలం వ్యక్తిగత విజయాల సమాహారం మాత్రమే కాదు; అది ఒక సంస్కృతి, ఒక సంప్రదాయం, ఒక ఆధ్యాత్మిక ప్రయాణం. ఆయన గాత్రం ద్వారా భక్తి పరంపర కొనసాగుతూనే ఉంది. భవిష్యత్ తరాలకు ఆయన ఒక ప్రేరణగా నిలుస్తున్నారు. సాధన, పట్టుదల, వినయం?ఈ మూడు గుణాలు కలిసినపుడే గొప్పతనం సాధ్యమవుతుందని ఆయన జీవితమే స్పష్టంగా చెబుతోంది. తెలుగు గాన ప్రపంచంలో ఆయన స్థానం మరింత ఎత్తుకు ఎదగాలని, ఆయన గాత్రం మరిన్ని హృదయాలను హత్తాలని ఆకాంక్షించాలి.

## అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీకి ఎదురుదెబ్బ.. పార్టీకి కీలక మంత్రి రాజీనామా

**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీ ఎన్నికల వేళ అస్సాంలో అధికార బీజేపీకి ఊహించని షాక్ తగిలింది. హాఫ్లాంగ్ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నందిత గొర్లోసా పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అదేవిధంగా తన రాజీనామాను తక్షణమే ఆమోదించాలని కోరుతూ ఆమె రాష్ట్ర పార్టీ అధ్యక్షుడికి లేఖ రాశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆమెకు టికెట్ నిరాకరించిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో కొత్త అభ్యర్థిగా రూపాలీ లాంగ్థాసా ప్రకటించడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. బీజేపీని వీడిన నందిత గొర్లోసా కొద్దిసేపటికే ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఆమె నుంచి ఆమె కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉంది. తాను భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తక్షణమే



రాజీనామా చేస్తున్నానని నందిత గొర్లోసా లేఖలో వెల్లడించారు. పార్టీలో తనకు లభించిన అవకాశాలకు, ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## సమాజంలో కొరవడుతున్న సున్నితత్వం !

**హైదరాబాద్ పెన్ పవర్:** సమాజంలో కొరవడుతున్న సున్నితత్వం పట్ల చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. తమ రోజువారీ పనులతో బిజీ బిజీగా గడిపే వ్యక్తులు కూడా ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే చాలు వెంటనే కారు దిగి పరుగులు పెడతారని, ఇంతా చేసి మృత్యుముఖంలో వుండే బాధితులకు సాయం చేయడానికి కాదని, తమ సోషల్ మీడియాలో పోస్టు చేసేందుకు వీడియోలు తీసుకోవడానికని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనుమానితులుగా పేర్కొంటున్న వారి ముఖాలు, పేర్లు, ఇతర వివరాలను పోలీసులు సోషల్ మీడియా హ్యాండిల్‌లో పెట్టడానికి సంబంధించిన రిట్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా



చీఫ్ జస్టిస్ ఈ వ్యాఖ్యలు చేశారు. నిందితులను ఫోటోలు తీసుకోవడానికి, వారి చేతులకు సంకెళ్ళు వేసి బహిరంగంగా చూపించడానికి అనుమతించడం ద్వారా పోలీసులు మీడియాతో సహకరిస్తున్న తీరును పిటిషన్‌దారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. రాజ్యాంగంలో 21వ అధికరణ ప్రకారం, నిందితుడు గౌరవంతో జీవించే ప్రాథమిక హక్కును తీవ్రంగా ఉల్లంఘించడం కిందకు వస్తుందని పిటిషనర్ హేమేంద్ర పటేల్ తరపున న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ తెలిపారు. దీనివల్ల నిందితులపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతుందన్నారు. పైగా క్రిమినల్ జస్టిస్ వ్యవస్థకు విఘాతం కలుగుతుందన్నారు. దానిపై జస్టిస్ జోమాల్యా బాగ్చి స్పందిస్తూ, పోలీసులు తటస్థ వైఖరితో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. అటు నిందితులు, ఇటు బాధితులు ఎవరి పక్షాన నిలబడరాదన్నారు. పైగా మీడియాలో ఇలాంటివి షేర్ చేయడం వల్ల స్వేచ్ఛగా, సక్రమంగా, పారదర్శకంగా విచారణ జరిగే హక్కు దెబ్బతింటుందన్నారు. ప్రజాభిప్రాయాన్ని బట్టి కాదని న్యాయస్థానాలు దోషి ఎవరో నిర్ధారిస్తాయని చెప్పారు. అయినా నిబంధనల ద్వారా పోలీసులను నియంత్రించగలం కానీ, సోషల్ మీడియా, ప్రజలు సంగతేంటి? వారిని నియంత్రించగలమా? అని త్రిసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. ప్రస్తుతానికి పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని పిటిషన్‌దారుడిని కోర్టు కోరింది. పోలీసు బ్రీఫింగ్‌లపై కొత్త నిబంధనవాళికి అనుగుణంగా రాష్ట్రాలు వ్యవహరిస్తున్న తీరును పరిశీలించిన తర్వాత ఏప్రిల్ నాటికి సమగ్రంగా పిటిషన్ దాఖలు చేయాలని కోరింది.

## భారత నౌకాదళం అమ్ముల పొదిలోకి 'ఐఎన్ఎస్ తారగిరి'

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత నౌకాదళం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన టెక్నాలజీ నీలగిరి శ్రేణి స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తారగిరి (ఎఫ్ 41)ని అధికారికంగా నౌకదళంలో చేరేందుకు సిద్ధమవుతోంది. దీనిని ఏప్రిల్ 3న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించనున్నారు. ప్రాజెక్ట్ 17ఏ తరగతికి చెందిన నాలుగో ఫ్రిగేట్ యుద్ధనౌక తారగిరి. ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) ఈ యుద్ధనౌకను నిర్మించింది. 75 శాతం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో సుమారు 6,670 టన్నుల బరువుతో దీనిని తయారు చేశారు. దీనిని మునుపటి నౌకల కంటే మరింత ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ఇందులో ఆధునిక డిజైన్‌తో తక్కువ రాడార్ గుర్తింపు ఉంది. భారత్‌లో నిర్మాణం కోసం ఏర్పాటైన దాదాపు 200 సూక్ష్మ, చిన్న, మధ్యపరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సాయంతో ఈ తారగిరి నిర్మాణం జరిగింది. కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ (సీఓడీఓజీ) ఇంజిన్ వ్యవస్థతో తారగిరి నడుస్తోంది. హై-స్పీడ్, హై- ఎండ్యూరెన్స్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. బహుళ సముద్ర కార్యకలాపాలను అనుకూలంగా దీనిని రూపొందించారు. ఈ నౌకలో శక్తివంతమైన ఆయుధ వ్యవస్థ ఉంది. అందులో ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే సూపర్ సోనిక్ క్షిపణులు, మధ్యశ్రేణి ఉపరితలం నుంచి గగనతాలనికి ప్రయోగించే క్షిపణులు, యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్(ఏఎస్‌డబ్ల్యూ) వ్యవస్థ ఉంది. ఇవన్నీ అత్యాధునిక కంబాట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా సమన్వయం చేశారు. దీని వల్ల సిబ్బంది అత్యంత కచ్చితత్వంతో ముప్పులకు ప్రతిస్పందించగలరు. తారగిరి కేవంల యుద్ధ నౌకగా మాత్రమే కాదు. దీనిని మానవతా సాయం, విపత్తు సహాయక చర్యలు, అంతర్జాతీయ సముద్ర దౌత్య కార్యక్రమాల కోసం నిర్మించారు. తారగిరి భారత నౌకాదళాన్ని మరింత శక్తివంతంగా మార్చడమే కాకుండా, దేశ సముద్ర సరిహద్దులను రక్షించే కీలక బలంగా నిలవనుంది.

## రైతన్నలకు బిగ్ షాక్.. తగ్గిన యూరియా తయారీ!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ యుద్ధంలో మన భారతదేశంలోని రైతులకు కష్టాలు వచ్చేలాగా కనిపిస్తున్నాయి. హర్మూజ్ జల సంధి మూతపడిన నేపథ్యంలో ఇండియాకు రావలసిన ఒఔఉ ( యూరియాలో వాడే వాయువు) సరఫరా పూర్తిగా నిలిచిపోయినట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో ఇండియా వ్యాప్తంగా యూరియా ఉత్పత్తి 50 శాతానికి పడిపోయినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గ్యాస్ కొరత వల్ల గెయిల్, ఐఓసీ లాంటి సంస్థలు యూరియా ప్లాంట్లకు సప్లై కూడా పూర్తిగా తగ్గించాయి. దీని ఫలితంగా వచ్చే ఖరీఫ్ సీజన్ కు అవసరమైన 180 లక్షల టన్నుల యూరియా లభ్యతపై ఇప్పుడు కొత్త ఆందోళన నెలకొంది. ప్రస్తుతం మన ఇండియాలో కేవలం 62 లక్షల టన్నుల నిల్వలు మాత్రమే ఉన్నాయి. అదే సమయంలో చైనా నుంచి కూడా దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి. అయితే యూరియా సమస్య ఉన్న నేపథ్యంలో ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ దీనిపై ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యూరియా సప్లై చేయాలని ఇప్పటికే అధికారులను ప్రధాని నరేంద్ర మోడీ అలెర్ట్ చేశారు. యుద్ధం కారణంగా ఎరువులు, ఇంధనం, నిత్యవసర వస్తువుల కొరత అసలు రాకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఖరీఫ్ కోసం ఎరువుల నిలువలు పెంచాలని స్పష్టం చేశారు ప్రధాని నరేంద్ర మోడీ. విద్యుత్ కొరత రాకుండా బొగ్గు సరఫరా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఫార్మా, కెమికల్ రంగాలకు కావాల్సిన ముడి పదార్థాల కోసం ఇతర దేశాల నుంచి ప్రత్యామ్నాయలను వెతకాలని ఆదేశాలు జారీ చేశారు.

## కేంద్రమంత్రులతో మోడీ కీలక భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో భారత్‌లో ఇంధన సంక్షోభం ఆందోళన కలిగిస్తున్నది. ఈ తరుణంలో ప్రధాని మోడీ.. పలువురు కేంద్ర మంత్రులతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై వారితో చర్చించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్‌సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై మంత్రులతో ప్రధాని మోడీ చర్చించారు. గ్యాస్, పెట్రోల్ ,ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్న ప్రధాని.. సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా సిటీ గ్యాస్ ప్రాజెక్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూనే, కీలక రంగాలకు వాణిజ్య ఎల్పీజీ కేటాయింపులను పెంచింది.


# తిరుగులేని శక్తిగా భారత్... అమెరికా మ్యాగజైన్ వెల్లడి

గత కొన్నేళ్లుగా భారత ఆర్థికవ్యవస్థ అత్యంత వేగవంతమైన వృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా మనదేశ ఆర్థిక వృద్ధిని ప్రపంచమంతా ఆసక్తిగా చూస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన మ్యాగజైన్ 'వాషింగ్టన్ ఎగ్జామినర్' భారత్‌కు సంపన్న దేశంగా ఎదిగే సామర్థ్యం అత్యధికంగా ఉందని అభిప్రాయపడింది. భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే 2047 నాటికి ఇది సాధ్యమని మ్యాగజైన్ తన నివేదికలో పేర్కొంది. ముఖ్యంగా ప్రపంచదేశాలు భారత్‌ను ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా చూస్తున్నాయని వెల్లడించింది. వాషింగ్టన్ ఎగ్జామినర్ నివేదిక కీలక అంశాలను ప్రస్తావించింది. ప్రధానంగా గడిచిన రెండు దశాబ్దాలను పరిగణలోకి తీసుకుని, 2003 నుంచి దేశ ఆర్థికవ్యవస్థ సగటు వార్షిక వృద్ధి రేటు 7 శాతానికి పైగా ఉందని పేర్కొంది. రాబోయే మరో 20 ఏళ్ల వరకు ఇదే వృద్ధి వేగాన్ని కొనసాగిస్తే దేశ తలసరి జీడీపీ 15,000 డాలర్లను దాటుతుంది. తద్వారా భారత్ అధిక–ఆదాయ పరిమితిని దాటేస్తుంది. దీనివల్ల భారత్ మిడిల్–ఇన్‌కమ్ ట్రాప్ నుంచి బయటపడుతుంది. ఈ స్థాయి వృద్ధితో మధ్య–ఆదాయ ట్రాప్‌లో చిక్కుకున్న బ్రెజిల్, దక్షిణాఫ్రికా, తుర్కియే వంటి ఆర్థిక వ్యవస్థలను భారత్ అధిగమించే అవకాశాలు ఉన్నాయి. భారతదేశ వృద్ధి అవకాశాలకు అనుకూలంగా అధిక జనాభా, పెరుగుతున్న సాంకేతికత వినియోగం, పాలసీలు వంటివి మద్దతునిస్తున్నాయని వాషింగ్టన్ ఎగ్జామినర్ తెలిపింది. ముఖ్యంగా యువత భారత్‌కు ఉన్న అతిపెద్ద బలం. అమెరికా, చైనాల కంటే భారత్‌లో ఎక్కువ యువత ఉంది. వచ్చే దశాబ్దాల్లో గణనీయమైన సంఖ్యలో యువత శ్రామిక శక్తిలో ప్రవేశించనుంది. దీనివల్ల




ఉత్పాదకత పెరుగుతుంది. ఈ ధోరణి పటిష్టమైన దేశీయ మార్కెట్‌ను ఇస్తుంది. వృద్ధి కోసం ఎగుమతులపై ఆధారపడే పరిస్థితి ఉండదు. ఈ ప్రయోజనాలను పూర్తిగా ఉపయోగించుకోవడానికి, ప్రస్తుతం దేశంలో రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, లాజిస్టిక్స్ కారిడార్ల వంటి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఫలితంగా దేశంలో మరింత సమర్థవంతమైన రవాణా వ్యవస్థ సరఫరాను బలోపేతం చేస్తుందని నివేదిక వివరించింది.

# అమెరికాకు నిలిచిన మసాలా ఎగుమతులు




అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధోన్మాదం భారత ఎగుమతులను తీవ్ర ప్రభావితం చేస్తోంది. భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు స్తంబించాయి. భారత్ నుండి ఏటా సుమారు 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 4700 కోట్లు) విలువైన మసాలా దినుసులు అమెరికాకు ఎగుమతి అవుతుండగా.. ప్రస్తుత అనిశ్చితి వల్ల అక్కడి కొనుగోలుదారులు కొత్త ఆర్డర్లు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. సాధారణంగా ప్రతి ఏటా నవంబర్ నెలలో ఎగుమతిదారులు, కొనుగోలుదా రులు ప్రాథమిక ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం షిప్పింగ్ మార్గాల్లో అంతరాయం, పెరిగిన బీమా ప్రీమియంలు, యుద్ధ రిస్క్ సర్‌ఛార్జీల కారణంగా కొనుగోలుదారుల నుండి ఎటువంటి స్పందన రావడం లేదని ఎగుమతిదారులు వాపోతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మసాలా దిగుమతుల సాగు విస్తీర్ణం 5.09 మిలియన్ హెక్టార్లకు లేదా 1.4 శాతం పెరిగి ఉత్పత్తి 12.99 మిలియన్ టన్నులకు చేరుకున్నప్పటికీ, ఎగుమతులు నిలిచిపోవడంతో దేశీయంగా మిగులు నిల్వలు పెరిగి ధరలు పడిపోయే ప్రమాదం ఉందని ఈ రంగం నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మిరియాలు, యాలకులు, మిరపకాయలు, ధనియాలు, కరివేపాకు పొడి వంటి ఉత్పత్తుల ఎగుమతులపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో రవాణా ఖర్చులు భారీగా పెరగడం మరియు కంటైనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. "యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి అమెరికా కొనుగోలుదారుల నుండి ఎటువంటి ఆర్డర్లు లేవు. ఇది ఎగుమతిదారులలో ఆందోళన కలిగిస్తోంది. అనిశ్చితి, రవాణా ఇబ్బందుల వల్ల రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి" అని ఓ ఎగుమతిదారు తెలిపారు.

# ప్రపంచ వ్యాప్త ద్రవ్యోల్బణ సెగలే..!

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఎగిసే అవకాశం ఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ తన నివేదికలో వెల్లడించింది. యుద్ధం ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తే మరింత ద్రవ్యోల్బణ అలజడకి కారణం కావచ్చని హెచ్చరించింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ప్రపంచ ఇంధన రంగం, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపవచ్చని నివేదిక పేర్కొంది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు భారత్‌పై పెద్ద ప్రభావం చూపకపోవచ్చని తప్పుడు తడకగా రిపోర్ట్ ఉండటం గమనార్హం. బ్యారెల్ చమురు ధర 110 డాలర్లు దాటడంతో భారత ఇంధనం, రవాణపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. గ్యాస్ కొరతతో అనేక కంపెనీలు మూతపడుతున్నాయి. మరోవైపు యుద్ధం ప్రభావంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ కనిష్టం 94 చేరువలో నమోదయ్యింది. ఎగుమతులు పడిపోతున్నాయి. అయినప్పటికీ యుద్ధ ప్రభావం అంతంతే అంటూ ఎస్‌బిఐ నివేదిక పేర్కొనడం సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగితే ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల్లో అస్థిరత ఏర్పడవచ్చని రిపోర్ట్ పేర్కొంది. ఒకవేళ ఈ సంఘర్షణ దీర్ఘకాలం కొనసాగితే.. ముడి చమురు ధర ప్రతీ 10 డాలర్లు పెరిగినప్పుడు.. భారత కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) 36 బేసిస్ పాయింట్లు, ద్రవ్యోల్బణం 35–40 బేసిస్ పాయింట్లు పెరిగే ప్రమాదం ఉందని నివేదిక అంచనా వేసింది.




# ఓఎఫ్ఎస్ మార్గంలో ఐడీబీఐ బ్యాంక్ వాటా విక్రయం!




ఎల్ఐసీ నియంత్రణలోని ఐడీబీఐ బ్యాంక్‌లో కొంత వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో విక్రయించడం ద్వారా పబ్లిక్ షేర్ హోల్డింగ్ పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్‌లో పబ్లిక్ వాటా 5.29 శాతం మాత్రమే ఉంది. మిగతా షేర్లలో ఎల్ఐసీ వద్ద 49.24 శాతం, ప్రభుత్వం వద్ద 45.48 శాతం వాటాలున్నాయి. ఈ నెల ప్రారంభంలో ప్రభుత్వం, ఎల్ఐసీ కలిసి తమ వద్ద ఉన్న వాటాల్లో 60.72 శాతాన్ని విక్రయించేందుకు ఆర్థిక బిడ్లను ఆహ్వానించాయి. అయితే ఇద్దరు కొనుగోలుదార్ల నుంచి వచ్చిన బిడ్లు రిజర్వ్ ధర కంటే తక్కువగా ఉండటంతో విక్రయ ప్రతిపాదనను రద్దు చేశాయి. ఫ్రీ–ఫ్లోట్ మార్కెట్ తక్కువగా ఉండటంతో బ్యాంక్ సరైన మార్కెట్ విలువ బయటకు రావడం లేదని, ప్రస్తుతం ఉన్న 5.29 శాతం పబ్లిక్ వాటాను 10 లేదా 15 శాతానికి పెంచడం ద్వారా కచ్చితమైన షేరు విలువను వెలికి తీయొచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రద్దు చేసిన విక్రయ ప్రతిపాదన ప్రకారం.. ప్రభుత్వం, ఎల్ఐసీ తమ వద్ద ఉన్న 30.48 శాతం, 30.24 శాతం వాటాలను తగ్గించుకోవాలని భావించాయి. దీంతో ఓఎఫ్ఎస్ అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## 1,481 పాయింట్లు పతనమైన సెన్సెక్స్




భారతీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల లోని ప్రతికూల పవనాలకు తోడు దేశీయంగా నెలకొన్న ఆందోళనలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో సోమవారం ఉదయం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1,481.95 పాయింట్లు పతనమై 73,051.01 వద్ద ట్రేడవుతుండగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 415.95 పాయింట్లు కోల్పోయి 22,698.55 వద్ద కొనసాగుతోంది. ఈ ఆకస్మిక పతనంతో ఇన్వెస్టర్ల సంపద లక్షల కోట్లలో ఆవిరైపోయింది. మార్కెట్ పతనానికి మధ్యప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధ మేఘాలే ప్రధాన కారణంగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ లబ ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్ర రూపం దాల్చడంతో గ్లోబల్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. ఇరాన్ తన ఇంధన వనరులపై దాడులు జరిగితే ప్రతిఘటిస్తామని హెచ్చరించడం, మరోవైపు అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉండటంతో ముడిచమురు ధరలు మళ్ళీ బ్యారెల్‌కు వి112 దాటాయి. ఇది భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాల్లో ద్రవ్యోల్బణ భయాలను పెంచింది. మరోవైపు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఈఎఎబ) భారత మార్కెట్ల నుంచి భారీగా నిధులను ఉపసంహరించుకోవడం మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది. గ్లోబల్ రిస్క్ పెరగడంతో ఇన్వెస్టర్లు సురక్షితమైన బాండ్లు, బంగారం వైపు మళ్లుతున్నారు. దీనికి తోడు రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 93.83 వద్ద ఆల్‌టైమ్ కనిష్టానికి పడిపోవడం కూడా మార్కెట్ కుప్పకూలడానికి ఒక ముఖ్య కారణమైంది. బ్యాంకింగ్ మరియు ఐటీ రంగానికి చెందిన దిగ్గజ షేర్లు భారీగా నష్టపోవడంతో సూచీలు కోలుకోలేక పోయాయని నిపుణులు తెలుపుతున్నారు.

## ఎయిర్‌లైన్స్‌కు లిక్విడిటీ మద్దతు ఇచ్చే అవకాశం



పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, పెరుగుతున్న ఇంధన ధరల వల్ల కార్యకలాపాల అంతరాయాలు విమానయాన రంగాన్ని ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విమానయాన సంస్థలకు లిక్విడిటీ మద్దతు ఇవ్వాలని భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం పన్ను ఉపశమన అవకాశాలను కూడా పరిశీలిస్తోందని, ఈ సమస్యపై చర్చించడానికి రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతుందని వెల్లడించారు. ఫిబ్రవరి 28న ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి విమానయాన సంస్థలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా, పాకిస్తాన్ గగనతలాలు మూసివేత కారణంగా ఫ్లైట్ రూట్లు పెరిగాయి. దీనివల్ల నిర్వహణ ఖర్చులూ పెరిగాయి. ప్రధానంగా ఇంధన ఖర్చులు ఎక్కువ ఆందోళన కలిగిస్తున్నాయి. విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులలో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ వాటా దాదాపు 40 శాతం ఉంటుంది. దీంతో ఇటీవలి వీటి పెరుగుదల లాభాల మార్జిన్‌లను గణనీయంగా ప్రభావితం చేశాయి. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ జెట్ ఫ్యూయల్ మానిటర్ ప్రకారం, 2026, మార్చి నాటికి ఈ ప్రాంతంలో జెట్ ఫ్యూయల్ ధరలు 85 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి.

## ఒక్క మార్చిలోనే రూ. 93 వేల కోట్ల ఎఫ్‌పీఐలు వెనక్కి



భారత కరెన్సీ రూపాయి క్రమం తప్పకుండా రికార్డు స్థాయి కనిష్టాలకు బలహీనపడు తుండటం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు భారీగా నిధులు వెనక్కి తీసుకెళ్తున్నారు.వీటితో పాటు పెరుగుతున్న ముడిచమురు ధరలు దేశ మౌలిక సదుపాయాలకు ముప్పుగా పరిణమించాయి. దీని ఫలితంగా స్టాక్ మార్కెట్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) షేర్ల అమ్మకాలు ఈ నెలలో రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. ఎన్ఎస్‌డీఎల్, బీఎస్ఈ సంయుక్త డేటా ప్రకారం, ఈ నెలలో ఇప్పటివరకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు కేవలం స్టాక్ మార్కెట్ల నుంచే రూ. 93,698 కోట్లను ఉపసంహరించుకున్నారు. ఎన్ఎస్‌డీఎల్ ప్రకారం, ఇది 2024, అక్టోబర్‌లో నమోదైన రూ. 94,017 కోట్లకు అత్యంత చేరువగా ఉంది. దీంతో 2026లో మొత్తం ఎఫ్‌పీఐ నిధుల ఉపసంహరణ దాదాపు రూ. 1.10 లక్ష కోట్ల మార్కును అధిగమించింది. ఫిబ్రవరిలో 17 నెలల గరిష్ట స్థాయి అయిన రూ. 22,615 కోట్ల భారీ నిధుల ప్రవాహం నమోదైన తర్వాత, పెట్టుబడిదారుల సెంటిమెంట్‌లో వచ్చిన తీవ్రమైన మార్పును ఇది స్పష్టంగా తెలియజేస్తోందని మార్కెట్ విశేషకులు పేర్కొన్నారు.

## వేసవిలో కొబ్బరి నీళ్లు తాగడం మంచిదేనా?



వేసవికాలంలో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందడానికి చాలా మంది కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి చల్లని పానియాలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతారు. ఇందులో కొబ్బరి నీళ్లు సహజంగా స్వచ్ఛమైనది. పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, సోడియం అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడతాయి. వేసవికాలంలో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందడానికి చాలా మంది కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి చల్లని పానియాలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతారు. ఇందులో కొబ్బరి నీళ్లు సహజంగా స్వచ్ఛమైనది. పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, సోడియం అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడతాయి. ఇందులోని పోషకాలు అధిక చెమట, అలసట, నీరసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. వేసవికాలంలో శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం చాలా ఉపయోగపడతాయి. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీర అవసరాలు తీర్చడంతోపాటు జీర్ణక్రియ సరిగ్గా జరిగేలా చేస్తుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. మెదడు పనితీరు కూడా మెరుగుపడుతుంది. కనుక వేసవిలో ద్రవాలతో పాటు ద్రవాలు ఉన్న ఆహారాలను తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. కొబ్బరినీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ తగ్గడంతో పాటు శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్ తిరిగి అందుతాయి. ఇది సహజమైనది, ఇందులో క్యాలరీలు కూడా తక్కువగా ఉంటాయి. వేసవికాలంలో ఎండలో ఎక్కువగా తిరిగిన తరువాత కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి అందుతుంది. చెమట కారణంగా శరీరం ముఖ్యమైన ఖనిజాలను కోల్పోతుంది. కొబ్బరి నీటిని తాగడం వల్ల పొటాషియం, సోడియం, మెగ్నీషియం, క్యాల్షియం వంటి ఎలక్ట్రోలైట్స్ తిరిగి శరీరానికి అందుతాయి. శరీరంలో ద్రవసమతుల్యం పునరుద్ధరిస్తుంది. అలాగే కండరాల నొప్పులు తగ్గుతాయి. కొబ్బరి నీటిని తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయి. అలసట, చర్మంపై రాషెస్, తలనొప్పి వంటి ఎండ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. శరీర సంరక్షణ ఉత్పత్తులకు బదులు కొబ్బరి నీటిని తాగడం మంచిది.

## ప్రెగ్నెన్సీ ప్లాన్ చేస్తున్నారా..

## ఈ విషయాలు పక్కా తెలుసుకోండి



పిల్లల కిలకిలారావాలతో ఇల్లు కళకళలాడాలని ప్రతి దంపతులు కోరుకుంటారు. కానీ నేటి ఉరుకుల పరుగుల జీవితం, మారిపోయిన ఆహారపు అలవాట్లు ఆ కలను దూరం చేస్తున్నాయి. సంతానలేమి సమస్యలకు కేవలం వైద్యమే కాదు.. మనం రోజువారీ తీసుకునే ఆహారం కూడా ఒక ప్రధాన కారణమని మీకు తెలుసా? మనం తీసుకునే పోషకాలు అండం విడుదల, ఋతుస్రావం, వీర్యకణాల ఉత్పత్తిని నియంత్రించే హార్మోన్లపై నేరుగా ప్రభావం చూపుతాయి. పురుషులలో జింక్, సెలీనియం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీఆక్సిడెంట్లు వీర్యకణాల కదలికను, నాణ్యతను మెరుగుపరుస్తాయి. అయితే అధిక చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు శరీరంలో ఇన్సులిన్ నిరోధకతను పెంచి, హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతాయి. ఇది సంతానలేమి సమస్యలకు దారితీస్తుంది. మీరు గర్భధారణ కోసం ప్లాన్ చేసుకుంటున్నా లేదా ఎంఈ వంటి చికిత్సలు తీసుకుంటున్నా కొన్ని ఆహారాలను డైట్‌లో చేర్చుకోవడం మంచిది. బ్రౌన్ రైస్, ఓట్స్, చిరుధాన్యాలు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. బాదం, వాల్‌నట్స్, విత్తనాలు మరియు అవకాడోలు హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడతాయి. అంతేకాకుండా పప్పుధాన్యాలు, గుడ్లు, చేపలు, పాల ఉత్పత్తులు శరీర కణజాలాలను బలోపేతం చేస్తాయి. విటమిన్-సి పుష్కలంగా ఉండే ఆకుకూరలు, నిమ్మజాతి పండ్లు యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. పెరుగు, పులియబెట్టిన ఆహారాలు జీర్ణాశయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వీటికి దూరంగా ఉండండి: గర్భధారణకు ప్రయత్నిస్తున్న దంపతులు కొన్ని అలవాట్లకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. అతిగా కాఫీ తాగడం, మద్యం సేవించడం వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. ధూమపానం నేరుగా అండం, శుక్రకణాల నాణ్యతను దెబ్బతీస్తుంది. బేకరీ ఐటమ్స్, వేపుళ్లు హార్మోన్ల వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తాయి. ఇతర సంతానోత్పత్తి చికిత్సలు పొందుతున్న వారు ఫోలిక్ యాసిడ్, ఐరన్, కాల్షియం, విటమిన్-డి సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ఇవి గర్భధారణ ప్రారంభ దశలో పిండం ఎదుగుదలకు ఎంతో అవసరం. సరైన ఆహార నియమాలతో పాటు వైద్యుల సూచనలు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన గర్భధారణ సాధ్యమవుతుంది.

## పాతికేళ్లకే బట్టతల వస్తోందా?

భారతీయ యువతలో బట్టతల సమస్య వేగంగా పెరగడానికి కేవలం వయస్సు మాత్రమే కారణం కాదు. మన మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, జుట్టు ఆరోగ్యానికి మన జీర్ణక్రియకు బలమైన సంబంధం ఉంది. ఒకప్పుడు అరవై ఏళ్లు దాటిన వారిలో మాత్రమే కనిపించే బట్టతల సమస్య, ఇప్పుడు ఇరవై ఏళ్ల యువకులను కూడా భయపెడుతోంది. పెళ్లి కాకముందే జుట్టు రాలిపోయి, వయసుపైబడిన వారిలా కనిపిస్తుండటంతో చాలా మంది యువకులు మానసిక వేదనకు గురవుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో నివసించే వారిలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటోంది. మనం ఎంత ఖరీదైన షాంపూలు వాడినా, లోపలి నుండి పోషకాలు అందకపోతే జుట్టు రాలడం ఆగదు. శరీరంలో జీర్ణక్రియ సరిగ్గా జరగకపోతే, మనం తినే ఆహారంలోని పోషకాలు రక్తంలోకి చేరవు. దీనివల్ల

జుట్టు వేర్లు బలహీనపడి, వెంట్రుకలు రాలిపోవడం మొదలవుతుంది. జుట్టు పెరుగుదలకు కావలసిన బయోటిన్, ఐరన్, ప్రోటీన్లు అందకపోవడమే దీనికి ప్రధాన కారణం. పట్టణాల్లో పని ఒత్తిడి కారణంగా యువకులు కనీసం ఏడు గంటలు కూడా నిద్రపోవడం లేదు. నిద్రలేమి వల్ల శరీరంలో 'కార్టిసాల్' అనే ఒత్తిడి హార్మోన్ పెరుగుతుంది. ఇది హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీసి జుట్టు పెరుగుదలను నిలిపివేస్తుంది. ఆందోళన ఎక్కువగా ఉన్నప్పుడు జుట్టు కుదుళ్లు విశ్రాంతి దశలోకి వెళ్లిపోయి, రాలిపోవడం వేగవంతం అవుతుంది. దీనికి తోడు జంక్ ఫుడ్, వ్యాయామం లేకపోవడం సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. కుటుంబంలో తండ్రికి లేదా తాతకు బట్టతల ఉంటే, అది తరువాతి తరాలకు వచ్చే అవకాశం 80 శాతం వరకు ఉంటుంది. దీనిని 'ఆండ్రోజెనెటిక్ అలోపేసియా' అంటారు. ఇది ప్రధానంగా శరీరంలోని హార్మోన్ల ప్రభావం వల్ల జరుగుతుంది. అయితే, సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీనిని కొంత కాలం పాటు వాయిదా వేయవచ్చు. ఆహారం : ప్రోటీన్, ఐరన్, విటమిన్లు ఎక్కువగా ఉండే పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలి. వ్యాయామం : రోజూ వ్యాయామం చేయడం వల్ల తలలో రక్తప్రసరణ మెరుగుపడి జుట్టు వేర్లకు పోషకాలు అందుతాయి. ఒత్తిడి నిర్వహణ : యోగా, ధ్యానం చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఇది హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుంది. సరైన నిద్ర : రోజుకు కనీసం 7-8 గంటల గాఢ నిద్ర జుట్టు ఆరోగ్యానికి చాలా అవసరం. జుట్టు రాలడం అనేది కేవలం సౌందర్యానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, అది మీ అంతర్గత ఆరోగ్యానికి ఒక సంకేతం. ఇప్పటికైనా మీ జీవనశైలిని మార్చుకుని, ఒత్తిడిని తగ్గించుకుంటే బట్టతల ముప్పు నుండి తప్పించుకోవచ్చు.

# మంగళవారం పుట్టినవారి భవిష్యత్తు ఇలా ఉంటుంది!



మంగళవారం పుట్టిన స్త్రీ పురుషులు పట్టుదల, ఆధిపత్య స్వభావం కలిగి ఉంటారు. కుజుడి ప్రభావం వల్ల కోపం ఎక్కువైనా, వీరు కష్టపడి విజయం సాధిస్తారు. సాంకేతిక, రియల్ ఎస్టేట్ రంగాల్లో రాణిస్తారు. అదృష్ట సంఖ్య తొమ్మిది, ఎరుపు రంగు వీరికి శుభప్రదం. సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన శ్రేయస్కరం. వారంలోని ప్రతి రోజుకు ఒక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. ఆయా రోజుల్లో పుట్టిన వ్యక్తులకు కూడా ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటారు. ఇప్పుడు మంగళవారం పుట్టినవారి భవిష్యత్తు గురించి తెలుసుకుందాం. మంగళవారం పుట్టిన స్త్రీ పురుషుల లక్షణాలు, వారి భవిష్యత్తు, ఏ రంగాల్లో రాణిస్తారు, అలాగే జీవితంలో సక్సెస్ సాధించడానికి ఎలాంటి ప్రత్యేక విధివిధానాలు పాటించాలో ఈ వ్యాసంలో వివరంగా తెలుసుకుందాం. మంగళవారానికి అధిపతి కుజుడు. కుజుడు అంటే కోపానికి సంబంధించిన గ్రహం. కాబట్టి మంగళవారం పుట్టిన స్త్రీలకు గాని పురుషులకు గాని సహజంగా కోపం ఎక్కువగా ఉంటుంది. తమ మాట నెగ్గాలనే తత్వం, ఇతరులపై అధికారం చలాయించాలనే లక్షణం వీరిలో కనిపిస్తుంది. అయితే, వీరు ఇతరులకు సలహాలు, సూచనలు ఇవ్వగలిగే శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటారు. అనేక మందికి మార్గదర్శకంగా నిలబడగలరు. అందరికీ సలహాలు ఇస్తారు, సూచనలు అందిస్తారు. కానీ, తమ అభిప్రాయాలను ఇతరులు గౌరవించాలని, తమ మాట నెగ్గాలని బలంగా కోరుకుంటారు.

విజయం సాధించేవరకూ..మంగళవారం జన్మించిన వారిలో పట్టుదల అపారం. వీరు కష్టపడి పనిచేసే తత్వాన్ని కలిగి ఉంటారు. తొందరగా పరాజయాన్ని, అపజయాన్ని అంగీకరించరు. ఎంత కష్టమైనా సరే, అపజయాలను ఎదుర్కొని, చివరికి విజయం సాధించడానికి నిరంతరం ప్రయత్నిస్తారు. విజయం సాధించే వరకు విశ్రమించరు. వీరి జీవితంలో పెద్ద పెద్ద అపాయాలు ఎదురైనప్పుడు కూడా వాటిని వెంట్రుక వాసిలో తప్పించుకునే ప్రత్యేకమైన సామర్థ్యం వీరి సొంతం.

ఈ విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే..అయితే, మంగళవారం పుట్టిన వారు కొన్ని విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. నమ్మిన వారి కోసం సర్వస్వాన్ని త్యాగం చేసే లక్షణం వీరిలో ఉంటుంది. అందుకే ప్రేమలో పడితే సర్వస్వాన్ని ధారపోసే తత్వం వీరిలో అధికం. ఈ విషయంలో మెచ్యూర్డ్‌గా ఆలోచించి, జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. అలాగే, పైకి ఒకలాగా, లోపల ఒకలాగా ప్రవర్తించే వ్యక్తుల విషయంలో వీరు అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వ్యక్తుల వల్ల జీవితంలో కొన్ని ఎదురు దెబ్బలు తగిలే అవకాశం ఉంది. అలాంటి వారితో దూరం పాటించడం శ్రేయస్కరం.

ఒకసారి అనుకుంటే చాలు.. మంగళవారం పుట్టిన ఆడవారు లేదా మగవారు ఒకసారి ఏదైనా అనుకుంటే దానిని చేసి తీరుతారు. వారి ఆలోచనలు, భావాలను ఎవరూ మార్చలేరు. తమ మార్గంలోనే ముందుకు వెళ్లే ప్రత్యేకమైన లక్షణం వీరిలో ఉంది.

ఏయే రంగాలు కలిసి వస్తాయంటే..వృత్తిపరంగా చూస్తే, మంగళవారం పుట్టిన వారికి సాంకేతిక రంగం బాగా కలిసి వస్తుంది. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ రంగాలు వీరికి అనుకూలం. వ్యాపారాలు చేయాలనుకుంటే, రియల్ ఎస్టేట్ వ్యాపారం లేదా కన్స్ట్రక్షన్ రంగం వీరికి చాలా మంచిది. డెంటల్ డాక్టర్లుగా కూడా మంగళవారం పుట్టిన వారు రాణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఫైర్ రిలేటెడ్, అంటే అగ్నికి సంబంధించిన రంగాల్లో కూడా వీరు అద్భుతంగా విజయం సాధిస్తారు. ప్రధానంగా, రియల్ ఎస్టేట్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ రంగాల్లో ప్రవేశిస్తే అద్భుతమైన విజయాలను సాధించవచ్చు.

వీరి అదృష్ట సంఖ్య, కలిసొచ్చే రంగులు.. వీరికి అదృష్ట సంఖ్య తొమ్మిది. ఏ పని చేసినా తొమ్మిది, పద్దెనిమిది, ఇరవై ఏడు తేదీల్లో ముఖ్యమైన పనులన్నీ చేసుకోవాలి. కలిసి వచ్చే రంగు ఎరుపు. ఎరుపు రంగు వస్త్రాలు ధరించడం లేదా ఎరుపు రంగు కర్చీఫ్‌ను ఎప్పుడూ దగ్గర పెట్టుకోవడం వల్ల విజయాలు త్వరగా వస్తాయని నమ్మకం. మంగళవారం పుట్టిన వారు నవగ్రహాల్లో కుజుడిని ఎక్కువగా పూజించాలి. ప్రతిరోజూ వీలైనన్ని సార్లు "ఓం శ్రీ కుజాయ నమః" అనే మంత్రాన్ని జపించుకోవాలి. వీరికి కలిసి వచ్చే దైవాలు సుబ్రహ్మణ్య స్వామి, లక్ష్మీ నరసింహ స్వామి. జీవితంలో త్వరగా విజయం సాధించాలంటే ఈ దైవాలను పూజించడం ద్వారా త్వరగా సక్సెస్ సాధిస్తారు.

# కూలింగ్ వాటర్ తాగితే బరువు పెరుగుతారా?

నీరు ఏ ఉష్ణోగ్రతలో ఉన్నా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. చల్లని నీరు తాగడం వల్ల బరువు పెరుగుతారనే వాదనకు ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. నిజానికి, చల్లని నీరు తాగడం వల్ల శరీరంలో స్వల్పంగా క్యాలరీలు కరుగుతాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. ఎందుకంటే, ఆ చల్లని నీటిని శరీర సాధారణ ఉష్ణోగ్రతకు (37ళీఅ) తీసుకురావడానికి మన శరీరం కొంత శక్తిని వెచ్చిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు చేసే ప్రయత్నాల్లో నీటి ఉష్ణోగ్రత కూడా ఒక చర్చనీయాంశంగా మారింది. చల్లని నీరు తాగితే శరీరంలో కొవ్వు పెరుగుతుందని, జీర్ణక్రియ మందగిస్తుందని సోషల్ మీడియాలో రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఫిట్‌నెస్ కోచ్ ప్రియాంక్ మెహతా వంటి ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ అంశంపై చర్చను మళ్ళీ తెరపైకి తెచ్చారు. అయితే, నిజంగా చల్లని నీరు తాగడం వల్ల బరువు పెరుగుతారా? లేక తగ్గుతారా? సైన్స్ ఏం చెబుతోంది? థర్మోజెనిక్ ప్రభావం- 2021లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, చల్లని నీరు తాగడం వల్ల విశ్రాంతి సమయంలో ఖర్చయ్యే శక్తి తాత్కాలికంగా 25 శాతం వరకు పెరుగుతుంది. పిల్లలపై చేసిన ఈ అధ్యయనంలో, తగినంత నీరు తాగడం వల్ల ఏడాదికి సుమారు 1.2 కిలోల బరువు తగ్గే అవకాశం ఉందని తేలింది. క్రీడాకారులకు మేలు- వ్యాయామం చేసే సమయంలో చల్లని నీరు తాగడం వల్ల శరీరం అతిగా వేడెక్కకుండా ఉంటుంది. 2012 అధ్యయనం ప్రకారం, చల్లని



పానీయాలు క్రీడాకారుల పనితీరును మెరుగుపరుస్తాయి. చల్లని నీరు నేరుగా బరువు పెంచకపోయినా, కొన్ని సందర్భాల్లో ఇది ఇబ్బంది కలిగించవచ్చు. జలుబు, దగ్గు: జలుబు ఉన్నప్పుడు చల్లని నీరు తాగితే నాసికా మార్గంలోని శ్లేష్మం చిక్కబడి శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. మైగ్రేన్: ఇప్పటికే మైగ్రేన్ సమస్య ఉన్నవారిలో చల్లని నీరు నొప్పిని ప్రేరేపించే అవకాశం ఉంది. జీర్ణక్రియ: కొందరిలో భోజనం తర్వాత చల్లని నీరు తాగడం వల్ల కండరాలు బిగుసుకుపోయి జీర్ణక్రియ కొంచెం మందగించవచ్చు, కానీ ఇది అందరిలో జరగదు. వేడి నీరు తాగడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది మరియు శరీరంలోని విషతుల్యాలు బయటకు వెళ్తాయి. అయితే, హైడ్రేషన్ విషయానికి వస్తే నీటి ఉష్ణోగ్రత పెద్దగా తేడా చూపదు. 16ళీఅ ఉష్ణోగ్రత వద్ద ఉన్న నీటిని తాగడం వల్ల ప్రజలు ఎక్కువ నీరు తాగడానికి ఆసక్తి చూపుతారని, తద్వారా హైడ్రేషన్ మెరుగుపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. బరువు తగ్గడానికి చల్లని నీరు లేదా వేడి నీరు అనేది ప్రధాన అంశం కాదు. చక్కెర పానీయాలకు బదులుగా నీటిని ఎంచుకోవడం, రోజూ పురుషులు కనీసం 3.7 లీటర్లు, మహిళలు 2.7 లీటర్ల నీరు తాగడం ముఖ్యం. చల్లని నీరు తాగడం వల్ల కొన్ని క్యాలరీలు అదనంగా ఖర్చయినా, అది భారీగా బరువు తగ్గడానికి ఏమాత్రం సరిపోదు.

# ఇండక్షన్ స్టౌవ్ వాడుతున్నారా?




ఇండక్షన్ కుక్‌టాప్‌లు వేడిని వెదజల్లడానికి సహాయపడే వెంటిలేషన్ వెంట్‌లను దిగువన లేదా వెనుక భాగంలో కలిగి ఉంటాయి. ఈ వెంట్‌లను కప్పి ఉంచడం వల్ల కుక్‌టాప్ వేడెక్కుతుంది. వేడెక్కడం వల్ల కుక్‌టాప్ పనితీరు దెబ్బతింటుంది. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో ఒఖఉ సిలిండర్ల కొరత మధ్య ఇండక్షన్ కుక్‌టాప్‌లు ఇప్పుడు చాలా ఇళ్లలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. దీని వేగవంతమైన వేడి, సురక్షితమైన వంట కారణంగా ఇది గ్యాస్ స్టవ్‌లకు మంచి ప్రత్యామ్నాయంగా పరిగణిస్తారు. అయితే ఇండక్షన్ కుక్‌టాప్‌ను ఉపయోగిస్తున్నప్పుడు కొన్ని చిన్న తప్పులు పెద్ద నష్టాన్ని కలిగిస్తాయి. తప్పుడు పాత్రలు, పేలవమైన వెంటిలేషన్ లేదా ఉపరితల నష్టం వంటి సమస్యలు కుక్‌టాప్ జీవితాన్ని తగ్గిస్తాయి. కొన్నిసార్లు విద్యుత్ ప్రమాదాలకు కూడా కారణమవుతాయి. తప్పుడు పాత్రలను ఉపయోగించడం: ఇండక్షన్ కుక్‌టాప్‌లలో అత్యంత సాధారణ తప్పు ఏమిటంటే తప్పుడు పాత్రలను ఉపయోగించడం. ఇండక్షన్ టెక్నాలజీ విద్యుదయస్కాంత క్షేత్రంతో పనిచేస్తుంది. అందుకే అయస్కాంత స్థావరాలు కలిగిన పాత్రలు మాత్రమే వేడి చేస్తాయి. అల్యూమినియం, రాగి, గాజు లేదా సాధారణ సిరామిక్ పాత్రలు సాధారణంగా పనిచేయవు. ఒక అయస్కాంతం పాత్ర దిగువన అంటుకోకపోతే అది ఇండక్షన్ సమయంలో సరిగ్గా వేడెక్కదు. దీని అర్థం ఇండక్షన్ కుక్‌టాప్ కొనుగోలు చేసిన తర్వాత, మీరు మొదట అనుకూలమైన పాత్రలను కొనుగోలు చేయాలి. అందువల్ల వంట చేసే ముందు పాత్రల అనుకూలతను తనిఖీ చేయడం ముఖ్యం. ఉపరితలంపై లోహ వస్తువులను వదిలివేయడం: చాలా మంది ఇండక్షన్ కుక్‌టాప్ ఉపరితలంపై స్పూన్లు, ఫోర్కులు లేదా మూతలు వంటి లోహ వస్తువులను వదిలివేస్తారు. ఇండక్షన్ అయస్కాంత క్షేత్రం ఈ వస్తువులను వేడి చేయగలదు. అందుకే ఇది ప్రమాదకరం. ఒక లోహ వస్తువు వేడెక్కుతూనే ఉంటే, అది కాలిన గాయాలు లేదా హాని కలిగించవచ్చు. అందువల్ల, కుక్‌టాప్ ఉపరితలాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా, ఖాళీగా ఉంచడం సురక్షితమని భావిస్తారు. పాన్‌లను లాగడం: చాలా మంది తమ స్టౌవ్‌పై పెట్టిన పాన్‌ను ఎత్తడానికి బదులుగా నేరుగా గాజు ఉపరితలంపైకి లాగుతారు. ఈ సాధారణ అలవాటు కాలక్రమేణా ఇండక్షన్ కుక్‌టాప్ గాజు పైభాగాన్ని దెబ్బతీస్తుంది. పదేపదే లాగడం వల్ల ఉపరితలం గీతలు పడవచ్చు. అలాగే గాజు బలహీనపడవచ్చు. అందువల్ల కుక్‌టాప్ ఉపరితలాన్ని రక్షించడానికి వంట పాత్రలను ఎత్తడం ఎల్లప్పుడూ ఉత్తమం. వెంటిలేషన్‌ను నిరోధించడం: ఇండక్షన్ కుక్‌టాప్‌లు వేడిని వెదజల్లడానికి సహాయపడే వెంటిలేషన్ వెంట్‌లను దిగువన లేదా వెనుక భాగంలో కలిగి ఉంటాయి. ఈ వెంట్‌లను కప్పి ఉంచడం వల్ల కుక్‌టాప్ వేడెక్కుతుంది. వేడెక్కడం వల్ల కుక్‌టాప్ పనితీరు దెబ్బతింటుంది. అలాగే ఎక్కువసేపు గమనించకుండా వదిలేస్తే అగ్ని ప్రమాదం కూడా పెరుగుతుంది. అందువల్ల ఉపయోగంలో ఉన్నప్పుడు కుక్‌టాప్ చుట్టూ తగినంత స్థలం ఉంచడం ముఖ్యం. పగిలిన గాజు లేదా వేడి నూనెను విస్మరించడం: ఇండక్షన్ కుక్‌టాప్ గాజు ఉపరితలం పగుళ్లు ఏర్పడితే వాడకాన్ని వెంటనే నిలిపివేయాలి. చిన్న పగుళ్లు కూడా నీరు లేదా ద్రవం లోపలికి ప్రవేశించడానికి అనుమతిస్తాయి. దీని వలన విద్యుత్ సర్క్యూట్ దెబ్బతింటుంది. అంతేకాకుండా, నూనె లేదా నెయ్యిని ఎప్పుడూ గమనించకుండా వేడి చేయవద్దు. ఎందుకంటే అవి చాలా త్వరగా ప్రమాదకరమైన ఉష్ణోగ్రతలకు చేరుకుంటాయి. వంట తర్వాత కుక్‌టాప్‌ను ఆపివేయడం, శుభ్రపరిచేటప్పుడు దాన్ని అన్‌ప్లగ్ చేయడం కూడా ముఖ్యం.

## ముస్తాఫిజుర్ వివాదం: మా తప్పు తెలుసుకున్నాం.. భారత్‌తో ఫ్రెండ్లీ రిలేషన్స్ ముఖ్యం అంటున్న బంగ్లా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో మా వాళ్లు ఆడరు.. ఐపీఎల్ ను మేము బహిష్కరిస్తున్నాం.. అంటూ బీరాలు పలికిన బంగ్లాదేశ్ పీచమణిగినట్లుంది. ముస్తాఫిజుర్ రెహమాన్ వివాదంతో భారత్ పై తీవ్ర నిందలు వేసి.. ఎట్టకేలకు గత్యంతరం లేక దిగొచ్చింది. మేము భారత్ తో ఫ్రెండ్లీ రిలేషన్స్ కోరుకుంటున్నాం అంటూ ప్రకటించింది. లేటెస్టుగా బంగ్లా స్పోర్ట్స్ మినిస్టర్ ఇండియాతో స్నేహపూర్వక సంబంధాలను కోరుకుంటున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. రానున్న రోజుల్లో ఇండియాతో సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

**ముస్తాఫిజుర్ వివాదం:**
బంగ్లాలో హిదువులపై దాడుల తర్వాత.. ఆ దేశానికి చెందిన ప్లేయర్లను ఐపీఎల్ నుంచి తొలగించాల్సిందిగా తీవ్ర ఒత్తిడి పెరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఖఖ= టీమ్ నుంచి బంగ్లా స్టార్ బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను రిలీజ్ చేసింది. వాస్తవానికి 2026 ఐపీఎల్ కోసం ముస్తాఫిజుర్ ను 9 కోట్ల రూపాయలకు కేకేఆర్ దక్కించుకుంది. కానీ దేశ ప్రజల నుంచి విమర్శలు, ఒత్తిడి కారణంగా రిలీజ్ చేయాల్సిందిగా బీసీసీఐ ఆదేశించింది. దీంతో కేకేఆర్ అతన్ని వదులుకుంది.

**ఐసీసీ షాక్:**
దీంతో బీసీసీఐ పై బంగ్లాదేశ్ తీవ్ర విమర్శలు చేసింది. ఇండియాలో ఐపీఎల్ లో మా ప్లేయర్లు ఆడరని ప్రకటించింది. అదే విధంగా టీ20 వరల్డ్ కప్ ను ఇండియా నుంచి శ్రీలంకకు తరలించాల్సిందిగా ఐసీసీని డిమాండ్ చేసింది. బంగ్లా ఒత్తిడికి తలొగ్గకుండా షెడ్యూల్ లో ఎలాంటి మార్పు చేయలేదు. అదే విధంగా టీర్నీ నుంచి బంగ్లా ఎలిమినేట్ కావాల్సి వచ్చింది. బంగ్లా ప్లేస్ లో స్కాట్లాండ్ ఆడింది.

వరుస పరిణామాలు బంగ్లాదేశ్ కు చెంపపెట్టుగా మారాయి. టీ20 టోర్నీ నుంచి నిష్క్రమణ, ఐసీసీ షాకివ్వడం తర్వాత.. క్రికెట్ విషయంలో మొదటికే మోసం వచ్చేలా ఉందని బంగ్లాకు ఇన్నాళ్లకు తెలిసొచ్చింది. క్రికెట్ నుంచి వచ్చే ఆదాయం కూడా కోల్పోతే దేశం మరింత సంక్షోభంలోకి వెళ్తుందన్న భయాందోళనలతో కాబోలు.. ఇండియాతో స్నేహం కోరుకుంటున్నామని ఆ దేశ క్రీడా శాఖ మంత్రి ప్రకటించారు.

# కరన్ ప్లేస్ లో రాయల్స్ జట్టులోకి షనక!

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక టీ20 టీమ్ కెప్టెన్ దసున్ షనక ఐపీఎల్ 19వ సీజన్ ఆరంభానికి ముందు రాజస్తాన్ రాయల్స్ జట్టులో చేరనున్నాడు. గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమైన ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ స్థానంలో షనకను రాయల్స్ తమ జట్టులోకి తీసుకోనుంది. ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో లాహోర్ ఖలందర్స్ తరఫున ఆడుతున్న షనక త్వరలోనే గువాహటిలో రాయల్స్ జట్టుతో కలవనున్నాడు. ఇప్పటికే జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ కేకేఆర్ కోసం పీఎస్ఎల్ ఒప్పందాన్ని రద్దు చేసుకోగా, ఇప్పుడు షనక కూడా అదే బాట పట్టడం ఆ లీగ్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. షనకకు సంబంధించిన పేపర్‌వర్క్ ప్రస్తుతం తుది దశలో ఉందని, అది పూర్తి కాగానే అతను ఇండియాకు చేరుకుంటాడని రాయల్స్ టీమ్ వర్గాలు తెలిపాయి.




# 60 ఏళ్లొచ్చినా ఆడతానేమో.. ధోనీ సరదా వ్యాఖ్యలతో హోరెత్తిన చెపాక్..

**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) దిగ్గజ ఆటగాడు, మిస్టర్ కూల్ ఎంఎస్ ధోనీ తన రిటైర్మెంట్‌పై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ఐపీఎల్‌లో 60 ఏళ్ల వయసు వచ్చినా ఆడుతూనే ఉంటానేమోనంటూ ఆయన చేసిన సరదా వ్యాఖ్యలు చెపాక్ స్టేడియాన్ని హోరెత్తించాయి. ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఉన్న ధోనీ, తన భవిష్యత్తు ప్రణాళికలపై జరుగుతున్న ఊహాగానాలకు ఈ వ్యాఖ్యలతో మరింత ఆసక్తిని జోడించారు. చెపాక్‌లో నిన్న జరిగిన సీఎస్‌కే ఫ్యాన్ ఈవెంట్‌లో ఈ సరదా సంభాషణ చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన నటుడు శివకార్తికేయన్, రిటైర్మెంట్ ఆలోచనలు పక్కనపెట్టి మరికొన్నేళ్లు సీఎస్‌కే పసుపు జెర్సీలో కొనసాగాలని ధోనీని కోరారు. దీనికి ధోనీ నవ్వుతూ బదులిస్తూ... "ప్రస్తుతం 44 ఏళ్ల వయసులో ఫిట్‌నెస్ కాపాడుకోవడం చాలా కష్టంగా ఉంది. అయినా కంగారు పడకండి... నేను 60 ఏళ్ల వరకు ఆడినా ఆశ్చర్యపోవద్దు" అని అన్నారు. ఈ మాటలకు స్టేడియంలోని అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వాస్తవానికి ఐపీఎల్ 2026 సీజన్ మొత్తానికి ధోనీ అందుబాటులో ఉంటాడని సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే, జట్టులో ఆయన పాత్ర క్రమంగా మారుతోంది. 2024 సీజన్‌కు ముందు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న ధోనీ, రుతురాజ్ గైక్వాడ్‌కు పగ్గాలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన ప్రధానంగా ఫినిషర్ పాత్రకే పరిమితమయ్యారు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన, జట్టులోకి సంజు శాంసన్ వంటి ఆటగాళ్లు రావడంతో భవిష్యత్తులో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా పంచుకునే అవకాశం కనిపిస్తోంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచి తీవ్రంగా నిరాశపరిచిన సీఎస్‌కేకు, ఈ దశలో ధోనీ అనుభవం ఎంతో కీలకం. రుతురాజ్ గైక్వాడ్ నాయకత్వంలో జట్టును పునర్నిర్మించే క్రమంలో 2026 సీజన్ ఈ దిగ్గజ ఆటగాడికి ఘనమైన వీడ్కోలు పలికే చివరి అధ్యాయం కావొచ్చని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా ధోనీ క్రీజులో ఉన్నంత వరకు అభిమానులకు పండగే.




# ఎస్కలేటర్‌పై దిశా పటానీ టాప్ యాంగిల్ సరికాదేమో!



ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న లక్మే ఫ్యాషన్ వీక్ గ్లామర్ ప్రపంచంలో హాట్ టాపిగ్గా మారింది. ఈ వేదికపై బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ తనదైన శైలిలో ర్యాంప్ వాక్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. అదిరిపోయే డిజైనర్ దుస్తుల్లో దిశా మెరిసిన తీరు ఫ్యాషన్ ప్రియులను మంత్రముగ్ధులను చేసింది. దిశాతో పాటు మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా వంటి టాప్ హీరోయిన్లు కూడా ఈ వేడుకలో పాల్గొని తమ తళుకుబెళుకులతో మురిపించారు. అయితే ఈ వేడుకలో దిశా పటానీకి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విమర్శలకు దారితీసింది. దిశా వేదికకు వెళ్లకకు వెళ్లే ముందు ఎస్కలేటర్ పై వెళుతుంటే.. ఒక వ్యక్తి తనను –టాప్ యాంగిల్–లో వీడియో తీయడం చర్చనీయాంశమైంది. ఒక దురభిమాని చేసిన ఈ పనిని నెటిజన్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. అభిమానం పేరుతో ఇలాంటి పనులు చేయడం ఏమాత్రం సరికాదని.. దీనిని –దురభిమానం–గా భావించాలని సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు. కథానాయికలు పబ్లిక్ ప్రాపర్టీ కాదు.. వారికి కూడా వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవం ఉంటాయని నెటిజన్లు హితవు పలుకుతున్నారు. వారు ధరించే దుస్తుల విధానాన్ని బట్టి వారిని తక్కువ చేసి చూడకూడదని.. సెలబ్రిటీల విషయంలో కనీస గౌరవంతో వ్యవహరించాలని సూచిస్తున్నారు. అసభ్యంగా ఫోటోలు తీయడం, రహస్యంగా వీడియోలు తీయడం వంటి చర్యలు నేటి డిజిటల్ యుగంలో పెరిగిపోతున్నాయని.. ఇలాంటి వికృత చేష్టలను కచ్చితంగా నిరసించాల్సిందేనని అభిప్రాయపడుతున్నారు. ఇక లక్మే ఫ్యాషన్ వీక్ విషయానికి వస్తే.. గత కొద్ది రోజులుగా ఈ ఈవెంట్ ముంబైలో ఎంతో ఘనంగా సాగుతోంది. ఈ ఏడాది ఫ్యాషన్ వీక్ ఐదు రోజుల పాటు జరగనుంది. ఇప్పటివరకు దిశా పటానీ, తమన్నా భాటియా, సారా అలీ ఖాన్, అనన్యా పాండే వంటి దాదాపు 15 మందికి పైగా అగ్ర కథానాయికలు పలు టాప్ బ్రాండ్ల తరపున ర్యాంప్ వాక్ చేసి సందడి చేశారు. మరో రెండు రోజుల్లో మరికొంతమంది స్టార్ సెలబ్రిటీలు ఈ వేదికపై మెరిసే అవకాశం ఉంది. ఫ్యాషన్ షోలు అనేవి కళను, సృజనాత్మకతను ప్రదర్శించే వేదికలు. అక్కడ నటీనటుల అందాన్ని ఆస్వాధించడంలో తప్పులేదు కానీ.. వారి గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించడం సభ్యసమాజానికి మంచిది కాదు. దిశా పటానీ వీడియో విషయంలో వ్యక్తమవుతున్న నిరసన.. భవిష్యత్తులోనైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలని కోరుకుందాం. ఇక కెరీర్ మ్యాటర్ కి వస్తే.. దిశా పటానీని చివరిగా తెలుగు ఆడియెన్ కల్కి 2898 ఏడి, కంగువ చిత్రాలలో వీక్షించారు. మళ్లీ ఎప్పుడు ఈ భామ సౌత్ లో కనిపిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఫ్లాపుల కారణంగా.. అటు హిందీలో ఈ భామ కెరీర్ అంతంత మాత్రంగానే సాగుతోంది.





Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965